thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 324 | కరీంనగర్ శుక్రవారం, 30 జనవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

### కమీషన్ పెంపు కోసం వంట గ్యాస్ డీలర్ల సమ్మె హెచ్చరిక

న్యూఢిల్లీ : తమ సమస్యలను పరిష్కరించకుంటే దేశ వ్యాప్త సమ్మె చేస్తామని వంటగ్యాస్ డీలర్లు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇందుకు మూడు వారాల సమయం ఇస్తున్నట్టు ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ల సంఘం అధ్యక్షుడు బి.ఎస.శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పెట్రోలియం, సహజవాయుల మంత్రిత్వ శాఖకు కూడా లేఖ రాసినట్టు తెలిపారు. సిలిండర్ల పంపిణీకి సంబంధించిన నిర్వహణ వ్యయం పెరుగుతున్న దృష్ట్యా ప్రస్తుతం ఇస్తున్న కమీషన్ సరిపోవడం లేదని, అందువల్ల దాన్ని కనీసం రూ.150కి పెంచాలని డిమాండు చేశారు. తాము అడగకపోయినా ఆయిల్ కంపెనీలు వాణిజ్య సిలిండర్లను పంపిస్తున్నాయని, ఇది తమకు సమస్యలు తెచ్చిపెడుతున్నాయని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అమలు చేస్తున్న ఈ విధానాన్ని వెంటనే నిలిపివేయాలనీ డిమాండు చేశారు.

# ప్రజలకు మేలు చేకూర్చేలా నిర్ణయాలు

## దేశ సంక్షేమమే తమ లక్ష్యమన్న ప్రధాని

### పార్లమెంటు ఆవరణలో మీడియా మాట్లాడిన ప్రధాని మోదీ




న్యూఢిల్లీ: పార్లమెంటు సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మీడియాతో ప్రధాని మోదీ మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ అభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం ఏ నిర్ణయమైనా తీసుకుంటుందని అన్నారు. ప్రజల అభివృద్ధి సౌభాగ్యాలే లక్ష్యంగా పథకాలు, నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఆధునిక సాంకేతికతలో మార్పులకు అనుగుణంగా తామూ మారతామని చెప్పారు. అయితే, ప్రజలకు మేలు చేకూర్చే విధంగా తమ నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకుంటూ సాంకేతికతను జోడించి ముందుకు సాగుతామని అన్నారు. ప్రజల స్థానాన్ని సాంకేతికత భర్తీ చేయజాలదని కూడా ప్రధాని స్పష్టం చేశారు. రాష్ట్రపతి ప్రసంగం ప్రజల ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించిందని అన్నారు. ప్రపంచానికి భారత్ ఆశాకిరణమని చెప్పారు. ఇక ఈయూతో వాణిజ్య ఒప్పందంతో కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని ప్రధాని తెలిపారు. ఈ ఒప్పందం నుంచి భారత పారిశ్రామిక వర్గాలు లబ్ధిపొందాలని సూచించారు. నాణ్యమైన ఉత్పత్తులను ఈయూ దేశాలకు అందించాలని సూచించారు.

**సాంకేతికత మనుషులకు ప్రత్యామ్నాయం కాదు:** ఐరోపా సమాఖ్యతో కుదిరిన స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం గురించి ప్రస్తావించారు. అది శుభసూచికమన్నారు. రీఫార్మ్-పెర్ఫామ్-ట్రాన్స్‌ఫామ్ అంటూ బడ్జెట్ టోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం భారత్ రీఫార్మ్ ఎక్స్‌ప్రెస్‌లో ముందుకెళ్తోందని, ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం లభిస్తోందని చెప్పారు.

అలాగే సాంకేతికత మనుషులకు ప్రత్యామ్నాయం కాదని మోదీ అన్నారు. "రాష్ట్రపతి ప్రసంగం ప్రజల ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించింది. ప్రపంచానికి భారత్ ఆశాకిరణం. అన్నిరంగాల్లో అభివృద్ధి దిశగా భారత్ దూసుకెళ్తోంది. వికసిత్ భారత్ కోసం ఎంపీలు కృషి చేయాలి. పెండింగ్ సమస్యలకు పరిష్కారాలు లభిస్తుండటంతో భారత్‌ను సుస్థిరదేశంగా ప్రపంచం చూస్తోంది. ట్రేడ్‌డీల్‌తో కొత్త మార్కెట్ అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. వాటినుంచి తయారీదారులు లబ్ధి పొందాలని కోరుతున్నాను.

ఈయూలోని 27 దేశాలకు నాణ్యమైన ఉత్పత్తులు అందించాలి" అని పేర్కొన్నారు. "మనం టెక్నాలజీతో పోటీపడతాం. దానిని అందిపుచ్చుకుంటాం. దాని సామర్థ్యాన్ని అంగీకరిస్తాం. అయితే అది మనుషులను భర్తీ చేయలేదు" అని అన్నారు.




### ప్రభుత్వ లాంఛనాలతో ముగిసిన

## అజిత్ పవార్ అంత్యక్రియలు

మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ అంత్యక్రియలు ముగిశాయి. గురువారం ఉదయం పుణెలోని బారామతి సమీపంలోగల విద్యా ప్రతిష్ఠాన్ మైదానంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించారు. పవార్ పెద్దకుమారుడు అంత్యక్రియలను నిర్వహించారు. అంతకుమునుపు, కేంద్ర మంత్రి అమిత్ షా, బీజేపీ చీఫ్ నితిన్ నబిన్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ శ్రద్ధాంజలి ఘటించారు. తమ అభిమాన నేతకు తుది వీడ్కోలు పలికేందుకు ప్రతిష్టాన్ మైదానానికి ప్రజలు పోటెత్తడంతో ఆ ప్రాంతం జన సంద్రాన్ని తలపించింది. ప్రభుత్వ లాంఛనాల నడుమ తండ్రి చితికి ఆయన కుమారుడు నిప్పంటించారు. అజిత్ పవార్‌కు తుది వీడ్కోలు పలుకుతూ ఆయన భార్య సునేత్ర, ఇతర కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. అజిత్ పవార్‌ను కోల్పోయినందుకు పార్టీ నేతలు, అభిమానులు శోకసంద్రంలో కూరుకుపోయారు. బుధవారం ఉదయం బారామతి విమానాశ్రయం సమీపంలో జరిగిన ప్రమాదంలో అజిత్ పవార్ దుర్మరణం చెందిన సంగతి తెలిసిందే. విమానం రన్‌వేపై దిగేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో కుప్పకూలి మంటల్లో చిక్కుకుంది. దీంతో అజిత్ పవార్‌తో పాటు మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారం నిమిత్తం బారామతికి వస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. పవార్‌కు భార్య సునేత్ర పవార్ (రాజ్యసభ సభ్యురాలు), ఇద్దరు కుమారులు పార్థ్, జే ఉన్నారు.

# మున్సిపోల్స్‌కు రేవంత్ టీం సర్వం సన్నద్ధం

## ఫిబ్రవరి 2న సీఎం రేవంత్ కీలక సమావేశం



ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. ఫిబ్రవరి 1న తిరిగి హైదరాబాద్ రానున్నారు. సీఎం రేవంత్ రాష్ట్రానికి రాగానే ఫిబ్రవరి 2న కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలు, మంత్రులతో కీలక సమావేశం నిర్వహించనున్నారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు, మంత్రులకు అప్పగించే భాధ్యతలు, రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలపై విస్తృత చర్చ జరపనున్నారు.

సింగరేణి టెండర్ల వ్యవహారం, ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ, మున్సిపల్ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు కైవసం చేసుకోవడం వంటి అంశాలపై సుదీర్ఘ మంతనాలు జరుపుతారని మీడియా వర్గాల సమాచారం. ఇక ఫిబ్రవరి 3 నుంచి మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. ఫిబ్రవరి 3న మిర్యాలగూడ, 4న జగిత్యాల, 5న చేవెళ్ల, 6న భూపాలపల్లి, 7న మెదక్, 8న నిజామాబాద్‌లో సీఎం రేవంత్ ఎన్నికల ప్రచార సభలు జరగనున్నాయి.

**సీఎం రేవంత్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల ప్రచారం షెడ్యూల్ ఇదే!...** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి షెడ్యూల్ ఖరారైంది. రాష్ట్రంలోని ఇది రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, ఏడు మున్సిపల్ కార్పొరేషన్లకు ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ కూడా ప్రారంభం అయింది. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీలు తమ ప్రచారాన్ని విస్తృతం చేయడంపై దృష్టి సారించాయి. అధికార కాంగ్రెస్ పార్టీ కూడా ప్రచార ప్రణాళికలను సిద్ధం చేసుకుంది. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి ఆయా ప్రాంతాల్లో పర్యటించి ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి.. అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయంలోని కెన్నడీ స్కూల్‌లో నాయకత్వ శిక్షణ కార్యక్రమానికి హాజరవుతున్న సంగతి తెలిసిందే. హైదరాబాద్ నగరానికి తిరిగి వచ్చిన తర్వాత రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారం ప్రారంభించే అవకాశం ఉంది. సీఎం రేవంత్ రెడ్డి ఫిబ్రవరి 1వ తేదీ రాత్రి హైదరాబాద్ నగరానికి చేరుకుంటారు. ఫిబ్రవరి 3న ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మిర్యాలగూడలో, ఫిబ్రవరి 4న కరీంనగర్ జిల్లాలోని జగిత్యాలలో, ఫిబ్రవరి 5న రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్లలో, ఫిబ్రవరి 6న భూపాలపల్లిలో, ఫిబ్రవరి 7న మెదక్‌లో, ఫిబ్రవరి 8న నిజామాబాద్‌లో సీఎం రేవంత్ బహిరంగ సభల్లో ప్రసంగిస్తారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. అమెరికా పర్యటనలో ఉన్నప్పటికీ... మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి పార్టీ అభ్యర్థుల ఖరారు, ప్రచార సరళిని సీఎం రేవంత్ రెడ్డి పర్యవేక్షించినట్టుగా తెలుస్తోంది. ఇన్‌ఛార్జ్ మంత్రుల నేతృత్వంలోని స్క్రీనింగ్ కమిటీలు, ఏజెన్సీలు నిర్వహించిన సర్వేల ఆధారంగా మున్సిపల్ ఎన్నికలకు అభ్యర్థులను ఖరారు చేయాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. అభ్యర్థులను ఖరారు చేసేటప్పుడు గెలుపు అవకాశాలతో పాటు, సామాజిక న్యాయం, పార్టీ పట్ల విధేయత, నిజాయితీ, క్రమశిక్షణను కూడా పరిగణనలోకి తీసుకోవాలని స్క్రీనింగ్ కమిటీలకు నాయకత్వం వహిస్తున్న మంత్రులకు రేవంత్ సూచించారు. ఇక, తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారం (జనవరి 27) రోజున విడుదల చేసింది.


7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికలకు నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి రాణి కుముదిని వెల్లడించారు. ఫిబ్రవరి 11న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరగనుందని... 13న ఎన్నికల కౌంటింగ్ జరగనుందని తెలిపారు. జనవరి 28 నుంచి 30 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని పేర్కొన్నారు. ఇకపోతే మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని చెప్పారు.

**ఎన్నికల షెడ్యూల్ ఇలా...** నోటిఫికేషన్ విడుదల: 28-01-2026 నామినేషన్ల స్వీకరణ: 28.-01-2026 నామినేషన్ల దాఖలుకు చివరి తేది:30-01-2026 నామినేషన్ల పరిశీలన:31-01-2026 నామినేషన్లపై అభ్యంతరాలు:01-02-2026 అభ్యంతరాలపై పరిష్కారం:02-02-2026 నామినేషన్ల ఉపసంహరణ గడువు:03.02-2026 బరిలో ఉన్న అభ్యర్థుల జాబితా విడుదల:03-02-2026 పోలింగ్: 11-02-2026 రీపోలింగ్ (ఎక్కడైనా అవసరమైతే): 12-02-2026 కౌంటింగ్:13-02-2026 (ఉదయం 8 గంటల నుంచి)

# ప్రమాదకరంగా మేడిగడ్డ డ్యామ్.. కేంద్రం కీలక వ్యాఖ్యలు..

ఢిల్లీ: కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో కీలకమైన మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజ్ దేశంలోనే అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్న డ్యామ్‌ల జాబితాలో చేరింది. 2025 పోస్ట్-మాన్సూన్ (వర్షాకాలం తర్వాత) తనిఖీల్లో తెలంగాణలోని మేడిగడ్డ బ్యారేజ్ ను జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) కేటగిరి-1గా వర్గీకరించింది. మరమ్మతులు, నివారణ చర్యలు చేపట్టకపోతే బ్యారేజ్ భద్రతకే ముప్పు ఏర్పడే పరిస్థితి ఉందని ఎన్‌డీఎస్‌ఏ నివేదిక స్పష్టం చేసిందని కేంద్ర జలశక్తి శాఖ వెల్లడించింది. లోక్‌సభలో దేశవ్యాప్తంగా డ్యామ్‌ల సేఫ్టీపై అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

దేశవ్యాప్తంగా కేటగిరీ-1లో గుర్తించిన మూడు డ్యామ్‌లలో తెలంగాణలోని మేడిగడ్డ బ్యారేజ్ ఒకటి కాగా.. మిగతావి ఉత్తరప్రదేశ్‌లోని లోయర్ ఖజూరి డ్యామ్, జార్ఖండ్‌లోని బోకారో బ్యారేజ్‌లు ఉన్నాయని స్పష్టం కేంద్రమంత్రి స్పష్టం చేశారు. డ్యామ్ సేఫ్టీ యాక్ట్-2021 ప్రకారం ప్రతి సంవత్సరం వర్షాకాలం ముందు..తర్వాత తనిఖీలు తప్పనిసరి. 2025లో దేశవ్యాప్తంగా ప్రీ-మాన్సూన్ (వర్షాకాలానికి ముందు) 6,524 డ్యామ్‌లు పోస్ట్-మాన్సూన్ (వర్షాకాలం తర్వాత).. 6,553 డ్యామ్‌ల తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఈ పరిశీలనల ఆధారంగా డ్యామ్‌లను మరమ్మతుల




అత్యవసరతను బట్టి వర్గీకరించినట్లు కేంద్రమంత్రి తెలిపారు. మేడిగడ్డ బ్యారేజ్ విషయంలో ఎన్‌డీఎస్‌ఏ సూచించిన నివారణ, రక్షణ చర్యలను తక్షణమే చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. కాగా.. దేశంలో 50 ఏళ్లు దాటిన 1,681 డ్యాములు ఉన్నాయని రాజ్‌భూషణ్ చౌదరి స్పష్టం చేశారు.




హైదరాబాద్, జనవరి 29: ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సిట్ అధికారులు నోటీసులు ఇవ్వనున్నారు. ప్రధానంగా ఇప్పటివరకు ఈ కేసుకు సంబంధించి మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, మాజీ ఎంపీ సంతోష్ రావులను సిట్ విచారించిన విషయం తెలిసిందే. తాజాగా.. కేసీఆర్‌నూ విచారించాలని సిట్ నిర్ణయించింది. ఇందులో భాగంగానే రేపు(శుక్రవారం) ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌కు నోటీసులు అందజేసి.. అక్కడే విచారణ చేపట్టేందుకు సిట్ అధికారులు సన్నద్ధమైనట్టు సమాచారం. రెండేళ్లుగా సాగుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు తుది అంకానికి చేరుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సిట్‌ను పూర్తిగా ప్రక్షాళన చేసి.. సీపీ సజ్జనార్ నేతృత్వంలో మార్పులు చేర్పులు చేశారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన పోలీస్ అధికారులను విచారించి, వారిని రిమాండ్‌కు తరలించారు. ఆ తరువాత ఫోన్ ట్యాపింగ్‌లో బాధ్యులుగా ఉన్నవారిని విచారించి వారి నుంచి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. గత ప్రభుత్వ పెద్దలుగా ఉన్న కేటీఆర్, హరీశ్ రావు, సంతోష్ రావులను ఇప్పటికే సిట్ అధికారులు విచారించారు. ఈ కేసులో భాగంగా.. మాజీ ముఖ్యమంత్రిని సిట్ అధికారులు విచారించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌కు నోటీసులు అందజేసి.. అక్కడే విచారణ చేపట్టే అవకాశముంది. అయితే కేసీఆర్ ఈ విచారణకు హాజరవుతారా? లేదా? అనేది ఉత్కంఠగా మారింది.



# విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లు..

## హార్వర్డ్ విద్యార్థులు తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్లు కావాలి: సీఎం రేవంత్

తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంటోంది.

తన పర్యటనలో భాగంగా సీఎం పలు కీలక సమావేశాలు, అంతర్జాతీయ సంస్థలతో చర్చలు, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ముఖ్యంగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో భారతీయ విద్యార్థులతో జరిగిన భేటీ.. రాజకీయ, విద్య, ఆర్థిక వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది.

**అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు కోసం..** భారతీయ విద్యార్థుల ప్రత్యేక ఆహ్వానం మేరకు క్యాంపస్‌ను సందర్శించారు సీఎం. ఈ మేరకు విద్యార్థులతో తన ఆలోచనలను పంచుకున్నారు.

సీఎం అమెరికా పర్యటన తెలంగాణకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడమే కాకుండా విదేశాల్లో ఉన్న విద్యార్థులను రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములను చేసేలా ఉంది.

**విజయ మంత్రం..** విద్యార్థులతో జరిగిన చర్చా గోష్ఠిలో సీఎం రేవంత్ తన రాజకీయ ప్రస్థానాన్ని, ఎదుర్కొన్న సవాళ్లను వివరించారు. విజయం అనేది అదృష్టం వల్ల రాదని.. నిరంతర కృషి, లక్ష్యం పట్ల స్పష్టత ఉంటేనే సాధ్యమని తన విజయ మంత్రాన్ని విద్యార్థులకు బోధించారు. కెరీర్ ప్రారంభంలో ఎదురయ్యే ఒడుదొడుకులను ఎలా అధిగమించాలో విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

**రైజింగ్ తెలంగాణ..** విజన్ తెలంగాణను గ్లోబల్ మ్యాప్‌లో అగ్రస్థానంలో నిలబెట్టడమే తన ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను కేవలం ఐటీ హబ్‌గానే కాకుండా అన్నిరంగాల్లోనూ మేటిగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు.

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్ట్ గురించి ప్రస్తావించారు. తెలంగాణ అభివృద్ధిలో అంతర్జాతీయ ప్రమాణాలను ఎలా పాటిస్తున్నామో చెప్పారు.

**యువతే భారత భవిష్యత్తు..** భారతదేశ అభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలకమని సీఎం అభిప్రాయపడ్డారు. విద్యార్థులు పొందుతున్న ఈ ప్రపంచ స్థాయి విద్య, కేవలం మీ కెరీర్ కోసమే కాకుండా దేశాభివృద్ధికి ఉపయోగపడాలని మార్గనిర్దేశం చేశారు. భారతీయ యువత మేధస్సు ప్రపంచాన్ని శాసిస్తోందని వ్యాఖ్యానించారు.

**బ్రాండ్ అంబాసిడర్లుగా విద్యార్థులు..** హార్వర్డ్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు, అంతర్జాతీయ వేదికలపై హైదరాబాద్, తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించాలని సీఎం పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉన్న అద్భుతమైన అవకాశాల గురించి ప్రపంచానికి చాటి చెప్పాలని కోరారు.

# కేసీఆర్‌కు సిట్ నోటీసులు.. బీఆర్ఎస్ క్యాంప్‌లో ఉత్కంఠ..



హైదరాబాద్, జనవరి 29 : తెలంగాణ రాజకీయాల్లో ఫోన్ ట్యాపింగ్ కేసు ప్రకంపనలు సృష్టిస్తోంది. మాజీ సీఎం కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో బీఆర్ఎస్ శ్రేణుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. రేపటి విచారణకు కేసీఆర్ హాజరవుతారా లేదా అన్న అంశంపై పార్టీ అగ్రనాయకత్వం తర్జనభర్జన పడుతోంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు నోటీసులు ఇవ్వడంతో కేసీఆర్ తదుపరి అడుగుపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఈ నోటీసులపై చర్చించేందుకు పార్టీ కీలక నేతలు సిద్ధమవుతున్నారు.

**ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కీలక భేటీ..** ప్రస్తుతం సిద్దిపేటలో హరీశ్‌రావు, సిరిసిల్లలో కేటీఆర్ పర్యటిస్తున్నారు. అయితే, తాజా పరిణామాల నేపథ్యంలో ఈరోజు సాయంత్రం 6 గంటల తర్వాత కేటీఆర్, హరీశ్‌రావు నేరుగా ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు చేరుకోనున్నారు. కేసీఆర్‌తో భేటీ అయి.. సిట్ నోటీసులపై చట్టపరంగా ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై చర్చించనున్నారు. విచారణకు హాజరుకావాలా? లేక న్యాయ నిపుణుల సలహాతో గడువు కోరాలా? అనే దానిపై ఈరోజు సాయంత్రం ఒక స్పష్టతకు వచ్చే అవకాశం ఉంది.

**సమయం కోరే యోచనలో కేసీఆర్?..** బీఆర్ఎస్ వర్గాల సమాచారం ప్రకారం, రేపు (జనవరి 30) మధ్యాహ్నం 3 గంటలకు జరగాల్సిన విచారణకు కేసీఆర్ హాజరయ్యే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. గతంలో కాళేశ్వరం కమిషన్ విచారణ సమయంలోనూ కేసీఆర్ అదనపు సమయం కోరిన విషయం తెలిసిందే. అదే తరహాలో ఇప్పుడు కూడా సిట్ అధికారులకు లేఖ రాసి కొంత సమయం అడిగే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల హడావుడి ఉండటంతో, ఎన్నికలు ముగిసిన తర్వాతే విచారణకు హాజరుకావాలని కేసీఆర్ భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.

**బీఆర్ఎస్ వాదన..** ఈ నోటీసులను బీఆర్ఎస్ నేతలు రాజకీయ కక్షసాధింపుగా అభివర్ణిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టేందుకు.. ప్రభుత్వం కావాలనే ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆరోపిస్తున్నారు.

**ఉత్కంఠ రేపుతున్న ప్రశ్నలు..** కేసీఆర్ తన నివాసంలో విచారణకు గ్రీన్ సిగ్నల్ ఇస్తారా? ఆరోగ్య కారణాలు లేదా రాజకీయ బిజీ షెడ్యూల్‌ను సాకుగా చూపి వాయిదా కోరతారా? ఒకవేళ కేసీఆర్ గడువు కోరితే, సిట్ అధికారులు అందుకు అంగీకరిస్తారా? లేక తదుపరి చర్యలకు దిగుతారా? మొత్తానికి, ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో జరిగే సాయంత్రం భేటీ తర్వాతే ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ పాత్ర, విచారణపై అసలు సస్పెన్స్ వీడనుంది. ఈ భేటీ తర్వాత కేసీఆర్, కేటీఆర్ అధికారిక ప్రకటన విడుదల చేయొచ్చని వార్తలు వస్తున్నాయి.

## మేడారం అభివృద్ధికి కేంద్రం సాయం చేయలేదు: పొంగులేటి



మేడారం: మేడారం అభివృద్ధికి కేంద్రం నయా పైసా సాయం చేయలేదని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. మేడారంలో మంత్రి సీతక్కతో కలిసి పొంగులేటి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "మేడారం అభివృద్ధికి కేంద్రం రూ.3.26 కోట్లు ఇచ్చినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రకటించారు. అందులో వాస్తవం లేదు.

కిషన్‌రెడ్డి మాటలు చెప్పడం తప్ప.. చేసిందేమీ లేదు. మేడారాన్ని పూర్తిస్థాయిలో మేం అభివృద్ధి చేస్తాం" అని తెలిపారు.

## వాటి నుంచి దృష్టి మళ్లించేందుకే కేసీఆర్‌కు నోటీసులు: హరీశ్‌రావు



హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు కేసీఆర్‌పై బురద చల్లాలని ప్రయత్నించడం.. సూర్యునిపై ఉమ్మి వేయడంలాంటిదేనని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడంపై ఆయన స్పందించారు. ప్రజావ్యతిరేకత, సింగరేణి కుంభకోణం నుంచి దృష్టిని మళ్లించేందుకు ఈ నోటీసులు ఇచ్చారని విమర్శించారు. రాజకీయ వేధింపులతో మున్సిపాలిటీ ఎన్నికల్లో లబ్ధి పొందే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. తెలంగాణ సమాజమంతా.. కేసీఆర్ వెంటే ఉందని, రేవంత్‌రెడ్డి రాజకీయ వేధింపులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.



# మేడారంలో భక్తుల కిటకిట

మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర రెండో రోజు వైభవంగా జరుగుతోంది. ఇప్పటికే భక్తుల జయజయధ్వానాల నడుమ సారలమ్మ పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపైకి విచ్చేశారు. జాతర సందర్భంగా మేడారం భక్తులతో కిటకిటలాడుతోంది. జంపన్నవాగు పరిసరాలు జనసంద్రంగా మారాయి.



# బీఆర్ఎస్ యాక్షన్ బట్టే.. నా రియాక్షన్

## ఖైరతాబాద్ ప్రజలే నా బలం.. పదవుల కోసం వెళ్లలేదు: ఎమ్మెల్యే దానం

హైదరాబాద్ : ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత పిటిషన్ విషయంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌పై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈనెల 30న విచారణ జరపాలని నిర్ణయించారు.

దీనికి సంబంధించి ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు.. పిటిషనర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో దానం మాట్లాడుతూ.. పదవుల కోసం తాను ఎక్కడికీ వెళ్లలేదని, విస్మరించారు కాబట్టే వదలాల్సి వచ్చిందని వివరించారు. 'నేను ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజలు నాకు సహకరిస్తారు. ప్రజలపై ఆధారపడే నా నిర్ణయాలు ఉంటాయి. ప్రజల ఆశీర్వాదంతోనే ఆరుసార్లు గెలిచాను. ఖైరతాబాద్ ప్రజలే నాకు బలం. సేవ చేయాలనే ఉద్దేశం తప్ప పదవుల కోసం నేనెప్పుడూ ఆలోచించలేదు. ఎంతవరకు అయితే అంతవరకు ఫైట్ చేస్తాను' అని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. స్పీకర్ నోటీసులు తనకు అందలేదని.. పిటిషనర్‌కు నోటీసులు అంది ఉండవచ్చన్నారు దానం. ఉన్న విషయాలను జస్టిఫై చేసుకోవడానికి లీగల్ అంశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. స్పీకర్ ఏం అడుగుతారో దానికి సమాధానం చెబుతానని, ఆ ప్రశ్నల ఆధారంగా తన సమాధానాలు ఉంటాయని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.



# మాజీ మంత్రి మల్లారెడ్డి స్టెప్పులు!

మేడ్చల్ పట్టణం: తెలంగాణలో మున్సిపల్ ఎన్నిక ప్రచారం ఊపందుకుంది. మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి పార్టీ నేత మల్లారెడ్డి తనదైన శైలిలో ప్రచార కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధి రాజబొల్లారం తండాలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులతో కలిసి హుషారుగా స్టెప్పులేశారు. అందరిలోనూ ఉత్సాహాన్ని నింపారు.



# ఇది విచారణ కాదు.. ప్రతీకారం

హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్‌కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు ఇవ్వడంపై ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. కక్ష సాధింపు రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇది విచారణ కాదని, ప్రతీకారమని, రాజకీయ దురుద్దేశమని విమర్శించారు. సుదీర్ఘ ఉద్యమం చేసి తెలంగాణను సాధించిన మహానాయకుడు కేసీఆర్ అని అన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. "సాధించిన తెలంగాణను పదేళ్ల తన పాలనతో ప్రపంచానికి చాటి చెప్పిన నాయకుడు కేసీఆర్. వివిధ పథకాలతో తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిన గొప్ప విజనరీ. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం.. అడ్డగోలు హామీలు ఇచ్చి, అబద్ధాల పునాదుల మీద అధికారంలోకి వచ్చి.. ఏడాదిలోనే ప్రజల నోట్లో మట్టి కొట్టి, ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైంది. వారి వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, పాలనా లోపాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు.. ఇప్పుడు విచారణల పేరుతో కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం అత్యంత దుర్మార్గమైన కక్షసాధింపు రాజకీయానికి నిదర్శనం. కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు. నోటీసులతో, బెదిరింపులతో తెలంగాణ చరిత్రను చెరిపేయలేరు. తెలంగాణ ఉద్యమాన్ని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానిస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు. ప్రజల పక్షాన నిలబడి, ప్రజల గొంతుకగా ఈ అన్యాయ పాలనపై పోరాటం కొనసాగిస్తాం"అని కేటీఆర్ తెలిపారు.

**ఎన్నికల నేపథ్యంలోనే కేసీఆర్‌కు నోటీసులు: కవిత..** ఎన్నికలు జరుగుతున్నాయనే కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇచ్చిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ బాధాకరమన్న ఆమె.. సిట్ విచారణ సీరియస్‌గా జరగట్లేదని ఆక్షేపించారు. ఈ కేసులో విచారణ ఎక్కడో ఒక దగ్గర పూర్తికావాలని పేర్కొన్నారు. విచారణను పూర్తి చేసే ఉద్దేశం ఉందా లేదా అనేది ఎవరికీ అర్థం కావడంలేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ నేరస్థులకు శిక్షపడాల్సిందేనని స్పష్టం చేశారు.



# కిలో వెండి రూ. 4 లక్షలు దాటేసింది..!

దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు అందనంత వేగంగా పరుగులు పెడుతున్నాయి. ఓవైపు బంగారం ధర రూ.2లక్షల దిశగా దూసుకెళ్తుండగా.. వెండి ధర ఫ్యూచర్స్ మార్కెట్‌లో ఏకంగా రూ.4 లక్షలు దాటి ఆల్‌టైం గరిష్ఠానికి చేరింది. హైదరాబాద్ మార్కెట్‌లో ఉదయం 10 గంటల సమయంలో 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధర రూ. 1,85,000 దాటింది. అటు వెండి ధర రూ.4,00,000 పలికింది. హైదరాబాద్ విపణిలో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్ల) బంగారం ధర రూ.1,73,300గా ఉంది. కొన్ని గంటల్లోనే రూ.12 వేలు పెరగడం గమనార్హం. కిలో వెండి ధర రూ.3,79,700 వద్ద ముగియగా.. నేడు ఏకంగా రూ.21 వేలకు పైగా పెరిగింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్‌లో మార్చి డెలివరీ కాంట్రాక్టుకు ఫ్యూచర్స్‌లో వెండి ధర గురువారం ఒక్కరోజే రూ.22,090 పెరిగి రూ.4,07,456 వద్ద సరికొత్త జీవనకాల గరిష్ఠాన్ని తాకింది. అటు ఫిబ్రవరి డెలివరీ కాంట్రాక్టుకు బంగారం ఫ్యూచర్స్ 10 గ్రాము ల ధర కూడా రూ.14,586 పెరిగి రూ.1,80,501కి చేరింది.

అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ లోహాల ధరలు రికార్డు స్థాయిలో పరుగు లు పెడుతున్నాయి. ఔన్సు వెండి ధర తొలిసారి 5,600 డాలర్ల మార్క్ దాటింది. కమొడిటీ ఎక్స్ఛేంజీలో ఏప్రిల్ డెలివరీకి ఔన్సు ధర 5,626. 8 డాలర్లు పలికింది. ఔన్సు వెండి ధర 119.51 డాలర్లకు చేరింది. అమెరికా డాలర్ విలువ బలహీనపడటం, వెండికి పరిశ్రమల నుంచి డిమాండ్ పెరగడంతో వైట్ గోల్డ్‌కు రెక్కలొచ్చాయని బులియన్ విశ్లేషకులు చెబుతున్నారు. ఇక, అంతర్జాతీయ భౌగోళిక, రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో బంగారం, వెండిని సురక్షిత పెట్టుబడి సాధనంగా మదుపర్లు భావిస్తుండటం కూడా ధరల పెరుగుదలకు కారణంగా నిలిచింది.

# కుష్టు వ్యాధిపై అవగాహన అవసరం

## - జనవరి 30: కుష్టు వ్యాధి నివారణ దినోత్సవం




కుష్టు వ్యాధి బారిన పడిన ప్రజల సంరక్షణ కోసం మహాత్మా గాంధీ చేసిన నిస్వార్థ ప్రయత్నాలు, పడిన శ్రమను గుర్తుగా ఆయన వర్ధంతి అయిన 30 జనవరిని కుష్టు వ్యాధి నివారణ దినోత్సవంగా జరుపు కుంటారు. కుష్ఠ వ్యాధి మైకో బ్యాక్టీరియా లెప్రే అనే బ్యాక్టీరియా వల్ల సోకుతుంది. ఈ వ్యాధికి సకాలంలో చికిత్స చేయించు కోకపోతే అది పెరిగి చర్మానికి, నరాలకు, కాళ్లు, చేతులు, కళ్లకు హాని కలిగిస్తుంది. ముఖ్యంగా చర్మానికి, నరాలకు సోకుతుంది. చాలా నెమ్మదిగా వ్యాధి లక్షణాలు బహిర్గత మవుతాయి. ప్రారంభ దశలో గుర్తించి మల్టీ డ్రగ్ థెరపీ తీసుకుంటే వ్యాధి అంగ వైకల్యానికి దారి తీయదు. చికిత్స పూర్తయిన, చికిత్స తీసుకుంటున్న రోగుల్లో అంగవైకల్యం ఉంటే శస్త్ర చికిత్స ద్వారా సరిచేయవచ్చు. ఈ వ్యాధిని రెండు రకాలుగా గుర్తించి వాటికి వైద్యాన్ని అందిస్తారు. మొదటగా ఎంబీ (మల్టీ బ్యాచ్‌లరీ) అంటే మచ్చల సంఖ్య, స్పర్శ కోల్పోయిన వారికి ఏడాదిపాటు చికిత్స అందిస్తారు. రెండోది పీబీ (పాసి బ్యాచులరీ) ఇది కూడా మచ్చల సంఖ్య, స్పర్శ కోల్పోయిన వారికి ఆరు నెలలపాటు చికిత్స అందిస్తారు. 20శాతం మానవుడికి ఇది అంటువ్యాధి. ఈ వ్యాధి కేవలం బ్యాక్టీరియా ద్వారానే (దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు) మాత్రమే సోకుతుంది. ఈ వ్యాధి లక్షణాలు బయట పడటానికి 6 నెలల నుంచి 20ఏండ్ల సమయం పడుతుంది. ఈ సమయాన్ని ఇంక్‌పేషెంట్ పీరియడ్ అని అంటారు. వ్యాధి అభివృద్ధి లక్షణాలలో నరాల, శ్వాసనాళ, చర్మం, కళ్ళు క్షీణించడం ఉంటాయి, దీనివల్ల నొప్పి తెలుసుకునే సామర్థ్యం కోల్పోవడం, పునరావృత గాయాల కారణంగా అంత్య భాగాల పూర్తిగా దెబ్బతింటాయి. బలహీనత మరియు చూపు పేలవంగా ఉంటుంది. శరీరంపై పాలిపోయిన లేదా రాగి రంగు మచ్చలు, మచ్చలపై స్పర్శ లేక పోవడం , నొప్పి తెలియకుండా ఉండడం, పాదాలు, చేతులు, వేళ్ల తిమ్మిర్లు ఉన్నా, చర్మం దళసరిగా మారడం, చర్మం.. ముఖ్యంగా ముఖం నూనె రాసినట్లుగా నిగనిగలాడుతూ కనిపించడం ప్రధాన లక్షణాలు కనిపిస్తాయి. కుష్టు వ్యాధి వంశపారంపర్యం కాదు. ఈ వ్యాధి ఎవరికైనా రావచ్చు, వయస్సు, లింగ భేదం లేదు. 1940లో కుష్టు వ్యాధి నివారణకు డప్సోన్ కనుగొనబడే వరకు కుష్టు వ్యాధి చికిత్స కోసం చౌల్మూగ్ర నూనెను వాడేవారు. 1970లో కుష్టు వ్యాధి నయంచేయడానికి రిఫాంపిసిన్, చలోఫజీమైన్ మరియు డప్సోన్ లతో కలసి ఉన్న బహుళ ఔషధ చికిత్స కనుగొన బడినప్పటికీ, 1982నుండి ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సుల మేరకు విస్తృతంగా వాడుకలోకి వచ్చింది. 1995 నాటికి ప్రపంచవ్యాప్తంగా సుమారు రెండునుంచి మూడు మిలియన్ల మంది ఈ వ్యాధికి గురై, వికలాంగులుగా మారినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలు పేర్కొంటు న్నాయి. గత రెండున్నర దశాబ్దాల కాలంలో సుమారు 15 మిలియన్ల మంది వ్యాధిగ్రస్తులకు చికిత్స చేసి వ్యాధిని తగ్గించారు. ముదిరిన స్థాయిలో ఉండే కుష్టు వ్యాధి గురించి ఇప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా అనే రకాల అపోహలు ఉ న్నాయి. వీటిని ఏజ్ ఓల్డ్ సోషల్ స్టిగ్మా అని కాని లెప్రసీ స్టిగ్మా అని కాని వ్యవహరిస్తుంటారు. ఈ స్టిగ్మా కారణంగానే బాధితులు తొలి దశలోనే స్వయంగా చికిత్సకు వైద్యుల వద్దకు రావడానికి జంకుతుంటారు. అందుకే ప్రజలలో కుష్టు వ్యాధిపై అవగాహన పెంపొందించాలి. వ్యాధి బారినపడ్డ వారికి అవసరమైన మేరకు సాధారణ మరియు ఉచిత చికిత్స అందించడానికి చర్యలు గైకొనాలి. వ్యాధి బారిన పడిన వ్యక్తికి చర్మంపై వచ్చే పుళ్ళు మరియు నరాల బలహీనత వల్ల భౌతిక లోపాల విషయంలో మానసిక ధైర్యం పెంపొందించడానికి కృషి చేయాలి. వ్యాధి బారిన పడిన వారందరికీ అవసరమైన శ్రద్ధ, చికిత్సతో పాటు పునరావాసం కల్పించే చర్యలు తీసుకోవాలి. కుష్టు వ్యాధి నివారణలో భారతదేశం విజయవంతమైన కృషి చేస్తున్నది. 1955లో జాతీయ కుష్టు వ్యాధి నియంత్రణ కార్యక్రమం, 1983లో జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనా కార్యక్రమం ప్రారంభించింది. 1983 నుండి దశల వారీగా బహుళ ఔషధ చికిత్స నిర్వహిస్తూ, 2005లో 10000 మంది జనాభాకు 0.95 మంది చొప్పున మాత్రమే ఉండేట్టుగా 31 డిసెంబర్ 2005 నాటికి కుష్టు వ్యాధి నివారణ జరిగింది. కుష్టు వ్యాధిని, 10000 మంది జనాభాకు ఒకరి వరకు తగ్గించడం ప్రపంచ వ్యాప్తంగా అంగీకరించారు. మార్చి 2011లో ప్రాబల్యం రేటు 10000 జనాభాకు నుంచి 0.69 వద్ద నిలిచింది. 2012 నుండి ప్రత్యేక చర్యలకు ప్రణాళిక చేపట్టడం జరిగింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**


# మంచుతుపాను వేళ అమెరికాలో బతుకు.. నరకానికి నకలు!



అగ్రరాజ్యమనే అహంకారంతో తాను ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లుగా వ్యవహరించే రాజ్యానికి ఎదురే లేదా? దాన్ని కట్టడి చేసే వారే లేరా? అన్న ప్రశ్నలు పలువురి మదిలో మెదులుతూ ఉంటాయి. అయితే.. తిరుగులేని అధికారం.. అంతకు మించిన శక్తి సామర్థ్యాలు ఉన్న వారిని ఎవరూ ఏమీ చేయలేకున్నా.. ప్రకృతి అనేది ఒకటి ఉంటుంది. ఈ భూమి మీద ఎవరూ తనకు మించినోళ్లు కాదన్న విషయాన్ని ప్రకృతి అప్పుడప్పుడు హెచ్చరిస్తూ ఉంటుంది. తాజాగా అమెరికా విషయంలోనూ అదే జరిగిందా? అన్నది ఇప్పుడు చర్చగా మారింది. ఒకరు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ఈ తరహా వ్యాఖ్యలు చేయొచ్చా? అంటే.. తన స్వార్థం.. తాను సంపన్నం కావటానికి ప్రపంచంలోని ఏ దేశ ప్రయోజనాల్ని అయినా తాకట్టు పెట్టేందుకు వెనుకాడని తత్త్వం అగ్రరాజ్యం అణువణువునా ఉంటుంది. అలాంటి వేళలో.. నిజాన్ని నిజంగా మాట్లాడుకోవటంలో తప్పు లేదన్నది ఒక వాదన. అమెరికాలోని దక్షిణ.. ఈశాన్య ప్రాంతాల్లోని రాష్ట్రాల్ని అతలాకుతలం చేసిన మంచు తుపాను ఇప్పుడిప్పుడే నెమ్మదిస్తోంది. ఈ మంచు తుపాను కారణంగా జరిగిన నష్టాన్ని కొన్ని అంశాల్లో చెప్పాల్సి వస్తే.. మంగళవారం నాటికి 8 లక్షల మందికి విద్యుత్ సరఫరా అందటం లేదు. తాజాగా (మన కాలమానం ప్రకారం బుధవారం) అయితే ఇది 5.5 లక్షల మందిగా ఉన్నట్లు చెబుతున్నారు. అమెరికాలో కరెంటు లేకపోవటానికి మించిన నరకం మరొకటి ఉండదు. మనకు మాదిరి కరెంట్ పోవటం అంటే పరిసరాలు చీకటితో నిండిపోవటమే కాదు.. జీవనం దుర్భరంగా మారుతుంది. అమెరికాలో కరెంటు లేకుండా నిమిషం గడవదు. వారి జీవితంలో విద్యుత్ అన్నది ఒక భాగం. ప్రతిది కరెంట్ మీద ఆధారపడి నడిచే బతుకులు. అమెరికా శీతల దేశం కావటం.. మంచు తుపాను వేళ అమెరికాలో దీని ప్రభావం ఉన్న ప్రాంతాల్లో మైనస్ 10 డిగ్రీల నుంచి మైనస్ 30 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఇది మైనస్ 40 నుంచి మైనస్ 50 డిగ్రీల ఫారిన్ హీట్ గా ఉన్నట్లు ప్రజలు ఫీల్ అవుతున్నారు. ఈ స్థాయిలో చలి ఉంటే బయట ఉన్న వ్యక్తి చర్మం కేవలం 10 నిమిషాల్లోనే గడ్డకట్టి పోయే ప్రమాదం పొంచి ఉంటుంది. చికాగో రాష్ట్రంలో మైనస్ 15 డిగ్రీలు నమోదు కాగా.. గాలితో కలిపి మైనస్ 35 డిగ్రీల వరకు ఉన్న పరిస్థితి. అదే ఉత్తర డకోటా.. మిన్నెసోటా లాంటి రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు అత్యంత కనిష్ఠంగా మైనస్ 40 డిగ్రీలు నమోదైన పరిస్థితి. ఉష్ణోగ్రత 32 డిగ్రీల ఫారిన్ హీట్ ఉంటే నీరు గడ్డకట్టటం మొదలవుతుంది. ప్రస్తుతం అమెరికాలోని మంచు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో దీని కంటే తక్కువగా ఉన్నాయి. దీని కారణంగా శరీరం గడ్డకట్టి మొద్దు బారిపోవటం.. శరీర ఉష్ణోగ్రత పడిపోయి ప్రాణాపాయం కలగటం లాంటి ప్రమాదం పొంచి ఉంటుంది. వాతావరణశాఖ తాజా అంచనాల ప్రకారం ఈ తీవ్రమైన చలి జనవరి 31 వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు అమెరికాలో విద్యుత్ సరఫరా ఆగిపోతే.. మెజార్టీ ఇళ్లలో ఎలక్ట్రిక్ హీటింగ్ వ్యవస్థలు పని చేయవు. అదే జరిగితే.. చలితో ఉక్కిరిబిక్కిరి అయ్యే పరిస్థితి. వయసులో ఉన్న వారి పరిస్థితి కొంత వరకు తట్టుకోగలరు. కానీ.. పెద్ద వయస్కులు.. చిన్నపిల్లలు.. వ్యాధులతో సతమతమయ్యే వారికి నరకంలో ఉన్నట్లుగా ఉంటుంది. శరీర ఉష్ణోగ్రతలు ప్రమాదకరంగా పడిపోయి మరణించే అవకాశం ఉంది. ఇంట్లో వేడి లేని కారణంగా వాటర్ పైపుల్లో నీరు గడ్డకట్టి.. అవి కాస్తా వ్యాకోచించి పైపులు పగిలిపోయే పరిస్థితి. దీంతో కరెంటు వచ్చిన తర్వాత ఇల్లు మొత్తం నీటితో నిండిపోయి వేల డాలర్ల ఆస్తినష్టం జరుగుతుంది. కరెంటు లేకపోతే నీటి పంపింగ్ వ్యవస్థలు పని చేయవు నీటిని శుద్ధి చేసే ప్లాంట్లు ఆగిపోతాయి. ఇళ్లు మంచు కారణంగా చలి తీవ్రతను తగ్గించుకునేందుకు వేడి కోసం కార్ గ్యారేజీల్లో కార్లు ఆన్ చేస్తారు. ఇళ్లల్లో బొగ్గు పొయ్యిలు.. జనరేటర్లు వాడతారు. దీని కారణంగా వెలువడే కార్బన్ మోనాక్సైడ్ గాలిని పీల్చి చాలామంది నిద్రలో మరణించే ప్రమాదం పొంచి ఉంది. కరెంటు లేని కారణంగా ఫోన్ ఛార్జింగ్ లేకపోవటం.. ఇంటర్నెట్ వైఫై పని చేయని కారణంగా వాతావరణ హెచ్చరికల్ని అందుకోలేరు. తమ చుట్టూ ఏం జరుగుతుందో అర్థం కాదు. చివరకు అత్యవసర సేవలకు కాల్ చేయటం కూడా కష్టమవుతుంది. ఇదంతా ఒక ఎత్తు అయితే.. తీవ్రమైన మంచు కారణంగా బయటకు అడుగు పెట్టలేని పరిస్థితి. మనకు మాదిరి దగ్గరదగ్గరగా నివాసాలు ఉండని కారణంగా.. ఏదైనా సాయం కోసం ఇతరులను అడగటం అంత తేలిక కాదు. అలా అడిగిన సాయం చేసేందుకు స్పందించే తీరు తక్కువే. తాజామంచు తుపాను కారణంగా అమెరికాకు జరిగిన ఆర్థిక నష్టం అక్షరాల రూ.8.7 లక్షల కోట్ల నుంచి రూ.9.5లక్షల కోట్ల వరకు ఉంటుందని అంచనా. దీని కారణంగా ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో అమెరికా స్థూల జాతీయోత్పత్తి రేటు 0.5 శాతం నుంచి 1.5 శాతం వరకు తగ్గే వీలుంది. జనజీవనం ఎంతలా స్తంభించిందంటే.. శనివారం నుంచి ఇప్పటివరకు మొత్తం 24,500పైగా విమాన సర్వీసులు రద్దుఅయ్యాయి. ఇప్పుడిప్పుడే విమాన రాకపోకలు సాధారణ స్థితికి చేరుకుంటున్నట్లు చెబుతున్నారు. బోస్టన్.. న్యూయార్క్ లో పరిస్థితి ఇప్పటికి సాధారణ స్థితిలోకి రాలేదు. ఈ మంచు తుపాను కారణంగా మరణాలు 38 వరకు చోటు చేసుకున్నట్లు చెబుతున్నారు. న్యూమెక్సికోలోని బోనిటో ఫాల్స్ వద్ద అత్యధికంగా 31 అంగుళాల మంచు కురిసింది. అదే విధంగా న్యూయార్క్ లోని అప్ స్టేట్ ప్రాంతంలో 30 అంగుళాలు.. బోస్టన్ లో 23 అంగుళాల మంచు నమోదైంది. ఇలాంటి వేళలో బతుకు ఎంత కష్టంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇదంతా ఒక ఎత్తు అయితే.. జనవరి 31న తూర్పు తీరంలో మరో మంచు తుపాను వచ్చే వీలుందని అంచనా వేస్తున్నారు. అదే జరిగితే.. ఇప్పటికే అతలాకుతలం అవుతున్న అమెరికన్లకు మరో విషమ పరీక్ష సిద్ధంగా ఉన్నట్లు చెప్పాలి. తూర్పు తీరంలో దాదాపు 14 రాష్ట్రాలు ఉంటాయి.

# మహాత్ముని హత్యకు కారణమైన చివరి నిరాహార దీక్ష

## - జనవరి 30... గాంధీ వర్ధంతి



భారత జాతిపిత మహాత్మాగాంధీ దేశ స్వాతంత్ర్య సాధన కోసం ఎన్నో సార్లు నిరాహార దీక్షలు చేపట్టారు. అయితే గాంధీజీ స్వతంత్రం వచ్చిన తరువాత నిరాహారదీక్ష కూడా చేసారు. ఆ నిరాహార దీక్షనే మహాత్ముని హత్యకు కారణం అవుతుందని ఎవరూ ఊహించి ఉండరు. స్వాతంత్ర్యానంతరం గాంధీ ప్రయత్నాలు హిందూ - ముస్లిం విద్వేషాలను నివారించడానికి పరిమిత మయ్యాయి. ముస్లిం నాయకుడైన మహమ్మద్ అలీ జిన్నాను ప్రధాని మంత్రిగా చేసైనా దేశ విభజనను ఆపాలని గాంధీ భావించారు. ఇది హిందూ - ముస్లింల మధ్య మరింత చిచ్చు రాజేసింది. నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ లు గాంధీ విధానాన్ని వ్యతిరేకించారు. విభజన జరిగితే నే అల్లర్లు సమసి పోతాయని వారు భావించారు. దేశ విభజనో..అంతర్గత యుద్ధమో తేల్చుకోండని జిన్నా పిలుపు నివ్వడం గాంధీని ఇరకాటంలో పడేసింది. 1947 ఆగస్టు 15న దేశ మంతా సంబరాలు జరుపు కుంటుంటే...గాంధీ మాత్రం కలకత్తాలోని ఒక హరిజన వాడను శు భ్రం చేస్తూ గడపడం విశేషం. దేశ విభజన ప్రతిపాదన, దానికి వ్యతిరేకంగా చెలరేగిన అల్లర్లు, అవి దారితీసిన ఉద్రిక్తతలు, మత ఘర్షణల ఫలితంగా అనూహ్యమైన రీతిలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వం పరిస్థితిని అదుపు చేసే అసహాయ స్థితిలో పడింది. మొత్తం పోలీసు బలగాలు దేశ పశ్చిమ ప్రాంతానికి పంప బడ్డాయి. తూర్పు ప్రాంతంలో కల్లోలాలను అదుపు చేసే భారం గాంధీ పై పడింది. దేశ విభజనతో ముఖ్యంగా పంజాబు, బెంగాలులలో పెద్దఎత్తున సంభవించిన వలసల వల్ల మత కలహాలు, మారణ కాండలు ప్రజ్వరిల్లాయి. 1947లో కాశ్మీరు విషయమై భారత్ - పాకిస్తాన్ యుద్ధం తరువాత ఇంటా, బయటా పరిస్థితి మరింత క్షీణించింది. ముస్లిము లందరినీ పాకిస్తాను పంపాలనీ, కలసి బ్రతకడం అసాధ్యమనీ వాదనలు నాయకుల స్థాయిలోనే వినిపించ సాగాయి. ఈ పరిస్థితి గాంధీకి మింగుడు పడని అంశంగా మారింది. దీనికి తోడు విభజన ఒప్పందం ప్రకారము పాకిస్తానుకు ఇవ్వవలసిన 55 కోట్లు రూపాయలను ఇవ్వడానికి భారత ప్రభుత్వం నిరాకరించింది. ఆ డబ్బు భారతదేశంపై పాకిస్తాన్ యుద్ధం చేస్తే యుద్ధానికి ఉపయోగ పడుతుందని సర్దార్ పటేల్ వంటి నాయకుల అభిప్రాయం. కాని అలా కాకుంటే పాకిస్తాన్ మరింత ఆందోళన చెందుతుందనీ, దేశాల మధ్య విరోధాలు ప్రబలి మత విద్వేషాలు సరిహద్దులు దాటుతాయనీ, అంతర్యుద్ధానికి దారితీస్తుందని గాంధీజీ అభిప్రాయం. జనవరి 12, 1948. ఆ రోజు సాయంత్రం తన రోజువారీ ప్రార్థన సమావేశంలో, మరుసటి రోజు ఉదయం నుండి ఆమరణ ఉపవాసం కూర్చుంటానని గాంధీ ప్రకటించారు. 1948 జనవరి 13న మధ్యాహ్నం సుమారు 12 గంటలకు గాంధీజీ రెండు డిమాండ్లతో నిరాహార దీక్షలో కూర్చున్నారు. మొదటి డిమాండ్ పాకిస్తాన్‌కు భారత్ విభజన ఒప్పందంకు సంబంధించిన మిగిలిన రూ.55 కోట్లు ఇవ్వాలి. రెండోది దిల్లీలో ముస్లింలపై జరుగుతున్న దాడులు ఆగాలి. దీనికి ముందు గాంధీ తన రోజువారీ పనులను పూర్తి చేశారు. నెహ్రూ, పటేల్, ఆజాద్‌లతో ఆయన సుదీర్ఘ చర్చలు జరిపారు. కొంతమంది బిర్లా హౌస్ పచ్చిక బయళ్లలో గుమిగూడారు. 'వైష్ణవ జ న్ తో తేనె కహియే తో పాటు, ఆయనకు ఎంతో ప్రియమైన భజన్లను, శ్లోకాలను పాడారు. తర్వాత ఖురాన్ మరియు గురు గ్రంథ్ సాహిబ్ నుండి శ్లోకాలు పఠించ బడ్డాయి. అలా ఆయన ఢిల్లీలో తన జీవితంలో చివరి ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించారు. ఎవరెంతగా ప్రాధేయపడినా ఆయన తన దీక్ష మానలేదు. చివరకు భారత ప్రభుత్వం దిగివచ్చి పాకిస్తానుకు 55 కోట్ల డబ్బు ఇవ్వడానికి అంగీకరించింది. 1948 జనవరి 18న ఒక శాంతి కమిటీ ఏర్పాటైంది. ముస్లింలు దిల్లీలోని తమ ఇళ్లలోకి వెళ్లవచ్చని, హిందువులు, సిక్కుల ఆక్రమణ నుంచి మసీదులను విడిపిస్తామని, అక్రమ కబ్జాల నుంచి ముస్లింల ప్రాంతాలను విడిపిస్తామని, ఇళ్ల నుంచి భయపడి వెళ్లిపోయిన ముస్లింలు తిరిగి రావడానికి హిందువుల నుంచి ఎలాంటి అభ్యంతరం ఉండదని ఆ కమిటీ మహాత్మా గాంధీకి హామీ ఇచ్చింది. హిందూ, ముస్లిమ్, సిక్కు వర్గాల నాయకులు సఖ్యంగా ఉండటానికి కట్టుబడి ఉన్నామని ఆయనవద్ద ప్రమాణం కూడా చేశారు. జనవరి 18న మధ్యాహ్నం 12.45కు మౌలానా ఆజాద్ ఇచ్చిన నారింజ రసం తాగిన మహాత్మా గాంధీ తన నిరాహార దీక్షను విరమించారు. కాని ఈ మొత్తం వ్యవహారంలో గాంధీ పట్ల మతోన్మాదుల ద్వేషం బలపడింది. మత ప్రాతిపదికన పాకిస్తాన్ ప్రత్యేక దేశం ఏర్పాటుకు గాంధీ వ్యతిరేకిస్తున్నారని ముస్లింలు భావించగా, ముస్లింల వేధింపులపై ప్రతీకారం తీర్చుకునేందుకు గాంధీ తమకు అడ్డుపడుతున్నాడని హిందు తీవ్రవాదులు భావించారు. ఈ నేపథ్యంలో గాంధీ హత్యకు దారితీసింది హిందు- ముస్లింల మధ్య నెలకొన్న కలహాలే అనే వాదన బలంగా ఉ ంది. ఈ క్రమంలోనే నాథూరామ్ గాడ్సే పథకం ప్రకారం 1948 సంవత్సరం జనవరి 30వ తేదీ నాడు బిర్లా మందిర్ ప్రార్థన మందిరం మైదానంలో హత్య చేయడం జరిగిందని స్పష్టమయింది. "గాంధీ సమ్మతితో కాంగ్రెస్ లోని అగ్రనేతలు అంతా కలిసి దేశాన్ని చీలికలు - పేలికలుగా మార్చారని, దేశ విభజనకు సమ్మతి తెలిపి పెద్ద కుమారుడు వంటి గాంధీ భారత దేశానికి ద్రోహం చేయడం ద్వారా ఆయన తన ధర్మాన్ని నెరవేర్చడంలో ఘోరంగా విఫలం అయ్యాడని, అన్ని అంశాలు పరిగణనలోకి తీసుకున్న తర్వాతనే నేను తుది నిర్ణయానికి వచ్చానని, అందుకే తానే గాంధీని కాల్చి చంపానని" .. గాడ్సే కోర్టులో వివరించాడు. స్వతంత్ర భారతదేశంలో ఉ రితీయబడిన మొదటి వ్యక్తిగా గాంధీని చంపిన నాధురాం వినాయక్ గాడ్సే చరిత్రలో నిలిచి పోయాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# స్వాతంత్ర్య సమర యోధులు కేశవులు - జనవరి 30 కె.వి.కేశవులు వర్ధంతి



ఆయనొక పోరాట యోధులు. స్వాతంత్ర్య పోరాటంలో భారత మాత దాస్య శృంఖలాల విముక్తి కోసం సర్వం త్యాగం చేసిన మేరు నగ ధీరులు. అలా అంటే ఆయన ఒప్పుకునే వారు కాదు. భరత మాత దాస్య విముక్తి కోసం రాజీ లేని పోరు సల్పిన అశేష దేశభక్తు లలో తామూ ఒకరమని అంటూ ఉండే వారాయన. ఆయనే ధర్మపు రి క్షేత్రానికి చెందిన స్వాతంత్ర్య సమర యోధులు, మాజీ మంత్రి కర్నె వెంకట కేశవులు (జననం 14-1-1924.. మరణం 30-1-2019). 1924 జనవరి 14న ధర్మపురి క్షేత్రంలో గోదావరి తీరాన గల తమ ఇంటిలో జన్మించిన కేశవులు, ధర్మపురి, కొత్తపల్లి, జగిత్యాల పాఠశాలలో విద్యా భ్యాసం గావించారు. జగిత్యాలలో 6వ తరగతిలోనే వందేమాతరం గీతాలాపన చేసి, శిక్షకు గుర య్యారు. అనంతర కాలంలో ధర్మపురి, ఆదిలాబాద్ ప్రాంతాలలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతి రేకంగా తిరుగుబాటు బాట పట్టి, స్వాతంత్ర్య ఉద్యమం గూర్చి మారుమూల గ్రామాలలో చైతన్య కాంతులు వెలిగించడంలో కృత కృత్యులైనారు. ధర్మపురి క్షేత్రంలో సాహిత్య, నాటక సంస్థల వ్యవస్థా పనలకు కారణభూతులై, సొంత ఇంటిలో గ్రంథాలయం నిర్వహిం చారు. నైజాం ఏలుబడి ప్రాంతంలో జాతీయ పతాకావిష్కరణలు నిషేధితాలు. కఠినతర నేరంగా పరిగణించాలని ఆదేశాలున్న నేపథ్యం తాము కోరుకున్న స్వాతంత్ర్యం సిద్ధించిన శుభ తరుణాన, ధర్మపురి క్షేత్రవాసు లందరినీ పిలిచి, మరీ తమ స్వంత ఇంటి పైనే జాతీయ జెండా ఎగుర వేసారు. నాటి పోలీసులు విషయం తెలిసి హుటాహుటిన నాన్ బెయిల బుల్ వారంట్ తో విచ్చేయగా, మరో అనుచరులు, పౌరాణిక ప్రసిద్ధులు సంగనభట్ల మాణిక్య శాస్త్రితో కలిసి, తమ ఇంటి ముందు నుండి ప్రవహిస్తున్న నిండు గోదావరిలో దూకి, బల్లకట్టు ద్వారా ఇరువురు మంచిర్యాల రేవుకు, తద్వారా రైలు ద్వారా ముంబాయి చేరుకుని, అజ్ఞాత వాసం గడిపారు. తర్వాతి కాలంలో సిర్పూర్ ఎమ్మె ల్యేగా, రాష్ట్ర చేనేత సహకార మంత్రిగా, స్వాతంత్ర్య సమరయో ధుల సంఘ వ్యవస్థాపక బాధ్యుని గా పని చేశారు. కేశవులు జీవితంలో ఇది ఒక పార్శ్వం కాగా, తెలంగాణ లోనే మొదటిదైన ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ నాట్య మండలి నాటక సంస్థ 1936 ప్రారంభ దశలో మేకప్ మన్ గా, పాత్రాలంకరణ నిపుణులుగా, ప్రయోక్తగా, చింతా మణిలో భవానీ శంక రుడుగా, మధుసేవలో శర్మగా, రామదాసులో తానీ షాగా విభిన్న పాత్రలకు జీవం పోశారు. 1938లో ప్రధానంగా ఫిబ్రవరి 1వ తేదీన మంచిర్యాలలో జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్ మహా సభలు నస్పూరు శ్రీరాజా మురలీమనోహర్ రావు అధ్యక్షు లుగా, కేవి కేశవులు కార్యదర్శిగా నిర్వహించారు. మండలి బాధ్యునిగా, కేశవులు ఆనాడు ధర్మపురి నాట్యమండలిచే శ్రీకృష్ణ తులాభారం సాంప్రదాయ పద్య పౌరా ణిక నాటకం వేయించారు. ప్రప్రథమ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, ఆంధ్రపితామహ మాడ పాటి హన్మంతరావు, విమర్శ నాగ్రేసరులు సురవరం ప్రతాపరెడ్డి, దేవులపల్లి రామాను జరావు, కాళోజీ నారాయణ రావు, నార్ల వేంకటేశ్వర్ రావు, వానమామ లై వరదాచార్య తదితరులను ఆహ్వానింప చేసి, నాటక వీక్షణం గావింప చేశారు. నాటకం ఆసాంతం చూసిన ప్రముఖులు ఎంతగానో ప్రశంసించారు. ఇటీవల చివరిసారి ధర్మపురి స్వామి దర్శనం చేసుకు నేందుకు విచ్చేసిన సందర్భంగా, "తెలంగాణ ప్రభుత్వం కళా రంగానికి, కళాకారులకు అనేక ప్రోత్సాహ పథకాలను చేపట్టింది. పట్టణానికి దూరం కావడం వల్ల కొంతవరకు ఈ సంస్థకు కొంత నష్టం - ఒకింత అన్యాయం జరిగిందని నేను భావిస్తున్నా. ఇప్పుడా లోపం తీనిపోతుందని ఆశి స్తున్నా" అన్నారాయన. కేశవులు తమ 97వ ఏట 2019 జనవరి 30వ తేదీన సాయంత్రం హైదరాబాద్, అమీర్ పేటలోని ధరంకరం రోడ్లోని తమ స్వగృహంలో కన్ను మూశారు. ఇటీవలే కేశవులు కూతురు రచించిన నాన్నకు ప్రణతి పేరుతో పుస్తకాన్ని కేశవులు ట్రస్ట్ ఆధ్వర్యంలో ధర్మపురిలో ఆవిష్కరించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

చురకలు

# సంపాదకీయం

## డాలర్ వీక్, ఇరాన్ రిస్క్...

### చమురు ధరలపై ప్రభావం ఏస్థాయిలో అంటే..!

ఇటీవల ఇరాన్ లో నెలకొన్న ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనల నేపథ్యంలో.. టెహ్రాన్ పై వాషింగ్టన్ దాడులు ఉండొచ్చనే చర్చ తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. మరోవైపు తాజాగా పశ్చిమాసియాకు అమెరికా యుద్ధ విమానాల వాహక నౌక చేరుకోవడంతోపాటు పెద్ద ఎత్తున సైన్యం బయలుదేరుతుందంటూ కథనాలు వస్తున్నాయి. దీంతో.. పశ్చిమాసియాలో మరో సారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయని అంటున్నారు. మరోవైపు... ఉక్రెయిన్ తో ప్రాదేశిక సమస్య ఇంకా పరిష్కారం కాలేదని.. ఉక్రెయిన్ లో భూభాగం కోసం రష్యా డిమాండ్ ను అంగీకరించే వరకు యుద్ధానికి దీర్ఘకాలిక పరిష్కారం సాధించే ఆశ లేదని క్రెమ్లిన్ చెప్పిన సంగతి తెలిసిందే. దీంతో... ఉక్రెయిన్? తో శాంతి చర్చల్లో పురోగతి ఉంటుందనే ఆశలపై రష్యా చల్లటి నీళ్లు చల్లిన పరిస్థితి. ఈ రెండు కీలక పరిణామాల నేపథ్యంలో ముడి చమురుకు మద్దతు లభించింది.. ఇందులో భాగంగా... ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. అవును... అటు ఇరాన్ పై అమెరికా దాడులకు సిద్ధమవుతుందనే సంకేతాలు.. రష్యా – ఉక్రెయిన్ మధ్య శాంతి చర్చలు ఇప్పట్లో సఫలమయ్యే అవకాశాలు లేవనేలాంటి స్టేట్ మెంట్లు.. వీటికి తోడు యూఎస్ డాలర్ భారీగా బలహీనపడి నాలుగేళ్ల కనిష్టానికి చేరుకున్న నేపథ్యంలో... ఇవన్నీ కలిసి చమురు మార్కెట్ ను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఫలితంగా... క్రూడ్ ఆయిల్ ధరలు నాలుగు నెలల గరిష్టానికి చేరుకున్నాయి. ఇదే క్రమంలో... గత ఐదు నెలల్లో ఉక్రేనియన్ డ్రోన్, క్షిపణి దాడులు కనీసం 28 రష్యన్ శుద్ధి కర్మాగారాలను లక్ష్యంగా చేసుకున్నాయని.. దీనివల్ల రష్యా ముడి చమురు ఎగుమతి సామర్థ్యాలు పరిమితం అయ్యాయని.. ప్రపంచ చమురు సరఫరాలు తగ్గాయని చెబుతున్నారు. అదే విధంగా... బాల్టిక్ సముద్రంలో కనీసం ఆరు రష్యన్ ట్యాంకర్లపై ఉక్రెయిన్ డ్రోన్లు, క్షిపణులు దాడి చేశాయని.. ఇవి కూడా ముడి చమురు ధరల పెరుగదలకు కీలక కారణాలని చెబుతున్నారు. మరోవైపు.. దాదాపు నాలుగు సంవత్సరాలలో యూఎస్ డాలర్ దాని బలహీన స్థాయికి పడిపోయింది. ఈ క్రమంలో ప్రస్తుతం బ్లూమ్ బెర్గ్ డాలర్ స్పాట్ ఇండెక్స్ 98.00 మార్క్ దగ్గర ఉంది! అయితే.. ఈ బలహీనత స్థూల ప్రాథమిక అంశాల కంటే అమెరికా పాలనతో పెరుగుతున్న అసౌకర్యాన్ని ప్రతిబింబిస్తుందని నిపుణులు అంటున్నారు. డాలర్ పతనానికి జపనీస్ యెన్ పుంజుకోవడమూ ఒక కారణమని అంటున్నారు. ఈ నెల ప్రారంభంలో డాలర్ కు 160 వైపు బలహీనపడిన తర్వాత.. యెన్ బాగా పుంజుకుందని.. ఈ క్రమంలో డాలర్ కు దాదాపు 153కి బలపడిందని చెబుతున్నారు. కాగా... బుధవారం వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) ముడి చమురు ఫ్యూచర్స్ బ్యారెల్‌కు ౼63కి పెరిగాయి. ఇది మునుపటి సెషన్ నుండి దాదాపు 3% లాభాన్ని పెంచి సుమారు నాలుగు నెలల గరిష్ట స్థాయికి చేరుకుంది. దీనికి పైన చెప్పుకున్న విషయాలతో పాటు, ఫలితంగా ఏర్పడిన పలు సరఫరా అంతరాయాలు కారణమయ్యాయని చెబుతున్నారు!

## నాయిని జీవితం తెలుగు భాషా, సాహిత్య చరిత్రలో అద్భుత అధ్యాయం - జనవరి 30...నాయని కృష్ణకుమారి వర్ధంతి



నాయని కృష్ణకుమారి తెలుగు సాహిత్యానికి, జానపద సాహిత్యానికి, ద్రావిడ భాషల పరిశోధనకు ఎనలేని సేవలు అందించిన కవయిత్రి, రచయిత్రి, విశ్వవిద్యాలయ అధ్యాపకురాలు. ఆమె తన రచనలతో, అధ్యాపక జీవితంతో తెలుగు భాషా, సాహిత్యాలకు కొత్త పుంతలు తొక్కించారు. ఆలోచనాత్మకత, భావప్రకటన, సమాజంపై ఆమె చూపించిన ప్రగాఢ ఆసక్తి ఆమె రచనలలో స్పష్టంగా కనిపిస్తాయి. నాయని కృష్ణకుమారి 1930 మార్చి 14న జన్మించారు. ఆమె మాతృభాషపై ఉన్న మమకారంతో, తెలుగు భాషా సంస్కృతుల అధ్యయనంపై ఉన్న ఆసక్తితో చిన్ననాటి నుంచే సాహిత్య రచనకు ఆకర్షితులయ్యారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఆమె విద్యాభ్యాసం ద్వారా పరిశోధనాత్మక దృక్పథాన్ని పెంపొందించు కున్నారు. నాయని కృష్ణకుమారి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి తెలుగు పండితులు డిగ్రీని పూర్తిచేసి, కాశీ హిందూ విశ్వవిద్యాలయం (బనారస్ హిందూ యూనివర్సిటీ) నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. ఆమె పరిశోధన విషయాలు తెలుగు జానపద సాహిత్యం, ద్రావిడ భాషల పరస్పర సంబంధాలపై ఆధారపడ్డాయి. ఈ విద్యా ప్రస్థానం ఆమెను ప్రముఖ విద్యావేత్తగా తీర్చిదిద్దింది. నాయని కృష్ణకుమారి రచనలు సమాజంలోని విభిన్న అంశాలను స్పృశించి సాహిత్యంలో ఉన్నతమైన స్థానం సంపాదించాయి. ఆమె సృజనాత్మకత వివిధ రంగాలలో వ్యాపించి ఉంది. ఆమె కవిత్వం వ్యక్తిగత భావోద్వేగాలు, ఆత్మశోధన, సామాజిక సమస్యలను ప్రతిబింబిస్తుంది. ''ఆకాశ దీపాలు'' వంటి కవితాసంకలనాలు సున్నితమైన భావనలతో పాటు, సామాజిక చైతన్యాన్ని వ్యక్తపరుస్తాయి. తెలుగు జానపద సాహిత్యం మీద ఆమె చేసిన పరిశోధనలు ప్రాముఖ్యత సంతరించు కున్నాయి. జానపద గేయాలు, కథలు, సామాజిక జీవన విధానానికి సంబంధించిన విభిన్న కోణాలను ఆమె పరిశోధించారు. ద్రావిడ భాషల పరస్పర సంబంధాలను, సాహిత్య పరంపరను విశ్లేషిస్తూ ఆమె రచనలు సాహిత్య చరిత్రలో నూతన అధ్యాయాలకు పునాదులు వేశాయి. సామాజిక అంశాలను ప్రతిబింబించే నాటకాలు రచించడం ద్వారా ఆమె ప్రజల్లో చైతన్యం రేకెత్తించారు. ఆమె రచనలలో ఆలోచనాత్మకత ప్రత్యేకంగా కనిపిస్తుంది. జానపద సాహిత్యానికి సంబంధించిన చరిత్ర, దాని విశిష్టత, సామాజిక, సాంస్కృతిక అంశాలను ప్రతిపాదించే గొప్ప రచన. ద్రావిడ భాషల సాహిత్యంపై సమగ్ర విశ్లేషణ చేసి, ద్రావిడ భాషల పరస్పర సంబంధాలను వివరించిన పరిశోధనాత్మక రచన. నాయని కృష్ణకుమారి తన జీవిత కాలంలో అనేక గౌరవాలను అందుకున్నారు. ఆమె సాహిత్యంపై చేసిన కృషికి భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం పలు అవార్డులు, పురస్కారాలు ప్రదానం చేశాయి. సాహిత్య అకాడమీ అవార్డు, తెలుగు యూనివర్సిటీ పురస్కారం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ బిరుదు. నాయని కృష్ణకుమారి జీవితం తెలుగు భాషాభిమానులకు, సాహితీ ప్రేమికులకు ఓ మార్గదర్శకం. ఆమె రచనలు భావోద్వేగాలతో పాటు, సమాజంపై ఒక స్ఫూర్తిదాయకమైన చూపును అందించాయి. ఆమె 2016 జనవరి 30న కన్నుమూశారు. కానీ, ఆమె రచనలు, పరిశోధనలు తెలుగు సాహిత్యాన్ని శాశ్వతంగా వెలుగొందించాయి. నాయని కృష్ణకుమారి రచనలు, పరిశోధనలు ఆమెను తెలుగు సాహితీ ప్రపంచంలో చిరస్థాయిగా నిలిపాయి. ఆమె జీవితం తెలుగు భాషా, సాహిత్య చరిత్రలో అద్భుతమైన అధ్యాయంగా నిలిచింది. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

## సైన్య ఆధునీకరణలో కృష్ణారావుది చెరగని ముద్ర - జనవరి 30... జనరల్ కె. వి. కృష్ణారావు వర్ధంతి



జనరల్ కృష్ణారావు భారత ప్రసిద్ధ సైనిక అధికారులలో ఒకరు. ఆయ న దూరదృష్టి గలవారు. 1971లో పాకిస్తాన్ తో జరిగిన యుద్ధంలో పాల్గొని అపూర్వ ధైర్యసాహసాలు ప్రదర్శించారు. బంగ్లాదేశ్ విముక్తి సమయంలో ఆయన చేసిన సేవలు అసమానాలు. 1980 దశక ప్రారం భంలో భారత సైన్యాన్ని ఆధునీక రించడం ప్రారంభించారు. ఒక తరం సైనికులను ప్రేరేపించారు. జనరల్ కె.వి. కృష్ణారావుగా ఖ్యాతి నందిన కొటికల పూడి వెంకట కృష్ణా రావు, జూలై 16 1923న విజయ వాడలో కె.ఎస్. నారాయణ రావు, లక్ష్మీరావు దంపతులకు జన్మిం చారు. ఆయన ఆగష్టు 9, 1942 న ఇండియన్ ఆర్మీలో చేరారు. 1947 లో విభజన వరకు, యువ అధికారిగా ఉన్నపుడే రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో నార్త్ వెస్ట్ ఫ్రాంటియర్, బెలూచిస్తాన్ లలో ఆయన పని చేశారు. దేశ విభజన సమయంలో తూర్పు, పశ్చిమ పంజాబ్‌లలో విధులు నిర్వర్తిం చారు. భారత సైనిక దళాల మాజీ ఛీఫ్ ఆయ్యాక, జమ్మూ కాశ్మీర్, నాగాలాండ్, మణీపూర్, త్రిపుర రాష్ట్రాలకు గవర్నరుగా పని చేసా రు. ఆయన జమ్మూ కాశ్మీరు గవర్న రుగా మొదటిసారి 1989 జూలై 11 నుండి 1990 జనవరి 19, రెండవ సారి 1993 మార్చి 13 నుండి 1998 మే 2 వరకు పనిచేసి చెరగని ముద్ర వేశారు. 1947 లో విభజన వరకు విస్తృతమైన పంజాబ్ అవాంతరాల సమయంలో, తూర్పు మరియు పశ్చిమ పంజాబ్ లలో పనిచేశారు. 1947 – 48లో జరిగిన భారత్–పాక్ యుద్ధంలో పాల్గొన్నారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ వ్యవస్థాపక శిక్షకు లలో కృష్ణారావు ఒకరు. 1949 –51 మధ్య ఆయన డిఫెన్స్ అకాడమీలో పని చేశారు. 1965 – 66లో లడఖ్ లో ఒక దళానికి, 1969 – 70లో జమ్మూ ప్రాంతంలో ఇన్‌ఫాంట్రీ విభాగానికి కమాండర్‌గా వ్యవహ రించారు. 1970 – 72 మధ్య నాగాలాండ్, మణిపూర్‌లలో తిరుగుబాట్ల అణచివేత దళాలకు నేతృత్వం వహించారు. 1971 యుద్ధంలో రావు అందించిన సహకారం, దేశం యొక్క ఐక్యత, సమగ్రతను కాపాడుకోవడం కోసం చేసిన కృషి ఎల్లప్పుడూ గుర్తుండి పోతుంది. ఆ కాలంలో, ఆయన విభాగం 1971లో భారత – పాకిస్తా న్ యుద్ధంలో కూడా పాల్గొంది. సిల్హెట్ ప్రాంతాన్ని స్వాధీనం చేసు కోవడంలో, ఈశాన్య బంగ్లాదేశ్ విముక్తికి కీలక పాత్ర పోషించారు. ఆ యుద్ధంలో కృష్ణారావు చూపిన ధైర్యం, సాహసోపేత నిర్ణయాలు, నాయకత్వ ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం పరమ విశిష్ట సేవా పత కంతో సత్కరించింది. 1975 – 76 మధ్యకాలంలో, దేశ భవిష్యత్ రక్షణ కోసం పునర్వ్య వస్థీకరణ, ఆధునీకరణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ ఛైర్మన్‌గా కూడా ఉన్నారు. ఆయన 1978–79 మధ్య ఆర్మీ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ గా పని చేశారు. తదనం తరం, పదోన్నతి పొందారు. 1979 – 81 మధ్య కాలంలో వెస్ట్రన్ కమాం డ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్– ఇన్ – చీఫ్ గా పని చేశారు. కృష్ణా రావు జూన్ 1, 1981 న ఆర్మీ స్టాఫ్ చీఫ్ గా నియమితులై, జూలై 1983 వరకు సమర్థ వంతంగా పని చేశారు. మార్చి 1982 నుండి జూలై 1983 వరకు సర్వీసులలో అత్యు న్నత నియామకం అయిన చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ ఛైర్మన్ కూడా అయ్యారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో బర్మా, బెలూచిస్తాన్ లలో పని చేశారు. దేశ విభజన సమయంలో తూర్పు, పశ్చిమ పంజాబ్‌ల్లో విధులు నిర్వర్తించారు. ఆయన ఆర్మీ ఛీఫ్ గా 1983 లో పదవీ విరమణ చేసారు. కృష్ణా రావు సేవలను గుర్తించిన కేంద్రం ఆర్మీ చీఫ్‌గా రిటైరైన అనంతరం ఆయనకు గవర్నర్‌గా అవకాశం కల్పించింది. 1984–89 మధ్య నాగాలాండ్, మణిపూర్, త్రిపుర గవర్నర్‌గా ఆయన పని చేశారు. మధ్యలో 1988లో కొంతకాలం పాటు మిజోరం గవర్నర్‌గా అదనపు బాధ్యతలను నిర్వర్తించారు. 1989 – 90 మధ్య, తర్వాత జమ్మూ కాశ్మీర్‌లో ప్రాక్సీ యుద్ధం గరిష్ట స్థాయికి చేరుకున్నప్పుడు, 1993 – 1998 మధ్య జమ్మూకశ్మీర్ గవర్నర్‌గా తిరిగి పని చేశారు. ఉగ్ర వాదం, తిరుగుబాట్లతో అట్టుడికిన కశ్మీర్‌లో తిరిగి శాంతి నెలకొనేం దుకు కృషి చేశారు. ఆయన జనవరి 30 2016 న న్యూఢిల్లీలో మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

## ఆహారం విషయంలో మహాత్ముని ప్రయోగాలు - జనవరి 30.. గాంధీ వర్ధంతి



కొల్లాయి గట్టి, చేత కర్రబట్టి, నూలు వడకి, మురికివాడలు శుభ్రం చేసి, అన్ని మతాలూ, కులాలూ ఒకటే అని చాటి, రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడ లాడించిన జాతిపిత మహాత్మా గాంధీజీ. మహాత్ముడనీ, జాతిపిత అనీ పేరెన్నిక గన్న ఆయన ఆంగ్లేయుల పాలన నుండి భారత దేశానికి స్వాతంత్ర్యము సాధించిన నాయకులలో అగ్రగణ్యుడు. 20వ శతాబ్దిలోని రాజకీయ నాయకులలో అత్యధికంగా మానవాళిని ప్రభావితము చేసిన రాజకీయ నాయకునిగా గుర్తింపు పొందారు ఆయన. జాతిపిత మహాత్మాగాంధీ శారీరకంగా దుర్బలుడు అయినా, మానసికంగా మేరు నగధీరుడు. అహింస, సహాయ నిరాకరణ ఉద్యమం లాంటి విషయాల్లో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, మార్టిన్ లూథర్ కింగ్, నెల్సన్ మండేలా, బరాక్ ఒబామా లాంటి ఎందరో మేధావులకు ప్రేరణగా నిలిచిన గాంధీ జీవితంలో ఆరోగ్య రక్షణ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు, ఆచరణ పద్ధతులు ఉండేవి. దేశ స్వాతంత్ర్య సాధన యే ఏకైక లక్ష్యంగా, సత్యాగ్రహమే ఆయుధంగా, అహింసా మార్గంలో పయనించి, నిరంతరం అంకిత భావంతో పోరాటాలను నడిపించి, పలు మార్లు జైలు పాలైనా, ఆహారపు అలవాట్లను ఖచ్చితంగా ఆయన పాటించారు. అసలైన విలువ అనేది మన ఆరోగ్యంలోనే ఉంటుంది. అందుకే ఆరోగ్యమే మహాభాగ్యము" అని అంటుండే వారు.. గాంధీజీ ఐదేళ్ల పాటు పండ్లు, గింజలు, నట్స్ మాత్రమే తిన్నారు. కానీ ఆరోగ్య సమస్యలు రావడంతో శాకాహారం తీసుకోవడం ప్రారంభించారు. ఆహారం విషయంలో గాంధీజీ దశాబ్దాల పాటు ప్రయోగాలు చేశారు. "ది మోరల్ బేసిస్ ఆఫ్ వెజిటేరియనిజం, గాంధీ డైట్ అండ్ డైట్ రిఫార్మ్స్, కీ టు హెల్త్ " అనే పుస్తకాలు కూడా రచించారు. సాత్వికాహారంతో మనిషి బుద్ధి వికసిస్తుందని గాంధీగారు త్రికరణ శుద్ధితో విశ్వసించే వారు.లండన్ లోనూ గాంధీ శాకాహారి గానే ఉండేవారు. విధి లేక శాకాహారం తినడం కాదు, లండన్ లో స్వయంగా గాంధీ శాకాహారాన్ని ఎంపిక చేసుకున్నారని, తన రూమ్మేట్ సహాయంతో "లండన్ వెజిటేరియన్ సొసైటీ" ఉందనే వాస్తవం కూడా గాంధీజీ తెలుసు కున్నారని,చివరకు గాంధీ, ఆయన మిత్రుడు వారి నెం.52, సెయింట్ స్టీఫెన్స్ గార్డన్, బేస్ వాటర్ హోమ్, లో మిత్రులకు పప్పుల చారు, అన్నం, ఎండు ద్రాక్షలతో విందు చేసేవారని "గాంధీ బిఫోర్ ఇండియా" అనే పుస్తకంలో చరిత్రకారుడు రామచంద్రగుహ వివరంగా రాశారు. ఇక గాంధీ డైట్ అండ్ డైట్ రిఫార్మ్స్, ది మోరల్ బేసిస్ ఆఫ్ వెజిటేరియనిజమ్, కీ టు హెల్త్ అనే పుస్తకాలు కూడా రచించారు. గాంధీజీ ఉద్దేశ్యంలో మంచి ఆహారపు అలవాట్లు అనేవి మంచి ఆరోగ్యానికి తప్పనిసరి. ఒక్కో వ్యక్తి శరీరం దాని తత్వాన్ని బట్టి, ఒక్కో రకమైన ఆహారానికి అలవాటు పడుతుంది. కాబట్టి, దానికి అనుగుణం గానే మనిషి ఆహారపు అలవాట్లను చేసు కోవాలి. తాను శాకా హారానికే ప్రాధాన్యం ఇస్తానని గాంధీజీ చెప్పేవారు. శాకాహారం లోకి పాలు, పాల ఉత్ప త్తులను కూడా చేర్చాలని గాంధీజీ అనేవారు. పాలు, పాల ఉత్పత్తులను ఆరేళ్ళ పాటు సేవించక పోవడం వల్ల విరోచనాలతో బాధ పడ్డాననీ, కట్టె పోగులా తయారయ్యాననీ, ఎంత మంది సలహా ఇచ్చినా మందులు తీసుకొన లేదని, మేక పాలను తాగడం వల్ల తాను మళ్ళీ మామూలు స్థాయికి చేరు కున్నాననీ, గాంధీజీ తన ఆత్మ కథలో వివరించారు. గాంధీ తొలుత పాల పదార్థాలకు దూరంగా ఉండేవారు. కేవలం ఒక వెజిటేరియన్‌గానే ఉండాలని కోరుకొనేవారు. అయితే సమయానుసారం తన ఆహారపు అలవాట్లలో మార్పులు సంభవించాయి. పాల ఉత్పత్తులను మానేయాలని గాంధీజీ భావించారు. కానీ ఆరోగ్యం దెబ్బ తినడంతో తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. తర్వా మేకపాలు తాగడం ప్రారంభించారు. తాజా మేక పాల కోసం కొన్ని సందర్భాల్లో ప్రయాణాల్లోనూ ఆయన వెంట మేకను తీసుకెళ్లేవారు.. వైద్యుడి సలహా మేరకు మేక పాలను తన డైట్‌లో భాగంగా చేసు కున్నారు. ఆహారం అనేది ప్రాణాన్ని నిలబెట్టేందుకే అయినప్పటికీ, మితాహారం, సాత్వికాహారం వల్ల మనిషిలో ఆలోచనా శక్తి పెరుగుతుందని గాంధీగారు విశ్వసించేవారు. పాలు సంపూర్ణ ఆహారం కావడం వల్ల దేహం ఎదుగుదలకు కావల్సిన మాంస కృతులు, విటమిన్లు లభ్యమవుతాయని, అలాగే, తృణ ధాన్యాలు, వరి, జొన్న, రాగులు వంటివి కూడా శరీరానికి బలం ఇస్తాయని గాంధీజీ విశ్వసించేవారు. ఆయన ఆహారంలో ఒక లీటరు మేక పాలు, 150 గ్రాముల చిరు ధాన్యాలు, 75 గ్రాముల ఆకుకూరలు, 125 గ్రాముల కాయగూరలు, 25 గ్రాముల సలాడ్లు, 40 గ్రాముల నెయ్యి, 40 గ్రాముల పంచదార ఉండేటట్లు చూసు కున్నారు. భుక్తా యాసం వచ్చేవరకూ ఆహారం తీసుకోవడం, అతినిద్ర, అలసత్వం మనిషికి శత్రువులని ఆయన తరచూ అనే వారు. భోజనం వేళ దాటి పోయిన తర్వాత చిరు ఆకలి అనిపిస్తే ఆయన వేరుశనగ గుళ్ళు తినేవారు. సబర్మతిలో ఆహారం అంటే ఉడికించిన వంకాయ, బీట్రూట్, మరి కొన్ని కూర గాయలు, వెన్న లేని రొట్టె.. నెయ్యి కూడా ఉండదను, దాన్ని మందులాగా కష్టపడి తినే వారన్న విషయాలు గ్రంథస్థాలు. వెల్లుల్లిని పేదవారి కస్తూరి అని పిలుస్తారని గాంధీ పేర్కొన్నారు. చివరి దశకాల్లో గాంధీ చాలా ఆహారపు అలవాట్లను విడిచిపెట్టారు. మసాలా దినుసులు మానివేశారు. ఉడికించిన కాయ గూరలు మాత్రమే తినేవారు. ఉల్లి, వెల్లుల్లి లేకపోతే గ్రామీణులు ఇంకేం తింటారని కూడా ప్రశ్నిస్తారు. తల్లితండ్రులు తమ పిల్లలకు బలవర్ధకమైన ఆహారాన్ని పెట్టాలనీ, పిల్లల చదువు విషయంలోనే కాకుండా, ఆహార, విహారాల విషయంలో తగిన శ్రద్ధ తీసుకోవాలని గాంధీజీ ప్రబోధించారు. బాల్యం నుంచే వారికి మంచి అలవాట్లు అబ్బేట్టు చూడాల్సిన బాధ్యత తల్లితండ్రుల దేనని ఆయన అన్నారు. భారత స్వాతంత్ర్య సమరం సాగుతున్న సమయంలో మహాత్మ గాంధీ అనేకసార్లు నిరాహారదీక్షను పాటించారు. దాదాపు 17 సార్లు ఉపవాసాన్ని ఒక వ్రతంగా స్వీకరించారు. అత్యధికంగా 21 రోజులు కేవలం తక్కువ మోతాదులో ద్రవాలను మాత్రమే తీసుకుంటూ నిరాహారదీక్ష చేశారు. తన అహింస సిద్ధాంతాల్లో భాగంగా ఈ అంశం గురించి పేర్కొన్నారు. పలువురు ఆయుర్వేద వైద్య నిపుణుల ప్రకారం స్థూల కాయాన్ని తగ్గించుకోవడం, రక్తపోటును నియంత్రించు కోవడం, కొవ్వును తగ్గించు కోవడం లాంటివన్నీ కూడా పలు ఉపవాస నియమాల వల్ల సాధ్యమే. శారీరక శక్తి కోసం తినడం ఎంత అవసరమో, మానసిక శక్తికోసం మనసును ప్రశాంతంగా ఉంచు కోవాలనీ, గాంధీజీ నిరంతరం ధ్యానంలో నిమగ్నమయ్యేవారనీ, ఆయన మానసిక శక్తిలోని అసలు రహస్యమని పలు సందర్భాలలో గాంధీ చెప్పేవారు. మనిషి తన మానసిక ప్రశాంతతతో పాటు శారీరక ప్రశాంతతను పెంపొందించు కోవడం కోసం ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలన్నది గాంధీ సిద్ధాంతం. ఆయన ప్రతీ రోజు ధ్యానం చేసేవారు. మరియు ఎక్కువ సేపు ప్రార్థన చేసేవారు. ఆయుర్వేదం ప్రకారం కూడా ధ్యానం చేయడం వలన మానసిక రుగ్మతలు దూరం అవుతాయని చెపుతారు. గాంధీజీ ప్రబోధించిన అనేక విషయాలను ఆరోగ్య వికాసానికి ముడి పెడితే కొన్ని మంచి విషయాలను తెలుసు కోవచ్చు. ఉదాహరణకు నిద్రలేమిని అరికట్టడం అనే విషయాన్ని గురించి తరిచి చూస్తే. గాంధీ కూడా తొలుత కేవలం నాలుగు నుండి అయిదు గంటలు మాత్రమే నిద్రకు కేటాయించేవారు. అయితే తర్వాత రాత్రిళ్లు ఎక్కువ సేపు మేల్కొని ఉండకుండా, వేగంగా నిద్రపోవడం మరియు వేగంగా నిద్రలేవడం అనే నియమానికి కట్టుబడి ఉండేవారు.

సూర్యోదయానికి ముందు నిద్రలేచి ధ్యానం చేయడం వలన శరీరంలో ఒక ఉత్తేజం ప్రారంభమై, ప్రతికూల ఆలోచనలకు దూరంగా ఉండ గలుగుతామని ఈ ఉదాహరణ చెబుతోంది. అలాగే దండీ మార్చ్ చేసిన బాపూజీ జీవితం నుండి ఆ అంశాన్ని ఉదాహరణగా తీసుకుంటే, నడక వలన కలిగే ఉపయోగాలు తెలుసు కోవచ్చు. గుండె బలహీనతను తగ్గించు కోవడం, కొవ్వు కరిగించుకోవడం, పక్కటెముకలు పటిష్ట పడేలా చూసు కోవడానికి నడక ఎంతగానో ఉపయోగ పడుతుంది. కనుక ప్రతీ వ్యక్తి రోజుకు ఎంతోకొంత దూరం నడవడం తప్పని సరిగా భావించాలి. గాంధీజీ నూరు శాతం శాకాహారి. మితాహారి. మిత భాషణుడు. గాంధీజీ 46.7 కిలోల బరువు ఉండేవారు. ఎత్తు 1.64 మీటర్లు. 78వ ఏట ఆయన నాథూరామ్ గాడ్సే జరిపిన కాల్పుల్లో మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

చురకలు



## ప్లాస్టిక్ భూతాన్ని తరుముదాం..

హైదరాబాద్ : భూతంలా ప్లాస్టిక్ పర్యావరణాన్ని ధ్వంసం చేస్తోంది. నిషేధాజ్ఞలున్నా విచ్చలవిడిగా వినియోగం పెరుగుతోంది. ఉత్పత్తి లేకుండా చేయడంలో అధికార యంత్రాంగాలు విఫలమవుతున్నాయి. గ్రేటర్‌లో రోజూ 8వేల టన్నుల చెత్త పోగవుతుండగా అందులో 14శాతం ప్లాస్టిక్ వ్యర్థాలే. ప్లాస్టిక్ రహితనగరంగా మార్చాలంటే 'సిక్కిం' తరహా కఠిన విధానాలు అవలంబించాలని నిపుణులు సూచిస్తున్నారు.

అక్కడ ఇలా..: పర్యావరణ పరిరక్షణలో దేశంలోనే ముందున్న రాష్ట్రం సిక్కిం. ప్లాస్టిక్ వ్యర్థాలు భారీవర్షాల సమయంలో డ్రైన్లను అడ్డుకోవడంతో అక్కడ కొండచరియలు విరిగిపడి అనేకమంది మరణించారు. ఈ నేపథ్యంలోనే 1998లో తొలిసారిగా డిస్పోజబుల్ ప్లాస్టిక్‌క్యారీ బ్యాగ్‌లు (50 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్నవి) నిషేధించింది. 2016లో థర్మకోల్ ప్లేట్లు, డిస్పోజబుల్ ఉత్పత్తులపై పూర్తి నిషేధం అమలు చేసింది. ప్రభుత్వ కార్యాలయాలు, కార్యక్రమాల్లో ప్యాకేజ్డ్ డ్రింకింగ్ నీటిని నిషేధించడంతో పాటు 2022 జనవరి నుంచి 2 లీటర్లు అంతకంటే తక్కువ సామర్థ్యంఉన్న ప్లాస్టిక్ నీటిసీసాల తయారీ, దిగుమతి, అమ్మకం, వినియోగంపై ఆంక్షలు విధించింది. 2022 డిసెంబరు 31నుంచి 120 మైక్రాన్లకంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లపై నిషేధం విధించింది. ప్రకటనలే పరిమితం చేయకుండా మున్సిపల్ స్క్వాడ్‌లు, కాలుష్య నియంత్రణ మండలి బృందాలు నిరంతరం తనిఖీలుచేస్తున్నాయి. ఉల్లంఘించిన వారిపై జరిమానా విధిస్తున్నారు. పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలతో చిన్నారులకు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.



**నగరంలో పరిస్థితి ఇదీ...**

నగరంలోని ప్లాస్టిక్ కవర్ల తయారీ సంస్థలు – 300(సుమారు)..
ప్రధాన రకాలు–సింగిల్ యూజ్ ప్లాస్టిక్
మూసీ నది చుట్టూ 10 టన్నులకుపైగా ప్లాస్టిక్ వ్యర్థాలు డంప్ అవుతున్నాయి. ఫ్లోటింగ్ ట్రాష్ బారియర్లున్నా చాలా నదిలోకి చేరుతున్నాయి. ఇవి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటూ వర్షాకాలం వరదలకు కారణమవుతున్నాయి.
హుస్సేన్‌సాగర్, సరూర్‌నగర్ చెరువులు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయాయి. నగరంలోని వేర్వేరు చెరువుల్లో లేక్ క్లీనప్ డ్రైవ్‌లు చేపడుతుండగా 70శాతం వ్యర్థాలు ప్లాస్టిక్‌వే ఉంటున్నాయి.
మైక్రోప్లాస్టిక్ భూమి, నీటిని కలుషితం చేస్తున్నాయి. జంతువులు ప్లాస్టిక్‌ను తిని మరణిస్తున్నాయి.

ప్రత్యామ్నాయాలు ఇవీ..
హోటళ్లు, బహిరంగ ప్రదేశాల్లో ఫిల్టర్ వాటర్ స్టేషన్లు, రీయూజబుల్ బాటిళ్లు (బాంబూ, స్టీల్, సీసంవాటికి బాటిళ్లకు ప్రోత్సాహం)
జనపనార, కాగితం, వస్త్రంతో చేసిన సంచుల వినియోగం పెంచాలి.
కంపోస్టబుల్ బ్యాగ్‌లు వాడాలి.
హోటళ్లలో విస్తారాకులు, అరిటాకులు ఉపయోగించాలి.
బాంబూప్లేట్లు, కప్పులు, ఎడిబుల్ వస్తువుల వినియోగం పెంచాలి.

## 'దారి' దోపిడీ

హైదరాబాద్ : నగరంలోని రహదారులను చూస్తే.. గుంతలు, మిట్టలే దర్శనమిస్తాయి. ఇంజినీర్ల అవినీతి, గుత్తేదారుల నిర్లక్ష్యంతో.. రోడ్ల నిర్మాణం అత్యంత దారుణంగా జరుగుతోంది. ద్విచక్ర వాహనంలో కిలోమీటరు దూరం కూడా సవ్యంగా వెళ్లలేని పరిస్థితులున్నాయి. జీహెచ్‌ఎంసీ, జలమండలి మధ్యనున్న సమన్వయ లోపం కూడా శాపమే.

ఎన్నెన్ని లోపాలో..
రహదారిపై ఏర్పడే 2.5మీటర్ల పొడవు, 1.33మీటర్ల వెడల్పు, 0.3మీటర్ల లోతున్న గుంతను పూడ్చేందుకు జీహెచ్‌ఎంసీ రూ.12,500 ఖర్చు చేస్తోంది. వర్షాకాలంలో అలాంటి 30వేల గుంతలను పూడ్చినట్లు జీహెచ్‌ఎంసీ చెబుతోంది. అంటే.. వానాకాలంలో గుంతలను పూడ్చినందుకే రూ.37.50 కోట్లకుపైగా ఖర్చయినట్లు.
చిన్న కాంట్రాక్టర్లకు రోడ్డు పనులిస్తున్నారు. వారి దగ్గర నైపుణ్యమున్న సిబ్బంది లేకపోవడంతో..ఇష్టానుసారం రోడ్లను నిర్మిస్తున్నారు. పాత రోడ్లను మిల్లింగ్ చేయట్లేదు. రోడ్లపై ఉన్న గుంతలను వదిలేస్తున్నారు. వాలుగా నిర్మాణం జరగట్లేదు. ఇంజినీర్లు పర్యవేక్షించడం లేదు. దీంతో ప్రజాధానాన్ని దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి.



జీహెచ్‌ఎంసీకి రెండు తారు మిశ్రమం తయారీ కేంద్రాలున్నాయి. అక్కడి నుంచి నలుమూలలకు తారు మిశ్రమాన్ని తరలిస్తుండటంతో.. వేడి చల్లబడి నాణ్యత ఉండట్లేదు.
గతేడాదిలో రూ.600 కోట్ల విలువైన పనులు సీసీ రోడ్లకు చెందినవే. ఒకసారి రోడ్డు వేస్తే.. 40ఏళ్లు నిలవాలి. నగరంలో ఐదు, పదేళ్లకోసారి సీసీ రోడ్లను తిరిగి నిర్మిస్తున్నారంటే.. నాణ్యత ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు. ఏటా రోడ్ల నిర్వహణకు జీహెచ్‌ఎంసీ చేస్తోన్న వ్యయం: రూ.1,000 కోట్లు

**నగరంలో తిరిగే వాహనాల సంఖ్య: 60 లక్షలు**

గుంతలతో దెబ్బతినే వాహనాల మరమ్మతుల ఖర్చు: రూ.50 కోట్లు
ట్రాఫిక్ సమస్యతో జరిగే ఇంధన వృథ: రూ.100 కోట్లు
గుంతలతో అనారోగ్యం.. చికిత్స కోసం ప్రజలు చేసే ఖర్చు: రూ.50 కోట్లుపనులు పకడ్బందీగా జరిగితేనే..
ప్రొఫెసర్ కె.ఎం.లక్ష్మణ్‌రావు, సివిల్ ఇంజినీరింగ్ నిపుణులు, జేఎన్‌టీయూ నగర రహదారులపై రాకపోకలు ఎక్కువ. వాటిని తట్టుకుని నిలవాలంటే నాణ్యతకు పెద్దపీట వేయాలి. నాసిరకం సామగ్రితో కట్టే మ్యాన్‌హోళ్లు కారు బరువును కూడా తట్టుకోలేవు. నీరు నిలవకుండా.. రోడ్ల నిర్మాణం జరగాలి. అప్పుడే నగరంలో రహదారులు మెరుగుపడతాయి.

## ప్రయోజనాలు ఉన్నా.. పరిమితంగా జారీ




జగిత్యాల : కిసాన్ క్రెడిట్ కార్డు(కేసీసీ)లను పరిమిత సంఖ్యలోనే జారీ చేస్తున్నారు. కార్డులతో చాలా ప్రయోజనాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ సదాశయం నెరవేరటం లేదు. జిల్లాలో రైతులు, పాడి పరిశ్రమదారులు, మత్స్యకారులు కలిపి సుమారు 2.95 లక్షల మంది ఉన్నారు. అయిదేళ్లలో కేవలం 26వేలలోపు వరకు మాత్రమే కార్డులను జారీ చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నాలుగో త్రైమాసికం కొనసాగుతుండగా.. ముగింపు లోపయినా అర్హులందరికీ కార్డులను జారీ చేస్తే వారికి ఉపయోగపడుతుంది.


**సంతకాలతోనే సరి..**

19–69 సంవత్సరాల మధ్య వయస్సు గల రైతులు పంట రుణాలకు కావాల్సిన పత్రాలతో కిసాన్ క్రెడిట్ కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చు. పంట రుణాలు పొందేటప్పుడు బ్యాంకుల్లో కేసీసీ పత్రాలపై రైతులతో సంతకాలు చేయించుకుంటున్నారు తప్పితే కార్డులు ఇవ్వటంలో వెనుకంజ వేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల నుంచి లేదా నేరుగా ఆన్లైన్ ద్వారా బ్యాంకు వెబ్సైట్లో దరఖాస్తు చేసుకుని కార్డు పొందొచ్చు. కార్డుకు 5 ఏళ్ల కాలపరిమితి ఉంటుంది.

**సదుపాయాలు**

బ్యాంకులో పంట రుణం తీసుకున్నప్పుడు మంజూరు చేసిన మొత్తం రైతు సేవింగ్ ఖాతాలో జమ చేస్తారు. జమ చేసిన మరుక్షణం నుంచి తిరిగి చెల్లించే వరకు వడ్డీ లెక్కిస్తారు. కానీ కేసీసీ తీసుకుంటే ఈ ఖాతాలోనే పంటరుణం మొత్తం జమ అవుతోంది. రైతు కార్డుతో ఎంత మొత్తం తీసుకుంటే అంతే మొత్తానికి వడ్డీ పడుతోంది. ఒకేసారి కాకుండా పలు దఫాలుగా తీసుకునేవారికి వడ్డీ తగ్గుతోంది.
ఒక బ్యాంకు ఖాతాకు చెందిన ఏటీఎం కార్డును కిసాన్ క్రెడిట్ కార్డు ఖాతాకు లింక్ చేసుకుంటే రెండు రకాలుగా వినియోగించుకోవచ్చు. సదరు ఏటీఎం నుంచి లావాదేవీలు జరిపేటప్పుడు రెండు ఖాతాలు కనిపిస్తాయి. ఏ ఖాతా డబ్బులు వాడాలనుకుంటే ఆ ఖాతా నుంచి తీసుకునే సదుపాయం ఉంటుంది. కిసాన్ క్రెడిట్ కార్డులతో ఏడాది పొడవునా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయవచ్చు. పీవోఎస్ యంత్రాల ద్వారా పంట ఉత్పాదకాలు కొన్నప్పుడు రాయితీలు వర్తిస్తాయి. కేసీసీ రుణ పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచారు. అదనంగా రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు రుణ సదుపాయం కూడా ఉంది. రుణాలకు 3 శాతం వడ్డీ రాయితీ లభిస్తోంది. సురక్ష బీమా యోజన సైతం అమలు చేస్తున్నారు.

## మూత్రపిండం.. ప్రాణాలకు గండం



గోదావరిఖని: ఉమ్మడి జిల్లాలో మూత్రపిండ బాధితులు పెరుగుతున్నారు. ఎక్కువ శాతం మంది మూత్రపిండాల సమస్యలతో ఆస్పత్రులకు వస్తున్నారు. ఆరోగ్య సర్వేలో కూడా ఈ సమస్యతో బాధపడుతున్న వారు మిగతా రోగుల కంటే ఎక్కువ మంది ఉన్నట్లు గుర్తిస్తున్నారు. ఆహారపు అలవాట్లు.. నియంత్రణ లేని జీవనశైలి మూత్రపిండాల వ్యాధికి కారణమవుతోంది. కేంద్రాల్లో రక్తశుద్ధి చేసుకుంటే గాని వారి జీవనం సాగే పరిస్థితి లేదు. ఇక సాధారణ పరీక్షలు, మందులు వాడుతూ వ్యాధిని తగ్గించుకొనే వారు వేలల్లోనే ఉంటారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నెఫ్రాలజీ వైద్య నిపుణులు లేకపోవడంతో రోగులకు ఇబ్బందిగా మారింది.
ఉమ్మడి జిల్లాలోని నాలుగు బోధనాస్పత్రుల్లో ఒక్క నెఫ్రాలజీ నిపుణుడు లేరు. కేవలం సాధారణ ఫిజీషియన్లతోనే పరీక్షలు చేస్తూ నడిపిస్తున్నారు. సాధారణంగా డయాలసిస్ కేంద్రంలో తప్పనిసరిగా నెఫ్రాలజీ వైద్య నిపుణుడి పర్యవేక్షణలోనే రక్తశుద్ధి చేయాలి. ఉమ్మడి జిల్లాలోనే ఎనిమిది డయాలసిస్ కేంద్రాల్లో ఒక్క నెఫ్రాలజీ వైద్య నిపుణుడు లేరు. నాలుగు వైద్య కళాశాలకు అనుబంధంగా ప్రభుత్వ ఆస్పత్రులున్నాయి. మూత్రపిండ సమస్యతో వచ్చే రోగులను పరీక్షించే నిపుణులు కరవవుతున్నారు.
ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు డయాలసిస్ కేంద్రాలు నాలుగు ఉన్నాయి. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఉన్న వీటిలో 300 మంది వరకు డయాలసిస్ చేసుకొంటున్నారు. వీరితో పాటు గోదావరిఖనిలోని సింగరేణి ఆస్పత్రిలో ఉన్న డయాలసిస్ కేంద్రంలో 60 మంది వరకు రోగులు రక్తశుద్ధి చేసుకొంటున్నారు. ఇక ఇతర ప్రాంతాలకు వెళ్లి చేసుకునే వారు కూడా ఉమ్మడి జిల్లాలో ఉన్నారు.

కారణాలు
రక్తంలో అధిక చక్కెర స్థాయి
రక్తపోటు ఎక్కువగా ఉండటం
తీసుకోవాల్సిన జాగ్రత్తలు
ఆహారంలో ఉప్పు శాతం తగ్గించాలి
ప్రొటీన్, పొటాషియం ఉన్న ఆహారాన్ని తక్కువ తీసుకోవాలి
నీరు సరిపడా తాగాలి.

## కొత్త వాహనాలు.. తప్పేనా ఇబ్బందులు



కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో కొత్తగా వాహనాలు కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు పాతికేళ్ల నాటి వాహనాలతోనే నెట్టుకొస్తుండటంతో తరచూ మొరాయిస్తున్నాయి. వీటి స్థానంలో నూతన వాహనాలు తీసుకోవడంతో పారిశుద్ధ్య పనులతోపాటు నీటి సరఫరాకు ఇబ్బందులు దూరం కానున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించడంతో మొత్తం 45 వాహనాలు తీసుకోగా ప్రారంభానికి సిద్ధంగా ఉంచారు. నగరపాలక ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తే మాత్రం కొత్త పాలకవర్గం కొలువుదీరిన తర్వాతే వీటికి ముహూర్తం కుదిరే అవకాశముంది.

పారిశుద్ధ్యం మరింత మెరుగు
నగరవ్యాప్తంగా 66 డివిజన్లు ఉన్నాయి. ప్రతి రోజు ఇంటింటా చెత్త సేకరణ చేయడంతోపాటు వీధుల్లో ఉన్న వ్యర్థాలను తరలించడానికి ట్రాక్టర్లు వాడుతున్నారు. విలీన గ్రామాల్లో ఒక్కొక్కటి ఉండగా, పాత 60 డివిజన్లలో మాత్రం రెండు డివిజన్లకు ఒకటి చొప్పున ఉన్నాయి. పెద్ద ప్రాంతాలకు ఒకరోజు సరిపోకపోవడంతో కార్పొరేటర్లు గగ్గోలు పెట్టారు. డివిజన్కు ఒక ట్రాక్టర్ ఇవ్వాలని పలుమార్లు డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఆ వాహనాలు పాడయ్యాయి.
నగర అవసరాలకు తప్పని పరిస్థితిలో ఇన్నాళ్లు నడిపించారు. కొత్తగా కొన్న ట్రాక్టర్లు సరిపోవు. పాతవి కొన్నింటిని కలిపితే అదనంగా మరో 30 ట్రాక్టర్లు అవసరం ఉంటుంది.
రద్దీ ప్రాంతాల్లో, చెత్త సేకరణకు కొత్తగా స్వచ్ఛ ఆటోలు తీసుకున్నారు. మొత్తానికి శానిటేషన్ విభాగానికి కొత్త ట్రాక్టర్లు వస్తుండటంతో అత్యవసరమున్న ప్రాంతాలకు పారిశుద్ధ్య పనులు మరింత వేగంగా జరగనున్నాయి.

నీటి సరఫరా అవస్థలు తొలగేనా
నగరపాలక సంస్థ వినియోగిస్తున్న ట్యాంకర్లు పూర్తిగా శిథిలమయ్యాయి. ప్రస్తుత ట్యాంకర్లు పరిశీలిస్తే అందులో సగానికి పైగా పనికి రాకుండా ఉన్నాయి. మరికొన్నింటికి మరమ్మతు చేస్తే వినియోగంలోకి తేవచ్చు. కొత్త ట్యాంకర్లు తీసుకోవడంతో జ్యోతినగర్, మార్కెట్ రిజర్వాయర్లకు వీటిని కేటాయించనున్నారు. పైగా ఇటీవల ట్యాంకర్ కావాలంటే రూ.600 ఫీజు చెల్లించాలని అధికారుల ప్రకటించారు. దాంతో ఆదాయ మార్గాలు రానుండటంతో వీటి నిర్వహణను అదే స్థాయిలో చేపట్టాలనే లక్ష్యంతో అధికారులు ఉన్నారు.
కొనుగోలు చేసినవి ట్రాక్టరు : 25
స్వచ్ఛ ఆటోలు : 10
నీటి ట్యాంకర్లు : 10

## రూ.3.45 కోట్ల వంతెన.. తీరనున్న దూరాభారం వెతలు

సైదాపూర్: సైదాపూర్ మండలం వెన్కేపల్లి–పెర్కపల్లి గ్రామాల మధ్య తుమ్మల చెరువు సమీపంలో రూ.3.45 కోట్లతో వంతెన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఏళ్ల తరబడి ఈ మార్గంలో వంతెన లేక అనేక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గతేడాది రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయడంలో కృషి చేశారు. ఫలితంగా నాలుగు నెలల క్రితమే పనులు ప్రారంభించారు. మరో నెల రోజుల్లో నిర్మాణం పూర్తి కానుంది. దీంతో సైదాపూర్, వెన్కేపల్లి, గొల్లగూడెం, పెర్కపల్లి, సర్వాయిపేట, శివరాంపల్లి, నల్లోనితండా ప్రయాణికులకు సుమారు 5 కిలోమీటర్ల మేర దూరాభారం తగ్గనుంది. ఈ మార్గంలో వెళ్లేవారు నేరుగా హుస్నాబాద్, సిద్ధిపేట, హైదరాబాద్ వెళ్లేందుకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. వెన్కేపల్లి–పెర్కపల్లి గ్రామాల మధ్య వంతెన నిర్మించాలని ప్రజలు ఏళ్లుగా విన్నవించినా సాకారం కాలేదు. ప్రభుత్వాలు మారినా వంతెన నిర్మాణం కేవలం హామీలకే పరిమితమైంది. హుస్నాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన పొన్నం ప్రభాకర్ ఈ ప్రాంత అభివృద్ధిపై దృష్టి సారించారని స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వంతెన పనులు దగ్గర పడుతుండటంతో ఇటు ప్రయాణికులు, అటు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో అయితే రైతులు పంట పొలాలకు వెళ్లలేని దుస్థితి ఉండేదని.. వారధి పనులు దగ్గర పడుతుండటంతో మేలు జరగనుంది. మరోవైపు సైదాపూర్ పరిధిలోని సర్వాయిపేటకోట, రాయికల్ జలపాతం అభివృద్ధికి నిధుల మంజూరుతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## స్థాయి పెంచినా.. వసతులు అంతంతే!

ధర్మపురి : ధర్మపురి పట్టణంలోని 30 పడకల ఆసుపత్రిని 50 బెడ్లకు ఉన్నతీకరించినా సమస్యలు అదే స్థాయిలో ఉన్నాయి. రోగులకు తాగునీరు, సరైన భోజన వసతులు కరవయ్యాయి. రోగుల తాకిడి విపరీతంగా పెరిగినా అసౌకర్యాలతోనే నెట్టుకొస్తున్నారు. ప్రతిరోజు ధర్మపురి క్లస్టర్? దవాఖానాకు ధర్మపురి, బుగ్గారం, బీర్?పూర్, వెల్గటూర్, పొరుగున ఉన్న మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట ప్రాంతం నుంచి 150 మంది రోగులు వైద్య పరీక్షలు, చికిత్సలు, ప్రసూతి సేవలకు వస్తుంటారు. వైద్య సిబ్బంది, పరికరాల కొరతతో అత్యవసరమైతే జగిత్యాల ఆస్పత్రికి పంపిస్తున్నారు.

**ఐసీయూ వార్డు ప్రారంభమెప్పుడు?**

ఆసుపత్రి స్థాయిని గతంలోనే అప్‌గ్రేడ్ చేయగా.. వైద్యులు, సిబ్బందిని కేటాయించటం లేదు. దీంతో పలువురు రోగులు అత్యవసర చికిత్సలకు జగిత్యాల, కరీంనగర్? వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే అన్ని రకాల వైద్య పరికరాలు సరఫరా చేసి, ఐసీయూ నిపుణులు, టెక్నీషియన్లు, సిబ్బందిని నియమించాలి. రెండో అంతస్తులో గదులు నిర్మించగా.. పరికరాలు, వైద్య



సిబ్బంది కొరతతో మొక్కుబడి సేవలకే పరిమితమవుతోంది. పది బెడ్లతో ఐసీయూ కేంద్రం ఏర్పాటు చేయగా.. వైద్యులు, నర్సింగ్ సిబ్బందిని నియమించకపోవటంతో ప్రారంభానికి నోచటం లేదు.

**అసౌకర్యాలు ఇవీ..**

విద్యుత్తు సరఫరాకు తరచూ అంతరాయం ఏర్పడుతోంది. జనరేటర్ ఏర్పాటు చేస్తే ఇబ్బంది ఉండదు.
తాగునీటి వసతికి ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయాలి.
స్కానింగ్ యంత్రాలు, రోగ నిర్ధారణ పరికరాలు, ఎక్స్‌రే ప్లాంట్ తదితరాలు లేవు. ఆసుపత్రిలో మందులు కూడా అరకొరగానే లభిస్తున్నాయి.
నాలుగు ల్యాబ్‌లు అవసరం కాగా ఒక్కటే అందుబాటులో ఉంది.

**ప్రతిపాదనలు పంపాం..**సిబ్బంది, పరికరాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఆస్పత్రిలో అన్ని రకాల సేవలందిస్తున్నాం. నిత్యం 150–200 ఓపీ నమోదవుతోంది. ప్రస్తుతం రెండో అంతస్తును కూడా పూర్తిగా అందుబాటులోకి తీసుకొస్తాం. ఉదయం నుంచి రాత్రి వరకు వైద్యులు ఉంటున్నారు.
డా.రవి, ఆసుపత్రి సూపరింటెండెంట్

## రాజన్న కోడెలు అలసిపోతున్నయ్?..

వేములవాడ : వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయం కోడె మొక్కులకు ప్రసిద్ధి. దేశంలో ఎక్కడా లేని విధంగా కోడె మొక్కులు ఈ ఆలయంలోనే భక్తులు చెల్లించుకునే ఆచారం అనాది నుంచి వస్తోంది. కోరిన కోర్కెలు తీరితే స్వామివారికి భక్తులు కుటుంబ సమేతంగా కోడె మొక్కు చెల్లిస్తుంటారు. అలాంటి భక్తుల మొక్కులు తీర్చే కోడెలు అలసి పోతున్నాయి. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు మొదలు కావడంతో కోడె మొక్కులతో పాటు వివిధ ఆర్జిత సేవల మొక్కులు అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వరస్వామి ఆలయంలో చెల్లించుకుంటున్నారు. సమ్మక్క జాతరకు వెళ్లే భక్తులు ముందుగా రాజన్నకు మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా ఉండటంతో గత నెల నుంచి భక్తులు పోటెత్తుతున్నారు.

**సోమవారం 10 వేలకుపైగా కోడె టికెట్లు**

ఒక్కో సోమవారం లక్ష మందికిపైగా భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఇందులో దాదాపు పది వేల మందికిపైగా భక్తులు రికార్డు స్థాయిలో కోడె మొక్కులు చెల్లించుకుంటున్నారు. మిగతా రోజుల్లో 40 వేల నుంచి 80 వేల మంది వరకు భక్తులు స్వామివారి దర్శించుకోగా దాదాపు 8 వేల వరకు కోడె మొక్కులు చెల్లించుకుంటున్నారు. దీంతో కోడెలకు విశ్రాంతి లభించని పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. **నిరంతరాయంగా అయిదు గంటలు**

భక్తులు మొక్కులు చెల్లించుకునే కోడెలు.. గోశాలలో 170 వరకు ఉంటాయి. భక్తుల రద్దీని బట్టి 20 నుంచి 50 కోడెల వరకు ఆలయానికి సిబ్బంది తీసుకువస్తుంటారు. ఈ కోడెలు నిరంతరాయంగా దాదాపు అయిదు గంటల పాటు విధులు నిర్వహిస్తుంటాయి. ఉదయం 5 గంటలకు కోడె మొక్కులు మొదలవుతాయి. నాలుగు షిఫ్టుల్లో ఈ కోడెలను నిరంతరాయంగా మొక్కులు చెల్లించుకునే భక్తులు ఆలయం



చుట్టూ తిప్పుతుంటారు. ప్రస్తుతం కోడె మొక్కులు చెల్లించుకునే భక్తుల సంఖ్య భారీగా పెరిగిపోవడంతో అవి తీవ్రంగా అలసిపోతున్నాయి. దీంతో కొన్ని సందర్భాల్లో కోడెలు ఆలయం చుట్టూ తిరగడానికి వెళ్లడం లేదు. దీంతో వాటిని భక్తులు తాడుతో బలంగా లాగడంతో అవి అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందనే అభిప్రాయం భక్తుల్లో వ్యక్తం అవుతోంది.

**దూరం పెరిగి..**

ముఖ్యంగా రాజన్న ఆలయం చిన్నగా ఉండటంతో తిరిగే సమయం తక్కువగా ఉండేది. దీనికి తోడు గోశాల కూడా సమీపంలోనే ఉండటంతో దూరం తక్కువగా ఉండేది. ప్రస్తుతం భీమన్న ఆలయం పెద్దగా ఉండటంతో ఎక్కువ సేపు తిరగాల్సి వస్తోంది. దీనికి తోడు షిఫ్ట్‌ల తరువాత గోశాల వెళ్లడంతో దూరం పెరిగిపోయింది. వీటన్నింటికి తోడు భారీ సంఖ్యలో కోడె మొక్కుల టికెట్లు విక్రయం అవుతున్నాయి. దీంతో కోడెలకు అసలు ఏమాత్రం విశ్రాంతి లభించని పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. **కోడెల సంఖ్య పెంచేందుకు చర్యలు**

రాజన్న ఆలయంలో కోడెలు తిరిగే స్థలం తక్కువగా ఉండేది. భీమన్న ఆలయంలో ఎక్కువ సేపు తిరగడంలో అలసిపోతున్నాయి. తిరిగే సమయాన్ని తగ్గించేందుకు మరో 50 కోడెలను సిద్ధం చేస్తున్నాం. గోశాలలో అదనంగా కోడెలకు షెడ్లు ఏర్పాటుకు ప్రణాళికా సిద్ధమైంది.
బి.శ్రీనివాస్, రాజన్న ఆలయ ఏఈవో

# ఆచరిస్తే.. అభివృద్ధికి అడుగు

కరీంనగర్ : 2026 కొత్త సంవత్సరం ప్రారంభం అయింది. జిల్లాలో గతంలో కంటే మెరుగైన అభివృద్ధికి అడుగులు పడాల్సిన అవసరముంది. గత సంవత్సరం(2025)లో ప్రభుత్వాలు ప్రకటించిన పలు పథకాలు, పనులు, ఉపాధి, విద్యారంగ అభివృద్ధికి దోహదపడుతున్నాయి. పాలకులు, అధికార యంత్రాంగం దృష్టిసారిస్తే మరింత మెరుగైన ఫలితాలు లభించనున్నాయి.

**తెలంగాణ బ్రాండ్ కొరమీను**

తెలంగాణలో లభించే బొమ్మె(కొరమీను)ను కేంద, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయి. కరీంనగర్‌లోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ఆనుకొని ఉన్న ఖాళీ స్థలంలో పెంపకానికి సంబంధించి శిక్షణ కేంద్రంతోపాటు ఉత్పత్తి చేపట్టాలని ప్రభుత్వం రూ.5.60 కోట్ల నిధులు మంజూరు చేసింది. మొదటి విడతగా రూ.కోటి మంజూరు చేశారు. తద్వారా మత్స్యకారులకు మరింత ఉపాధి పెరగనుంది.

**శాతవాహన పరిధిలో లా కళాశాల**

శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో లా కళాశాల మంజూరైంది. ఎల్ఎల్ఎం, ఎల్ఎల్బీ కోర్సులు ప్రవేశపెట్టారు. ప్రస్తుతం ఎల్ఎల్బీ కోర్సుకు సంబంధించి సీట్ల కేటాయింపు జరిగింది. దీంతో ఇక్కడి విద్య మరింత మెరుగుపడనుంది.

**ఆటోమెటిక్ టెస్టింగ్ సెంటర్**

మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో కరీంనగర్ జిల్లా కేంద్రంగా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షించే ఆటోమెటిక్ టెస్టింగ్ కేంద్రం మంజూరైంది. రూ.8.50 కోట్లతో ఏర్పాటు చేసే ఈ కేంద్రం శంకుస్థాపనకే పరిమితమైంది. ఈ పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది.

అమృత్‌తో తీరనున్న తాగునీటి కష్టాలు



కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో గతంలోని విలీన కాలనీలకు తాగునీటి సరఫరా మెరుగుపర్చేందుకు అమృత్ 2.0 కింద రూ.142 కోట్లు కేటాయించారు. ఈ ఏడాది జూన్ 2026 కల్లా పనులు పూర్తి చేస్తే నీటి కష్టాలు దూరమవుతాయి.

మానేరు రివర్‌ఫ్రంట్

మానేరు రివర్ ఫ్రంట్ పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలి. ఇప్పటికే ఆ పనులు కొంతమేర జరగగా మిగతావి చేసేలా పాలకులు స్పందించాలి.

**నిధులు అవసరం**

కరీంనగర్ విస్తీర?ం పెరగగా మౌలిక వసతులకు రూ.50 కోట్లు మంజూరుకాగా టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించాల్సి ఉంది. ముఖ్యమంత్రి హామీ నిధులకు సంబంధించిన పెండింగ్ పనులు రెండేళ్లుగా ఆగిపోయాయి. ఈ నిధులు విడుదల చేసి పాత 60 డివిజన్లలో 64 పనులు పూర్తి చేస్తే ఆయా ప్రాంతవాసులకు ఇబ్బందులు దూరం కానున్నాయి.

చెత్త శుద్ధీకరణ సాగాలి నగరంలో డంపింగ్‌యార్డు నిండిపోయింది. బయోమైనింగ్ ద్వారా చేపడుతున్న శుద్ధీకరణను వేగంగా చేపడితే చెత్త నిల్వలు తగ్గే అవకాశముంది. ప్రస్తుతం ఉన్న యంత్రాలతోపాటు మరో రెండు యంత్రాలు ఏర్పాటు చేయడంతోపాటు ఉత్పత్తి ప్రక్రియకు పచ్చజెండా ఊపాలి.

# బండరాతి గుట్ట.. అక్రమ పేలుళ్లకు అడ్డా

పెద్దపల్లి: పెద్దరాళ్లను పగులగొట్టడానికి చిన్నపాటి పేలుళ్లకు అనుమతులు పొందుతూ అక్రమార్కులు ఒకేసారి గుట్టను కూల్చేందుకు బోర్‌బ్లాస్టింగ్‌లకు పాల్పడుతున్నారు. దీంతో సమీప పొలాల్లో రాళ్లు ఎగిరిపడుతున్నాయి. ఎగిసిపడే దుమ్ము దిగుబడులపై ప్రభావం చూపగా రైతులు ఆందోళన చెందుతున్నారు.రాళ్లు కొట్టి ఉపాధి పొందే కూలీల స్థానంలో జిల్లాలో పేలుడు పదార్థాల వినియోగం పెరగడంతో పర్యావరణ హననం జరుగుతోంది. అనుమ తులకు, క్షేత్రస్థాయిలో చర్యలకు పొంతన లేకుండా అక్రమ దందా యథేఛగా సాగుతోంది. సమస్యలు వచ్చినప్పుడు మినహా పేలుళ్లపై చూసీచూడనట్లు వ్యవహరించే అధికారుల తీరు తరచూ వివాదాస్పదమవుతోంది.

**కఠినమైన నియంత్రణ**

క్వారీల్లో పేలుళ్ల నియంత్రణపై పర్యవేక్షణ లేకపోవడంతో జిల్లావ్యాప్తంగా ఈ దందా జోరుగా సాగుతుంది. బొంపల్లిలో పేలుడు పదార్థాల నిల్వ కేంద్రం ఉండగా పాలకుర్తి మండలం కన్నాల, మంథని,



జూలపల్లి, ధర్మారం ప్రాంతాలకు రవాణా జరుగుతోందన్న ఆరోపణలున్నాయి.

ప్రతిరోజు తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి ఆరు గంటల మధ్య అక్రమ రవాణా సాగుతున్నట్లు సమాచారం. నిబంధనల ప్రకారం బొంపల్లిలోని నిల్వ కేంద్రం బొంపల్లి గుట్టలపై జరిగే పేలుళ్లకే పేలుడు పదార్థాలను సరఫరా చేయాలి. కానీ ఇతర ప్రాంతాల్లో అనుమతుల్లేని క్వారీలకు అక్రమ రవాణా జరుగుతుందనే ఆరోపణలు ఉన్నాయి.

**ధ్వంసం కాగా..** భూమి లోపలి వరకు రాళ్లను తవ్వుకుంటూ వెళ్లడంతో జిల్లాలోని వివిధ క్వారీల్లో లోతైన లోయలు ఏర్పడుతున్నాయి. వీటిలోని బండరాయిని తొలిచేందుకు పేలుడు పదార్థాలు ఎక్కువగా వినియోగించడంతో వీటికి డిమాండ్ పెరిగింది. పేలుళ్ల కారణంగా పెద్దపల్లి మున్సిపాలిటీకి చెందిన పాత నీటిశుద్ధి కేంద్రం ధ్వంసమైంది. ఇక్కడి పోచమ్మ గుట్ట ప్రమాదంలో పడింది. కన్నాలలో జరుగుతున్న పేలుళ్లు, లోయలాంటి గోతులు భారీగా ఉండటంతో బసంత్‌నగర్ సమీపంలో విమానాశ్రయానికి సైతం గతంలో వైమానిక అధికారులు అనుమతులివ్వలేని పరిస్థితి ఏర్పడింది. విచారణ చేపడతాంనిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదులొస్తే విచారణ చేపడతాం. కఠిన చర్యలు తీసుకుంటాం.శ్రీనివాస్, జిల్లా మైనింగ్ అధికారి

# మత్తు ముఠాల మాయాజాలం



హైదరాబాద్: నగరంలో 2024లో పట్టుబడ్డ మాదకద్రవ్యాల విలువ రూ.130 కోట్లకుపైనే.. 2025లో ఈ స్వాధీనాల విలువ రూ.50 కోట్లకే పరిమితమైంది. ఈ గణాంకాలను చూస్తే రాజధానికి మత్తు పదార్థాల రాక, వినియోగం తగ్గినట్లు కనిపిస్తోంది. దీనికి కారణం మత్తు ముఠాల మాయాజాలమే. గంజాయి, డ్రగ్స్‌స్మగ్లర్లు చిన్న మొత్తాల్లో రవాణా చేయడానికే మొగ్గు చూపిస్తున్నారు. కొంతకాలంగా తెలంగాణ ఈగల్, మూడు కమిషనరేట్లలో ఎస్వోటీ, టాస్క్‌ఫోర్స్, హెచ్న్యూ తదితర విభాగాల నిఘా పెరగడంతో స్మగ్లర్లు కొత్త దారులు అనుసరిస్తున్నారు. పెద్ద మొత్తాలకు బదులు తక్కువ పరిమాణాల్లో సరకు రవాణా చేస్తున్నారు. ఇందువల్లే 2024తో పోలిస్తే.. 2025 కేసులు, నిందితుల అరెస్టులు పెరిగాయి. ముఖ్యంగా సింథటిక్ డ్రగ్స్ రవాణా స్వరూపం మారిపోతోంది. 10 గ్రాములకు మించి పట్టుబడటం లేదు. పాదరక్షలు, మెడకు పెట్టుకునే దిండు ఇలా అనేక మార్గాల్లో తరలిస్తున్నారు. కొన్ని ఉదంతాల్లో వినియోగించాక డ్రగ్స్‌కిట్లతో పరీక్షించినప్పుడే అసలు విషయం బయటపడుతోంది.

నిరంతర నిఘాతో భయపడి...గతంలో మహారాష్ట్ర, యూపీ, కర్ణాటక తదితర రాష్ట్రాలకు గంజాయిని ఏవోబీ నుంచి నగరం మీదుగా ఓఆర్ఆర్ ద్వారా రవాణా చేసేవారు. పోలీసుల నిరంతర నిఘాతో అడ్డుకునేవారు. అందువల్లే టన్నులు, క్వింటాళ్ల లెక్కన గంజాయి స్వాధీనాలుండేవి. ఇక గోవా, బెంగళూరు, ముంబయి ప్రాంతాలనుంచి సింథటిక్ డ్రగ్స్ నగరానికి వచ్చేవి. పెద్ద మొత్తంలో రవాణా చేస్తూ పోలీసు నిఘాతో మార్గమధ్యంలో తనిఖీల్లో, వినియోగదారులకు విక్రయిస్తూ పట్టుబడేవారు. దీంతో ప్రత్యామ్నాయంగా చిన్న మొత్తాల్లో కమీషన్లకు ఆశపడే ఏజెంట్ల ద్వారా రవాణాకు సిద్ధపడుతున్నారు. ఒకవేళ పోలీసులకు దొరికినా తక్కువ మొత్తంలో సరకుండటంతో ఇతర రాష్ట్రాల్లోని ముఠాలు ఈమార్గాన్ని ఎంచుకుంటున్నాయి.

**కొత్త ఎత్తులు వేస్తున్న ముఠాలు**

– అవినాశ్ మహంతి, పోలీస్ కమిషనర్ (సైబరాబాద్ వార్షిక నేర నివేదిక విడుదల సందర్భంగా చేసిన వ్యాఖ్యలు)

"తెలంగాణ వ్యాప్తంగా పోలీసు నిఘా పెరగడంతో మాదకద్రవ్యాల ముఠాలు కొత్త ఎత్తులు వేస్తున్నాయి. గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలను చిన్న మొత్తాల్లోనే రవాణా చేస్తున్నారు. దీంతోగతంతో పోలిస్తే కేసులు, నిందితుల అరెస్టులు పెరిగాయి. స్వాధీనాల విలువ తగ్గింది"

# మార్కెట్కు నకిలీ మందుల జబ్బు



హైదరాబాద్: నకిలీ, నాణ్యత లేని ఔషధాలు అక్రమ మార్గాల్లో మార్కెట్లోకి చేరుతున్నాయి. ఔషధ నియంత్రణ శాఖ(డీసీఏ) ఇటీవల 4,801 ఔషధాల నమూనాల సేకరించి పరిశీలించగా.. 84 వరకు నకిలీ, నాణ్యత లేని మందులేనని తేలింది. లైసెన్సులు లేకుండా.. నకిలీ వైద్యుల క్లినిక్ల వద్ద మందుల షాపుల్లో ఇవి ఎక్కువగా ఉంటున్నట్లు గుర్తించారు. ఇలాంటి మందుల వల్ల జబ్బు తగ్గకపోగా.. మరింత ముదిరిపోయి ప్రాణాల మీదకు వచ్చే ముప్పు ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఖరీదైన ఔషధాల బ్రాండ్లను పోలిన నకిలీ మందులను గుట్టుచప్పుడు కాకుండా నగరానికి తెప్పించి విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

ఈ నేపథ్యంలో ఔషధాలు కొనుగోలు చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అనుమానం వస్తే వెంటనే డీసీఏ దృష్టికి తేవాలని కోరుతున్నారు.

**ఇలా కనిపెట్టొచ్చు..**

స్ట్రిప్/బాక్సుపై ఉన్న బ్రాండ్ పేరు, కంపెనీ పేరు, స్పెల్లింగ్, ఫాంట్, లోగో స్పష్టంగా ఉండాలి. అక్షరాలను అటు ఇటు మార్చటం, తప్పు స్పెల్లింగ్, బ్లర్ ప్రింట్, రంగులో తేడా ఉంటే అనుమానించాల్సిందే. బాక్సుపై ఉన్న తయారీ, గడువు తేదీలు, బ్యాచ్ నంబర్లు.. లోపల మాత్రల స్ట్రిప్, సీసాలపై ఒకేలా ఉన్నాయో లేవో చూడాలి. మందుల ఉత్పత్తి చిరునామా, ఇతర వివరాలు కూడా స్పష్టంగా ఉండాలి.

2023 నుంచి ఇండియాలో తయారయ్యే మందులపై క్యూఆర్, బార్కోడ్ తప్పనిసరి చేశారు. వీటిని స్కాన్ చేస్తే అన్ని వివరాలు రావాలి. రాలేదంటే అది నకిలీ క్యూఆర్ కోడ్ అని భావించాలి.

తరచూ వాడే మందుల రంగు, వాసన కంటే భిన్నంగా అనిపిస్తే ఆలోచించాల్సిందే. మాత్ర పరిమాణం, రంగు, ఆకారం పాత దానికంటే వేరుగా ఉంటే వెంటనే మందుల షాపు నిర్వాహకులను ఆరాతీయాలి. మాత్రలను చేతిలోకి తీసుకున్న వెంటనే పౌడర్లా మారడం, రంగులో తేడా, టానిక్లో మలినాలు, రుచి, వాసనలో తేడా ఉండే ఫార్మాసిస్ట్ లేదా వైద్యుడికి చూపించాలి. పిల్లల సిరప్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అనుమతులు లేని దుకాణాలు, సామాజిక మాధ్యమాలు, వెబ్సైట్లలో వచ్చే ఆఫర్లు, వివరాలు చూసి కొనకుండా జాగ్రత్త పడాలి. ప్రతి మందుకు బిల్ తీసుకోవాలి. అప్పుడే చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చు.

# పిల్లల పేర్లు గల్లంతు




హైదరాబాద్: పాతబస్తీలోని ఒవైసీ ఆస్పత్రిలో అక్టోబరు 28, 2003న జన్మించిన శిశువుకు సల్వా మావిష్ అని పేరు పెట్టారు. మే 29, 2009న ఆ పాపకి తల్లిదండ్రులు జనన ధ్రువీకరణపత్రం తీసుకున్నారు. 1174–2009 ప్రొసీడింగ్ నంబరుతో చార్మినార్ సర్కిల్ కార్యాలయం ఆ ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేసింది. ఇప్పుడు అదే జీహెచ్ఎంసీ.. సదరు అమ్మాయి పేరు రికార్డుల్లో లేదంటోంది. ఇలాగే.. సుమారు 2వేల మంది పేర్లు బల్దియా రికార్డుల నుంచి గల్లంతయ్యాయనే విమర్శలున్నాయి. ఫలితంగా.. ఉన్నత చదువులు, విదేశాలకు వెళ్లాలనుకుంటున్న యువతీయువకులకు తీరని వేదన మిగులుతోంది.

పొంతనలేని సమాధానం..: తన కూతురి పేరు రికార్డుల నుంచి ఎలా మాయమైందని సల్వా తల్లి ప్రశ్నించగా.. 'అక్టోబరు 12, 2021న రాష్ట్ర ప్రభుత్వం జనన, మరణాల నమోదు నిబంధనల్లో మార్పులు చేసింది. పుట్టిన తేదీ నుంచి 15 ఏళ్ల లోపే శిశువు పేరు రికార్డుల్లో నమోదు చేయాలని నిబంధన తీసుకొచ్చింది. తర్వాత.. గడువును 20ఏళ్లకు పెంచారు. మీ కుమార్తె విషయంలో ఆ పరిమితి కూడా మించిపోయింది. అందువల్ల పేరుతో జనన ధ్రువీకరణపత్రం ఇవ్వలేకపోతున్నాం."అంటూ ప్రస్తుత చాంద్రాయణగుట్ట సర్కిల్ కార్యాలయం పొంతనలేని సమాధానం ఇచ్చింది.

**'సర్' ఆందోళన కూడా..**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పేరుతో రాష్ట్రంలో జరగనున్న ఓటరు సర్వేకు జనన ధ్రువీకరణపత్రాలు చాలా కీలకం. విద్యార్హతలు, గుర్తింపుకార్డులు లేని వారికి ఈ పత్రాలు అవసరం. జీహెచ్ఎంసీ నిర్వాకం వల్ల అలాంటి వారికి సర్టిఫికెట్లు జారీ నిలిచిపోవడంతో.. బాధితులు 'సర్'సర్వే తలచుకుని ఆందోళన చెందుతున్నారు.

ఏం జరిగిందంటే..2017 వరకు ఆస్పత్రులు ఇచ్చే జనన మరణాల వివరాలు, క్షేత్రస్థాయి తనిఖీలను ప్రామాణికంగా తీసుకుని..సర్టిఫికెట్లపై పేర్లను ముద్రించి ఇచ్చేవారు. తర్వాత మీ సేవా కేంద్రాల నుంచి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అప్పటివరకు జారీ అయిన సర్టిఫికెట్లలోని వివరాలు, పత్రాలను జీహెచ్ఎంసీ డిజిటల్ రూపంలోకి మార్చింది. ఇందుకు ప్రైవేటు సంస్థను నియమించుకుంది. ఈ క్రమంలో.. పలువురి పేర్లు గల్లంతయ్యాయనే విమర్శలున్నాయి. అధికారులను వివరణ కోరగా.. తమకు ఆ వివరాలు తెలియవని సమాధానం దాట వేస్తున్నారు.

# యమపాశం.. ఎన్ని పీకలు కోస్తుందో?

హైదరాబాద్: చైనా మాంజా దారాలు యమపాశంలా మారాయి. పండగ పూర్తయి పది రోజులవుతున్నా మాంజా యమపాశం విసురుతూనే ఉంది. నగరంలోని ఏదో ఓ ప్రాంతంలో ద్విచక్ర వాహనదారులు బాధితులవుతూనే ఉన్నారు. తాజాగా కూకట్పల్లిలో ఓ చిన్నారి ప్రాణం పోయింది. రహదారులపై కత్తిలా వేలాడుతున్న దారాలను తొలగించకపోతే ఇంకెన్ని ప్రాణాలు పోతాయోనన్న ప్రశ్న తలెత్తుతోంది. జీహెచ్ఎంసీ, పోలీసులు, ప్రజలు స్వచ్ఛందంగా తమ పరిధిలో మాంజాను తొలగిస్తేనే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. చెరువులు, మైదానాలు, ఖాళీ స్థలాలు, చెట్లకొమ్మలు, భవనాల పైకప్పుపై మాంజా గుట్టలుగా పోగైంది. చాలా మంది పతంగులు ఎగరేసి దారాలను వదిలేయడంతో సమస్య తలెత్తుతోంది.వినియోగంపై నిషేధం విధించి దుకాణాల్లోని మాంజాను పోలీసులు స్వాధీనం చేసుకున్నప్పటికీ జనాలు పెద్ద ఎత్తున ఉపయోగించారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ సంస్థలు నిర్వహించిన పతంగుల కార్యక్రమాల్లోనూ ఈ మాంజాను వినియోగించారు. బైకులు, సైకిళ్లపై వెళ్లేవారికి ఈ మాంజా ప్రాణాంతకం. పదునైన సన్నని దారం మెడకు తగలగానే క్షణంలో పీక తెగిపోంది. రక్తస్రావంతో బాధితులు నిమిషాల్లో చనిపోతున్నారు.దీన్నుంచి తప్పించుకునేందుకు పలువురు ద్విచక్ర వాహనదారులు హ్యాండిల్కు దృఢంగా ఉండే ఇనుప తీగను అమర్చుకుంటున్నారు. మెడ, ఇతర శరీర భాగాలకు తగలకుండా ఆ తీగ కవచంలా పని చేస్తోంది.మాంజా వల్ల ఎక్కువగా మెడ భాగంలో గాయాలవుతాయి. దీన్ని అడ్డుకోవడానికి మెడ చుట్టూ మందంగా ఉండే వస్త్రం చుట్టుకోవాలని లేదా ఆన్లైన్లో దొరికే నెక్షీల్డు ఉపయోగించాలని పోలీసులు కోరుతున్నారు.

# అత్యాశకు పోతే.. ఖాతా ఖాళీ

సూర్యాపేట: ఒకప్పుడు బ్యాంకు ఖాతా కేవైసీ చేయించుకోండి.. ఓటీపీ చెప్పాలంటూ ఖాతా ఖాళీ చేసిన సైబర్ నేరగాళ్లు కొత్త పన్నాగాలతో దూకుడు పెంచారు. పండగలొస్తే ఆన్‌లైన్ షాపింగ్ పేరుతో తక్కువ ధరలకే సరకులు అందిస్తామంటూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల పేరుతో నమ్మకం కలిగిస్తూ నూతన పంథను అనుసరిస్తూ ప్రజల డబ్బును కొల్లగొడుతున్నారు. పోలీస్‌శాఖ విడుదల చేసిన వార్షిక నివేదిక ప్రకారం ఉమ్మడి నల్గొండ జిల్లాలో సైబర్ నేరాలు గణనీయంగా పెరిగాయి. 2024లో 545 కేసులు నమోదు కాగా 2025లో ఈ సంఖ్య 590కు చేరింది. 2026లోకి అడుగిడిన నేపథ్యంలో జనం తొందరడకుండా అప్రమత్తంగా ఉంటూ సైబర్ నేరగాళ్ల మోసాలను తిప్పికొట్టాలని పోలీసులు, నిపుణులు సూచిస్తున్నారు.

**అవగాహన కల్పిస్తున్నా..**

సైబర్ నేరగాళ్లు ఏవిధంగా మోసానికి గురిచేస్తున్నారో వివరిస్తూ, అందుకు ప్రజలు ఎలా అప్రమత్తం కావాలో పోలీసులు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయినా కేటుగాళ్లు బురిడీ కొట్టించడంతో రూ.లక్షలు పోగొట్టుకుంటున్నారు.

**ఆలస్యంతోనే అనర్థం**మోసానికి గురైన వారిలో చాలామంది పరువు పోతుందని ఆలస్యంగా ఫిర్యాదు చేస్తుండటంతో కేసుల్లో రికవరీ ఉండటం లేదని పోలీసులు చెబుతున్నారు. మోసపోయిన వారు నిమిషాల వ్యవధిలోనే 1930కు ఫిర్యాదు చేయాలి. పోలీసులు ఆ కేసును



ఛేదించడానికి కొంత వీలుగా ఉంటుంది. గడిచిన రెండేళ్లలో నమోదైన కేసుల్లో పోలీసులు రికవరీ చేసింది చాలా తక్కువే. సైబర్ నేరగాళ్లు కాజేసిన సొత్తును నిమిషాల్లో రికవరీకి అవకాశం లేకుండా మార్చేస్తున్నారని పోలీసులు చెబుతున్నారు.

**12 నెలల్లో రూ. 14.77 కోట్లు**

గతేడాది నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో 462 కేసుల్లో రూ.14.77 కోట్లు కాజేశారు. దీన్ని సవాల్‌గా తీసుకున్న పోలీసులు రికవరీ ఆశించినంత చేయకపోవడం ఆందోళన కలిగిస్తోంది. అందులో రికవరీ అయింది రూ.2.55 కోట్లు మాత్రమే. అయితే యాదాద్రి జిల్లాలో సైబర్ కేసుల వివరాలను పోలీసులు ప్రకటించినప్పటికీ, చోరీ మొత్తం, రికవరీ వివరాలు మాత్రం వెల్లడించలేదు.

**అప్రమత్తంగా ఉండాలి**

లక్ష్మనారాయణ, సీఐ, సైబర్ సెల్, సూర్యాపేట

ఏపీకే ఫైల్స్‌ను ఓపెన్ చేయొద్దు. ఆన్‌లైన్‌లో తక్కువ ధరలకు వస్తువులు ఇస్తామంటూ వచ్చే సంక్షిప్త సమాచారాలను, ఫోన్లకు స్పందించవద్దు. ఆన్‌లైన్ ఖాతాలకు స్ట్రాంగ్ పాస్‌వర్డ్‌లు పెట్టుకోవాలి.

# పల్లెల్లో.. ఇక పాలపొంగులే..!

రాజపేట : మహిళా సాధికారత, ఆదాయం పెంపు, పాడి అభివృద్ధే లక్ష్యంగా ఇందిరా డెయిరీ ప్రాజెక్టును చేపట్టాలని తాజాగా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం కింద స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు రెండు గేదెలు, లేదంటే ఆవులు పంపిణీ చేయనున్నారు. ఈ పథకంతో అతివలకు జీవనోపాధి లభించడమే కాకుండా ఆర్థికంగా అభివృద్ధి సాధించడానికి అవకాశం ఏర్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

**ఒక్కో యూనిట్‌కు రూ.2లక్షలు..**

ప్రతి మండలాన్ని మూడు జోన్లుగా విభజిస్తారు. పది గ్రామాలను యూనిట్‌గా ఏర్పాటు చేస్తారు. పథకంలో ఒక్కో యూనిట్ ధర రూ.2లక్షలు. ఇందులో ప్రభుత్వం రూ.1.40 లక్షలు రాయితీ ఇస్తుంది. మిగిలిన రూ.60 వేలు బ్యాంకులు రుణంగా అందిస్తాయి. ఈ డబ్బుతో రెండు గేదెలు లేదంటే రెండు ఆవులు కొనిస్తారు. పశువులకు గడ్డి, దాణా సరఫరాను స్థానిక యువతకు అప్పగించి వారికి ఉపాధి కల్పించే యోచనలో ప్రభుత్వ వర్గాలున్నాయి. ఈ విషయమై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు వెలువడలేదని, రాగానే మార్గదర్శకాల ప్రకారం పథకం అమలుకు కృషి చేస్తామని సంబంధిత అధికారులు అంటున్నారు.

**పెరగనున్న పశుసంతతి, పాల ఉత్పత్తి..**

గ్రామాల్లో పశువుల సంఖ్య బాగా తగ్గిందనే విషయమై ఇటీవల పశు సంవర్ధక శాఖ వెల్లడించిన గణాంకాల్లో తేలింది. 2018లో పశుగణన చేపట్టగా 69,173 తెల్లజాతి పశువులు, 1,22,620 నల్లజాతి పశువులున్నట్లుగా తెలిసింది. ప్రస్తుతం వాటి సంఖ్య 15 శాతంపైగా తగ్గిందని తెలుస్తోంది. గతంలో అత్యధికంగా పాల దిగుబడిని సాధించిన జిల్లా ప్రస్తుతం కొంతమేర తగ్గిందనే చెప్పవచ్చు. ప్రధానంగా వ్యవసాయ పనులు యంత్రాలతో చేయడం, గ్రామాల్లో ఖాళీ ప్రదేశాలు తగ్గి మేతకు కొరత ఏర్పడటంతో పశువుల సంతతి తగ్గడానికి కారణంగా చెప్పవచ్చు. పాల ఉత్పత్తి బాగా పడిపోయింది.

**జిల్లా సమాచారం..** గ్రామ పంచాయతీలు : 427 మండల మహిళా సమాఖ్యలు : 17 మొత్తం స్వయం సహాయక సంఘాలు : 14,986 సంఘాల్లోని సభ్యుల సంఖ్య : 1,91,811

# ఎప్పుడిస్తారో.. రూ.19 కోట్లు

సూర్యాపేట : అన్నదాతలకు అందుబాటులో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పిస్తోంది. జిల్లాలో వానాకాలం కొనుగోళ్లు పూర్తయ్యాయి. కానీ ఆరేళ్లుగా హమాలీ ఛార్జీలు విడుదల చేయక రైతులపైనే ఆ భారం పడుతోంది. ఈసారైనా అందిస్తారని ఆశిస్తున్నారు. కేంద్రాల్లో ధాన్యాన్ని హమాలీలు సంచుల్లో నింపి లారీల ద్వారా మిల్లులకు తరలిస్తారు. ఇందుకు క్వింటాకు రూ.45 చొప్పున హమాలీలకు చెల్లించాల్సి ఉంటుంది. వారికి చెల్లించిన అనంతరం ధాన్యం విక్రయించిన నగదుతోపాటు రైతుల ఖాతాల్లో జమ కావాల్సి ఉంటుంది. కానీ ఆరేళ్లుగా హమాలీ ఖర్చు జమ చేయడం లేదు. జిల్లాలో 2025–26 వానాకాలం సీజన్‌లో 348 కేంద్రాల ద్వారా 3.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల కాలంలో పది విడతల్లో, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారులో మూడు విడతల్లో కొనుగోళ్లు చేపట్టగా మొత్తం ఆరేళ్లుగా రైతులకు హమాలీ ఛార్జీలు చెల్లించలేదు. సన్నరకం ధాన్యానికి బోనస్ ప్రకటించడంతో 90 శాతం రైతులు ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయిస్తున్నారు.

హమాలీ ఛార్జీల రూపంలో జిల్లా వ్యాప్తంగా రెండు సీజన్లకు కలిపి రూ.2.62 కోట్లు వరకు రైతులపై భారం పడింది. ఈ లెక్కన పన్నెండు విడతల్లో బకాయిలు రూ.19.18 కోట్ల వరకు రావాల్సి ఉంది. బకాయిలు, హమాలీ ఛార్జీలు చెల్లింపులపై ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు లేవని పౌరసరఫరాల శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

# అల్లరి మూకలపై కేసులు 'పెట్టీ'..

హైదరాబాద్: మిత్రుడితో కలసి బైకుపై వెళ్తున్న ప్రబుద్ధుడు ట్రాఫిక్ కూడలిలో ఒక అమ్మాయితో అనుచితంగా ప్రవర్తించాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు బైక్ నంబరు ఆధారంగా అతడిని పట్టుకుని కోర్టులో హాజరుపరచగా 2 రోజుల జైలుశిక్ష పడింది. బైక్‌కు సైలెన్సర్ తొలగించి రాత్రి వేళల్లో చక్కర్లు కొట్టే ఓ యువకుడు తనిఖీల్లో పట్టుబడ్డాడు. కేసు నమోదు చేస్తే తేలికగా తీసుకున్నాడు. బడా నాయకుడి ఫోన్‌కాల్‌తో బయటపడొచ్చని ధీమాగా ఉన్నాడు. 5 రోజులు జైల్లో ఉండి వచ్చాక తప్పు తెలుసుకున్నాడు.

పెట్టీ కేసు.. ఓస్ ఇంతేగా! ఇలా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లటం.. క్షణాల్లో బయటకు రావటమేనని చాలామందిలో అభిప్రాయం ఉంది. కేసు చిన్నదే.. కానీ ప్రభావం చాలా పెద్దదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. నగరంలో ఏటా లక్షకుపైగా పెట్టీ కేసులు నమోదవుతున్నాయి. అధికశాతం మందికి జైలుశిక్షలు, జరిమానాలు పడుతుంటాయి. బహిరంగ ప్రదేశాల్లో హల్‌చల్ చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిని సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని కోర్టు




ఆదేశించింది. సుమారు 200 మందికిపైగా చీపుర్లు చేతపట్టి ఉద్యానవనాలను శుభ్రం చేశారు. మరికొందరు మొక్కలు నాటడం, ట్రాఫిక్ కూడళ్లలో విధులు నిర్వర్తించడం లాంటివి చేశారు. మెహిదీపట్నం సమీపంలో ఒక యువకుడు రోడ్డుపై మద్యం తాగుతూ చుట్టుపక్కల వారికి ఇబ్బంది కలిగించాడు. పోలీసులు పెట్టీ కేసు నమోదు చేసి జైలుకు పంపారు. ఫలితంగా అతని ఉద్యోగం ఊడింది.

**ఎక్కువగా ఎవరంటే...** బస్తీలో మద్యం మత్తులో వీరంగం చేసే మందుబాబులు, దారెంట వెళ్లేవారిని అటకాయించే పోకిరీలు, ట్రాఫిక్‌లో నిబంధనలు పట్టించుకోని ఉల్లంఘనులు, చిన్న విషయానికే గొడవపడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై ఎక్కువగా పెట్టీ కేసులు నమోదవుతున్నాయి. చాంద్రాయణగుట్ట పరిధిలో కత్తితో సంచరిస్తున్న వ్యక్తికి 15 రోజుల జైలుశిక్ష పడింది. మరికొందరు మద్యం తాగి రోడ్లపై న్యూసెన్స్ చేస్తుంటారు. ఇలాంటి వారిపై పోలీసులు ఈ-పెట్టీ కేసులు నమోదు చేసి వెంటనే కోర్టుల్లో చార్జిషీట్ దాఖలు చేస్తున్నారు. కొత్త ఏడాదిలో పెట్టీ కేసుల నమోదుపై దృష్టి సారించారు.

# వేటాడేదెవరు..? ఆటాడించేదెవరు?

కొత్తగూడెం : ఖమ్మం, భద్రాద్రి జిల్లాలోని కొన్ని మారుమూల ప్రాంతాల్లో విద్యుత్తు తీగలతో వన్యప్రాణులను వేటాడుతున్నా.. క్షేత్రస్థాయి అటవీ సిబ్బంది కళ్లు మూసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శని, ఆదివారాలు వస్తే పట్టణాలకు సైతం వన్యప్రాణుల మాంసం విచ్చలవిడిగా సరఫరా అవుతున్నా.. అటవీ అధికారులకు సమాచారం అందితే కానీ నిందితులను పట్టుకోలేని పరిస్థితి నెలకొంది. కంచె.. చేనును మేసిన చందంగా మారింది తల్లాడ ఫారెస్ట్ రేంజ్ పరిస్థితి. ఒకవైపు అరుదైన చిరుతపులి మృతిచెందితే దాని మరణానికి గల కారణాలను అన్వేషించాల్సిన అటవీశాఖ అధికారులు.. ఆధారాలను కాల్చి బూడిద చేయటం సర్వత్రా చర్చనీయాంశమైంది. అడవిలో ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించటం.. వన్యప్రాణుల పాలిట శాపంగా మారుతోందని



చెప్పటానికి ఈ ఘటనే నిదర్శనంగా నిలుస్తోంది.

**నిబంధనలకు విరుద్ధంగా..**

వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం చిరుతపులి మరణిస్తే అనుసరించాల్సిన నిబంధనలేవి అధికారులు పాటించకపోవటం అనేక అనుమానాలకు తావిస్తోంది. చిరుత చనిపోయిన సమాచారం అందిన వెంటనే పోస్టుమార్టం నిర్వహించకుండా, పంచనామా చేయకుండా గుట్టుచప్పుడు కాకుండా కళేబరాన్ని కాల్చేయటం అంటే.. నేరాన్ని కప్పిపుచ్చే కుట్రే. పైగా ఏడాది పాటు ఈ నిజాన్ని దాచిపెట్టడం వెనుక ఉన్న 'అదృశ్య హస్తాలు' ఎవరివనేది తెలియాలి. వేటగాళ్లతో అధికారులు కుమ్మక్కై ఈ పనికి పూనుకున్నారా..? లేదా చిరుత కళేబరం దొరికితే తమ ఉద్యోగాలకు ఏమైనా ఇబ్బందులు వస్తాయని దహనం చేశారా..? అనేది ఉన్నతాధికారుల పరిశీలనలో తేలాల్సి ఉంది.

**ఇకనైనా మేల్కొంటారా..?**

కల్లూరు ఘటనపై ఖమ్మం డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ ఆదేశించిన విచారణ కేవలం కంటితుడుపు చర్యగా మిగలకూడదు. ఇప్పటికే కల్లూరు డిప్యూటీ రేంజ్ అధికారి, కల్లూరు, లక్ష్మీపురం బీట్ అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వల్లే క్షేత్రస్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఉభయ జిల్లాల అటవీశాఖ అధికారులు ఇప్పటికైనా మేల్కొని వన్యమృగాల సంరక్షణకు చొరవ చూపాలని కోరుతున్నారు.

**అరుదైన మృగాలకు రక్షణేది?**

కనకగిరి అభయారణ్యంలో చిరుత పులులు సంచరిస్తున్నాయని ఓవైపు అటవీశాఖ అధికారులు చెబుతుండగా.. ఇలాంటి ఘటనలు జరగటం వన్యమృగాల భద్రతను ప్రశ్నార్థకంగా మారుస్తోంది. అడ్డుకోవాల్సిన అధికారులే ఆధారాలను మాయం చేయాలని చూస్తే.. భవిష్యత్తులో వేటగాళ్లకు అడ్డులేకుండా పోతుందనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో బీట్, సెక్షన్ అధికారులు ఏం చేస్తున్నారో పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉన్నతాధికారులదే. ఒక చిరుత మరణిస్తే ఏడాది దాకా జిల్లా అధికారులకు తెలియకపోవటం వారి వైఫల్యానికి అద్దం పడుతోంది.

# 'అపరాధ రుసుం'తో సరిపెడతారా?



హైదరాబాద్: జీహెచ్ఎంసీలో విలీనమైన శంషాబాద్, నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల్లో అనుమతులు లేకుండా వందల్లో బహుళ అంతస్తుల భవనాలను నిర్మించారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 111 జీవో వర్తిస్తుందని తెలిసినా.. కొందరు అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, ఆసుపత్రులు, రెస్టారెంట్లు కట్టారు. నిబంధనల ప్రకారం వాటిని కూల్చేందుకు మున్సిపాలిటీకి అధికారం ఉన్నా, రాజకీయ ఒత్తిళ్లతో వదిలేశారు. ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకుంటారా? మున్సిపాలిటీలుగా ఉన్నప్పుడు వసూలు చేసిన రెట్టింపు అపరాధ రుసుంతో సరిపెడతారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**జీహెచ్ఎంసీలో కూల్చివేత..**

జీహెచ్ఎంసీ కోర్ సిటీలో నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మించినా, సెట్ బ్యాక్‌లు లేకపోయినా.. తాఖీదులు ఇచ్చి వాటిని కూల్చేస్తున్నారు. శంషాబాద్, నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల్లో అక్రమ భవనాలను పురపాలక శాఖ అధికారులు గతంలో కూల్చేశారు. తాజాగా ఏం చేస్తారనే విషయంలో ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వడం లేదు.

**అధికారుల ఉదాసీనత వల్లే..**

శంషాబాద్ మున్సిపాలిటీలో నిబంధనల ప్రకారం బహుళ అంతస్తుల భవనాలు నిర్మించకూడదు. కానీ ఖాళీగా ఉన్న ప్రైవేటు స్థలాలు, పాత నివాసాలను కూల్చి స్థిరాస్తి వ్యాపారులు బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు.

మున్సిపాలిటీ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లడం లేదు. అనుమతి లేకుండా ఎలా నిర్మిస్తున్నారంటూ ప్రశ్నించడం లేదు. నిర్మాణాలు పూర్తయ్యాక.. కింది స్థాయి మున్సిపల్ సిబ్బందిలో కొందరికి మామూళ్లు ఇచ్చి ఇంటి నంబర్లు తీసుకుంటున్నారు. ఈ నంబర్ల సాయంతో విద్యుత్తు, నల్లా కనెక్షన్లు తెచ్చుకుంటున్నారు.

# మెట్రో స్వాధీనానికి నిధుల సమీకరణపై దృష్టి



హైదరాబాద్: హైదరాబాద్ మెట్రోరైలు మొదటి దశ ప్రాజెక్ట్ ప్రభుత్వం స్వాధీనానికి అవసరమైన నిధుల సమీకరణపై దృష్టి పెట్టింది. యాజమాన్యం బదిలీ జరగాలంటే ఒప్పందం ప్రకారం రూ.2వేల కోట్ల ఈక్విటీని ఎల్ అండ్‌టీకి చెల్లించడంతో పాటు రూ.13వేల కోట్ల రుణాలను సర్కారుపైకి బదలాయించుకుంటామని తెలిపింది. ఈ నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం వేర్వేరు మార్గాలను అన్వేషిస్తోంది. రైల్వే ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్‌లకు రుణాలను ఇచ్చే ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్‌ను(ఐఆర్ఎఫ్‌సీ)ని ప్రభుత్వం సంప్రదించినట్లు ఒక ఉన్నతాధికారి 'న్యూస్‌టుడే'కు తెలిపారు. మెట్రోరైలు ప్రాజెక్టులకు సైతం ఐఆర్ఎఫ్‌సీ ఇటీవల కాలంలో నిధులను అందజేస్తోంది. సూరత్‌లోని మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్ట్ హబ్ కోసం, మెట్రోరైలు కోచ్‌ల కొనుగోలుకు రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ రుణాలను ఇచ్చింది. ఎక్కడి నుంచి రుణాలు తీసుకోవాలన్నా.. ఎఫ్ఆర్‌బీఎం పరిమితి మేరకే అవకాశం ఉంటుందని ఆర్థిక రంగ నిపుణులు అంటున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిధుల సమీకరణ క్లిష్టమే అని చెబుతున్నారు. తొలుత స్వాధీన ప్రక్రియ పూర్తి చేసి.. ఆ తర్వాత భూములు, మాల్స్ విక్రయించి వాటికి చెల్లింపులు చేయాలనేది సర్కారు ఆలోచన. ఇందుకు సమయం పట్టే అవకాశం ఉంది కాబట్టి రుణ సమీకరణపై సర్కారు దృష్టి పెట్టింది. ముంబయిలో మెట్రోని సర్కారు స్వాధీనం చేసుకున్న మాదిరి ఈ ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉందంటున్నారు.

**ఒప్పందాలు బదిలీ అయ్యేలా..**

ప్రస్తుతం మెట్రోరైలును నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీ సంస్థ... రుణాలు, ఆపరేషన్స్, రవాణా ఆధారిత అభివృద్ధి(టీవోడీ)లో భాగంగా పలు థర్డ్‌పార్టీ సంస్థలతో ఒప్పందం చేసుకుంది. దీని ప్రకారం గత ఒప్పందాలన్నీ యథవిధిగా కొనసాగుతాయని అధికారులు అంటున్నారు. టీవోడీలో భాగంగా 12.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో మాల్స్ నిర్మించారు. వీటిలోని మల్టీప్లెక్స్‌లను, రిటైల్ స్పేస్‌ను పలు సంస్థలకు లీజుకు ఇచ్చారు. ఎల్ అండ్ టీకి ప్రభుత్వం 237 ఎకరాలను కేటాయించింది. ఇందులో రాయదుర్గంలోని 15 ఎకరాల స్థలాన్ని ఎల్ అండ్ టీ సంస్థ మానిటైజ్ చేసి రూ.1100 కోట్ల వరకు సమకూర్చుకుంది. సర్కారు స్వాధీనం చేసుకున్న తర్వాత సమీక్ష నిర్వహించి తదుపరి కొనసాగింపు ఉంటుందని అంటున్నారు. స్వాధీనానికి సంబంధించి ఐడీబీఐ క్యాపిటల్, కొత్త సాంకేతికత కమిటీలు ఇచ్చిన నివేదిక ఆధారంగా నిర్ణయాలు ఉంటాయని చెబుతున్నారు.

# నిఘా కన్ను.. భద్రతకు దన్ను



హైదరాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో అత్యాధునిక భద్రతా ప్రమాణాలు ప్రయాణికులకు అందుబాటులోకి వస్తున్నాయి. ఏఐతో కూడిన సీసీ కెమెరాలను కీలక ప్రాంతాల్లో ఏర్పాటు చేసి విమానాశ్రయంలోని కమాండ్ కంట్రోల్‌రూంకు అనుసంధానించారు. శంషాబాద్ విమానాశ్రయం ప్రారంభంలో తొలి రోటరీ నుంచి నోవాటెల్‌కు సమీపంలోని చెక్‌పోస్ట్ వరకూ ఏఐ కెమెరాలను అమర్చారు. వీటితోపాటు బస్సులు, ఇతర వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, క్యాబ్ బుకింగ్ స్టేషన్ల వద్ద వీటిని ప్రత్యేక కోణాల్లో ఏర్పాటు చేశారు. కెమెరాలు మనుషుల కదలికలను (మోషన్ క్యాప్చర్) భిన్నమైన కోణాల్లో చిత్రీకరించనున్నాయి. వాటి ఆధారంగా పోలీసులు, సీఐఎస్ఎఫ్ దళాలు వేగంగా చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి.

క్యాబ్‌ల మోసాలపై.. విమానాశ్రయానికి చేరుకుంటున్న ప్రయాణికులు.. ఇళ్లకు, గమ్యస్థానాలను చేరుకునేందుకు ఓలా, ఉబర్ క్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు. రద్దీ వేళల్లో క్యాబ్‌లు లభించడం లేదు. కొందరు బుకింగ్ రద్దు చేసుకోవాలని, క్యాబ్‌కు ఎంత ఇస్తారో అంతే ఇవ్వాలని అడుగుతున్నారు. కొందరు తమకు ఫోన్‌పే లేదా గూగుల్‌పే చేస్తే 2 నిమిషాల్లో క్యాబ్‌లను తీసుకువస్తామంటూ డబ్బు తీసుకుని వెళ్లిపోతున్నారు. వీటిపై పోలీసులకు ఫిర్యాదులు చాలా వస్తున్నాయి. ఈ నిఘా కెమెరాల ద్వారా ప్రయాణికులను మోసం చేసిన వారిని గుర్తిస్తున్నారు. అరెస్ట్ చేస్తున్నారు.

**నిరంతరం..** విమానాశ్రయ రహదారుల మధ్యలో ఎవరైనా వాహనాలను నిలిపితే వెంటనే కమాండ్ కంట్రోల్‌రూంకు సమాచారం చేరవేస్తాయి. ఒక వ్యక్తి ఐదారు నిమిషాలకంటే ఎక్కువగా ఉన్నా.. ప్రయాణికులు లగేజీ మర్చిపోయినా అధికారులను అప్రమత్తం చేస్తుంది. నిఘా కెమెరాలకు సమీపంలో బ్యాగులు, సంచులను ఉంచితే స్కాన్ చేస్తుంది. బ్యాగ్‌లు, సంచులు, ఉద్దేశపూర్వకంగా వదిలేసినట్టు గమనిస్తే బాంబ్ స్క్వాడ్‌లకు సమాచారం అందిస్తాయి. కౌంటర్లలో రద్దీ పెరిగితే చర్యలు తీసుకునేలా ఉపకరిస్తాయి.

# నిధులు బుగ్గిపాలు!

సత్తుపల్లి : ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బుగ్గపాడులో భారీ ఆశయాలతో నిర్మించిన మోగా ఫుడ్‌పార్కు నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు తెస్తుందన్న ఉద్దేశంతో రూ.కోట్ల ప్రజాధనం వెచ్చించినా ఆశించిన స్థాయికి చేరుకోలేకపోతోంది. పాలకులు, అధికారులు దృష్టి సారించాల్సిన అవసరముంది.

**పరిశ్రమలు రాలేదు.. నిర్మాణాలు శిథిలం**

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేలా 2008లో నాటి సమైక్య ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి దీనికి శంకుస్థాపన చేశారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం 2017లో నిర్మాణ పనులను కేటీఆర్ ప్రారంభించారు. ఆ తర్వాత ఐదేళ్లకు పనులు పూర్తయ్యాయి. ఎట్టకేలకు శీతల గిడ్డంగులు, వేర్‌హౌస్‌లు, గోదాములు, ప్యాకింగ్ హౌస్, ఓవర్‌హెడ్ ట్యాంకు, సబ్‌స్టేషన్, అగ్నిమాపక కేంద్ర భవనం మొదలైన వాటితోపాటు.. రోడ్లు, అంతర్గత రహదారులు, తాగునీటి సదుపాయం వంటివి కల్పించారు. ఇటీవలి కాలంలో మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు దీనిని ప్రారంభించినా పరిశ్రమలు పెద్దఎత్తున వచ్చిన దాఖలాలు లేవు. ఫుడ్‌పార్కుకు ఆదరణ కరవైంది.

**కొరవడిన పర్యవేక్షణ...**

ఫుడ్‌పార్కు నిర్వహణపై ఇక్కడి టీజీఐఐసీ అధికారుల పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీని స్థితిగతులపై సమీక్షలు, పునరుద్ధరణ చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. దీనిపై ఫిర్యాదులు అందిన నేపథ్యంలో టీజీఐఐసీ ఎండీ శశాంక్ ఆదేశాలతో చీఫ్ ఇంజినీర్ నరేంద్రరెడ్డి బృందం శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేసింది. నివేదికను ఉన్నతాధికారులకు పంపించింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు బుగ్గపాడు మెగా ఫుడ్ పార్కుపై



ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్థానికులు కోరుతున్నారు. నాసిరకం నిర్మాణాలకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రధానంగా అడ్మినిస్టేషన్ భవనం పై అంతస్తు గదుల్లో సీలింగ్‌లు నాసిరకంతో ఊడి పడిపోయాయి. ఫ్యాన్లు, కరెంట్ వైరింగ్ పూర్తిగా దెబ్బతింది. దాదాపు 200ఎకరాల్లో రూ.100కోట్లకు పైగా నిధులతో చేసిన అభివృద్ధి పనులు బుగ్గిపాలు చందంగా మారాయి. రూ.లక్షలతో కొనుగోలు చేసిన భారీ యంత్ర పరికరాలు తుప్పుపట్టి పోతున్నాయి. రోడ్లనూ నాసిరకంగా నిర్మించటంతో దెబ్బతింటున్నాయి.

**గుత్తేదారులకే లాభం...**

గుత్తేదారుల కోసమే మెగా ఫుడ్ పార్కును నిర్మించారా? అనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణాల పేరిట రూ.కోట్లు వెచ్చించినా ఫలితం శూన్యంగా మిగిలిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనుల నాణ్యతపై ఆరోపణలు వచ్చినా అధికారులు పట్టించుకోలేదని విమర్శిస్తున్నారు.

# 'అంటు'కుంది.. ఉపాధి!

కూసుమంచి : కూసుమంచి మండలం లోక్యాతండాకు చెందిన పలువురు యువకులు గతంలో ఉపాధి కోసం వలస వెళ్లేవారు. రాజమహేంద్రవరం,కడియంలో మామిడి మొక్కలను అంటుకట్టే కూలీ పనులు చేసేవారు. స్వగ్రామంలో మామిడి అంటు మొక్కల నర్సరీలు ఏర్పాటుచేస్తే లాభసాటిగా ఉండటంతో పాటు వందలాది మందికి ఉపాధి కల్పించవచ్చునని భావించారు. సుమారు 15ఏళ్ల క్రితం పది మంది యువకులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో మొక్కల పెంపకాన్ని ప్రారంభించారు. వీరిని చూసి ఇంకొందరు ముందుకొచ్చారు. ఇప్పుడు లోక్యాతండాలో సుమారు 60 నర్సరీలు నిర్వహిస్తున్నారు. ఇక్కడి నుంచి నాణ్యమైన అంటు మొక్కలు ఎగుమతి అవుతున్నాయి.

**ఏప్రిల్ నుంచి పనులు**

నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ తదితర జిల్లాల్లో మామిడి టెంకలను ఏప్రిల్‌లో సేకరిస్తారు. ఆయా జిల్లాల్లో ఆంచూర్ కోసం మామిడి వినియోగం ఎక్కువ. అందుకే అక్కడ టెంకలు విరివిగా లభిస్తాయి. లక్ష మొక్కలు పెంచాలనుకునే నర్సరీ నిర్వాహకులు రెండు లక్షల టెంకలు సేకరిస్తారు. నర్సరీలకు చేరిన నాణ్యమైన మట్టిని ప్లాస్టిక్ సంచుల్లో నింపుతారు. ప్రతి పాకెట్‌కు 70 పైసల చొప్పున కూలీలకు చెల్లిస్తారు. లక్ష మొక్కల నర్సరీ ద్వారా కూలీలకు రూ.70వేలు



సమకూరుతాయి. పాకెట్లు నింపుతున్న కూలీలకు ఎరువు కలిపిన మట్టిని చేరవేసేందుకు పురుషులను నియమిస్తారు. ఒక్కొక్కరికి రూ.800 చొప్పున రూ.20వేలు వెచ్చిస్తారు.

అంటుకట్టేందుకు (గ్రాఫ్టింగ్) నిపుణులకు ప్రతి మొక్కకు రూ.2 చొప్పున నిర్వాహకులు చెల్లిస్తారు. ఈరకంగా రూ.2లక్షలు ఖర్చవుతాయి. కలుపు తీసేందుకు పది మంది చొప్పున కనీసం పది రోజుల పాటు కూలీలు అవసరం. వీరికి రూ.50వేలు చెల్లిస్తారు.

టెంకల శుద్ధి, మట్టి నింపిన సంచుల్లో టెంకలు నాటేందుకు 50 పైసల చొప్పున ఖర్చవుతుంది. తద్వారా రూ.50వేలు కూలీలకు చేరుతాయి. నాణ్యమైన మొక్కలు ఎంపిక (గ్రేడింగ్) చేసి అంటుకడతారు. డిసెంబర్ చివరి నాటికి అంటు మొక్కలను లారీల్లో ఎగుమతి చేస్తారు. 60 పైసల చొప్పున లక్ష మొక్కల ఎగుమతికి రూ.60వేలు చెల్లిస్తారు. టెంకల సేకరణ నుంచి మొక్కల ఎగుమతి వరకు లక్ష మొక్కల నర్సరీకి సుమారు రూ.16-18లక్షలు పెట్టుబడి పెడతారు.

ఖర్చులు పోనూ తొమ్మిది నెలలకు సుమారు రూ.6లక్షలకు పైగా ఆదాయం సముపార్జిస్తారు. ఈసారి అధిక వర్షాలతో ఆదాయం రూ.5లక్షల వరకు పరిమితమవుతోందని సమాచారం. ప్రతి సీజన్‌లో సుమారు 2వేల మందికి లోక్యాతండాలో ఉపాధి లభిస్తుండటం గమనార్హం. సుమారు లక్ష మొక్కలు పెంచే నిర్వాహకులు రూ.5.50 లక్షల వరకు కూలీలకు చెల్లిస్తున్నారు. లోక్యాతండా, సమీప గ్రామాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది కూలీలు వస్తుంటారు.
వడ్తియా ధర్మా, నర్సరీ నిర్వాహకుడు

## మద్దతు దక్కదు.. మార్పు తప్పదు!

త్రిపురాంతకం : సాధారణ మొక్కజొన్నకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభించడం లేదు. వ్యయ ప్రయాసలకోర్చి పండించాక ప్రకృతి వైపరీత్యాలతో పాటు కొనుగోళ్లు పూర్తిగా వ్యాపారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడటంతో సాగుపై కర్షకుల్లో నిరుత్సాహం ఏర్పడుతోంది. దీంతో లాభాల మాట దేవుడెరుగు పెట్టుబడులకు ఇబ్బందులు ఉండవని రైతులు విత్తన మొక్కజొన్న సాగుకు మొగ్గు చూపుతున్నారు.

**ఐదేళ్లుగా ఆయకట్టు, బోరుబావుల కింద..**

జిల్లాలో ఐదేళ్లుగా సాగర్ ఆయకట్టుతో పాటు బోరు బావుల కింద సాధారణ మొక్కజొన్న సాగు చేపడుతున్నారు. జిల్లాలో ఖరీఫ్‌లో 22,000, రబీలో 11,435 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. క్వింటా రూ.2,400 మద్దతు ధర ఉండగా రూ.1,800లకు మించి రేటు లభించడం లేదు. ఈ నేపథ్యంలో పెట్టుబడులకే సరిపోతుండటంతో గత ఐదేళ్ల నుంచి అన్నదాత విత్తన మొక్కజొన్నపై దృష్టి సారించారు. విత్తనాల సరఫరా రసాయన ఎరువుల పంపిణీ ఆయా కంపెనీలే బాధ్యత తీసుకోవడంతో పాటు విత్తన దశలోనే ఒప్పందం కుదుర్చుకుం



టున్నాయి. విత్తన రకాన్ని బట్టి ఎకరానికి కనీసం 4 టన్నుల చొప్పున దిగుబడులు లభిస్తాయి. టన్నుకు రూ.20,00 నుంచి రూ.35,000 వరకు చెల్లిస్తారు. ఈక్రమంలో త్రిపురాంతకంలో 4 వేల ఎకరాల్లోను, జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో విత్తన మొక్కజొన్న సాగు చేపట్టారు.

**నేరుగా కంపెనీలతో ఒప్పందాలు**

వాస్తవానికి అధికారులు, ప్రభుత్వంతో ఎటువంటి సంబంధం లేకుండా రైతులతో విత్తన కంపెనీలు నేరుగా పంట ఒప్పందాలు చేసుకుంటున్నాయి. అంతా సవ్యంగా సాగితే ఎకరానికి రూ.90 వేల నుంచి రూ.లక్ష వరకు రైతులకు చెల్లిస్తున్నారు. అయితే కంపెనీలకు, రైతులకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న దళారులు కంపెనీ నుంచి వచ్చే సొమ్ములను నొక్కేసి కర్షకులను వేధిస్తున్నారు. గతేడాది పంట కోశాక ఎగుమతుల సమయంలో డబ్బులు చెల్లింకపోవడంతో పలు గ్రామాల్లో గొడవలు జరిగిన ఉదంతాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో రైతులు దళారుల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అధికారులు వివరిస్తున్నారు.

## స్వాముల భూములు స్వాహా!

కనిగిరి : కనిగిరి ప్రాంతంలో దేవుడి భూములకే రక్షణ లేకుండాపోయింది. ఆలయాల స్థలాలు అన్యాక్రాంతమయ్యాయి. కొంతమంది అక్రమార్కులు బరితెగించి ఆక్రమించేస్తున్నారు. కొంతమంది నేతల అండదండలతో రూ.కోట్ల విలువైన భూములను కబ్జా చేయడమే కాకుండా వాటిని విక్రయిస్తూ తమ జేబులు నింపుకొంటున్నారు. ఆలయ భూములను పరిరక్షించాల్సిన దేవాదాయశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు.

ఇవి అక్రమార్కుల చెరలో ఉన్న పామూరు పట్టణ సమీపంలోని నెల్లూరు రోడ్డులో మదన వేణుగోపాలస్వామి దేవస్థానం భూములు. ఆలయానికి రూ.25 కోట్ల విలువైన సుమారు 17 ఎకరాల భూములున్నాయి. వీటిని నేతల అండతో అక్రమార్కులు ఆక్రమించేశారు. ఇటీవల అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినప్పటికీ వాటిని సైతం తొలగించేశారు. తాజాగా వారం రోజుల కిందట ఆలయ భూముల్లో బోర్లు తవ్వుతుండగా ఆలయ అధికారులు అడ్డుకున్నారు. ఆక్రమిత భూముల్లో వెంచర్లు వేసి ప్లాట్లుగా మార్చి విక్రయిస్తూ జేబులు నింపుకొంటున్నారు. ఇది కనిగిరిలోని విజయమార్తాండేశ్వరస్వామి దేవస్థానం. దక్షణ కాశిగా పేరొందిన ఈ ఆలయానికి సుమారు రూ.100 కోట్ల విలువైన 188 ఎకరాలకుపైగా భూములున్నాయి. ప్రస్తుతం కేవలం 8 ఎకరాలు మాత్రమే దేవాదాయశాఖ ఆధీనంలో



ఉండడం గమనార్హం. ఆలయానికి ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో భూములున్నట్లు సర్వే నంబర్లతో సహా అధికారులు గుర్తించినప్పటికీ ఇంతవరకు స్వాధీనం చేసుకోలేదు. రూ.కోట్ల విలువైన భూములను అక్రమార్కులు నేతల అండతో నకిలీ పత్రాలతో కబ్జా చేసి స్థిరాస్తి వ్యాపారాలు సాగిస్తున్నారు.

చిత్రంలో కనిపిస్తున్న ఆక్రమణకు గురైన సీఎస్‌పురం మండలం అయ్యలూరివారిపల్లెలోని తిరుమలనాథుని దేవస్థానం భూములు. ఈ ఆలయానికి రూ.30 కోట్లకుపైగా విలువైన 101.9 ఎకరాల భూములున్నాయి. పలుమార్లు దేవాదాయ, రెవెన్యూశాఖల అధికారులు ఆక్రమిత భూములను పరిశీలించినా ఇంతవరకు ఒక్క సెంటు కూడా స్వాధీనం చేసుకోలేదు. కనీసం ఆక్రమణదారులను ప్రశ్నించిన దాఖలాలు గానీ, నోటీసులిచ్చిన సందర్భాలు గానీ లేవు. కొంతమంది నేతల అండదండలతో అక్రమార్కుల చేతుల్లోనే నేటికీ ఆలయ భూములున్నాయి. వీటిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

## నల్లమలపై స్పందిస్తే స్వర్గధామమే

పెద్దదోర్నాల: ప్రకృతి రమణీయతకు నిలయం నల్లమల. ఎత్తయిన కొండలు, లోతైన లోయలు, పచ్చని గడ్డి మైదానాలు, గలగల పారే సెలయేర్లు, అరుదైన వన్య ప్రాణులు, ఔషధ మొక్కలతో పర్యావరణ సమతుల్యతకు నిలయమైన ఈ ప్రాంతం పర్యాటకులను ఆకర్షిస్తోంది. మార్కాపురం కేంద్రంగా నూతన జిల్లా ఏర్పడడంతో పర్యాటక కేంద్రాల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారిస్తుందని జిల్లావాసులు ఆశాభావంతో ఉన్నారు. పెద్దదోర్నాలలోని శ్రీశైలం రహదారిలో అటవీశాఖ చెక్‌పోస్టు సమీపంలో రూ.కోటితో ఏర్పాటు చేసిన అడ్వెంచర్ పార్కును ప్రారంభిచకపోవడంతో పరికరాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. ఆత్మకూరు రహదారిలోని రోళ్లపెంట సమీపంలో పర్యావరణ విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు ఏడేళ్ల కిందట భవనాన్ని సిద్ధం చేసినా ప్రారంభించలేదు. శ్రీశైలం వెళ్లే రహదారిలో వీర్లకొండపైకి పర్యాటకులు కాలినడకన చేరేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినప్పటికీ వినియోగంలోకి తీసుకురాలేదు. ఇప్పటికైనా పాలకులు, స్పందించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలి.

## కళ్లెదుటే అక్రమం... కదలని అధికారగణం!



సింగరాయకొండ : పేదలకు న్యాయం చేసేందుకు మంజూరు చేసిన ఇళ్ల పట్టాలు వైకాపా నాయకుడికి భోజ్యంగా మారాయి. రెవెన్యూ అధికారులు సైతం ఆయనకు యథాశక్తి సహకరించారు. ప్రతిఫలంగా కొందరు ఉద్యోగులూ పట్టాలు పొందారు. కళ్లెదుటే అక్రమం కనపడుతున్నా నేటికీ చర్యలు లేవు. ఇప్పుడు ఆ స్థలాల విలువ పెరగడంతో ప్లాట్లుగా విక్రయిస్తున్నాడు. సింగరాయకొండలో జరుగుతున్న చోద్యమిది.

**రెవెన్యూ సహకారం...**

సింగరాయకొండ పారిశ్రామికవాడలో కొందరు నిరుపేదలు తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. అధికారులు ఖాళీ చేయాలని ఆదేశించడంతో... ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నందున నివేశన స్థలాలు మంజూరు చేసి ఆదుకోవాలని రెవెన్యూ అధికారులకు విన్నవించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 71 మందిని అర్హులుగా గుర్తించి... ఆరేళ్ల క్రితం కనుమళ్ల ప్రధాన రహదారి వెంబడి సర్వే నంబరు 322లో పట్టాలు సిద్ధం చేశారు. ఈ స్థలాలపై కన్నేసిన వైకాపా నాయకుడు... అప్పటి రెవెన్యూ అధికారుల సాయంతో చక్రం తిప్పాడు. అర్హులను జాబితా నుంచి తొలగించి స్థానికేతరుల పేర్లతో వాటిని స్వాధీనం చేసుకున్నాడు. ఇదేంటని ప్రశ్నించిన వారిపై బెదిరింపులకు దిగాడు. కులం పేరుతోనూ దూషించడంతో అతడిపై అప్పట్లోనే అట్రాసిటీ కేసు నమోదైంది. ఇంత జరిగినా సదరు నాయకుడిపై పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

**విలువ రూ.5 కోట్లుపైనే...**

ప్రస్తుతం అక్కడి భూముల విలువ భారీ పెరిగింది. అడ్డగోలుగా పొందిన భూముల విలువ రూ.5 కోట్లు పైనే ఉంది. దీంతో సదరు నాయకుడు తన అనుచరులతో కలిసి ప్లాట్లుగా విక్రయిస్తున్నాడు. జిల్లా ఉన్నతాధికారులైనా విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దారు రాజేష్ను వివరణ కోరగా.. ఉన్నతాధికారులకు నివేదిక అందజేసి, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**ఉద్యోగుల పేరిటా పట్టాలు...**

అర్హులను కాదని ఇచ్చిన పట్టాల్లో దాదాపు 60 మంది స్థానికేతరులు, ప్రభుత్వ ఉద్యోగులు ఉండడం గమనార్హం. రైతు సేవా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగిని, ఇద్దరు వీఆర్‌ఏలు, ముగ్గురు వీఆర్వోల కుటుంబ సభ్యుల పేర్లతో పట్టాలు నమోదయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారి పేర్లు జాబితాలో ఉన్నాయి.

## రైతు ముంగిటకే అద్దె డ్రోన్లు



త్రిపురాంతకం : అన్నదాతలు ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకునేలా కూటమి ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంది. అందులో భాగంగా ఇప్పటికే డ్రోన్లను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం అవి రైతు ఇంటి ముంగిటకే వచ్చేలా కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ఉబర్, ఓలా వంటి యాప్ల ద్వారా రవాణాకు వాహనాలను బుక్ చేసుకున్నట్లే... ఇకపై డ్రోన్లను కూడా యాప్లో అద్దెకు తీసుకోవచ్చు.అనుకున్న సమయానికి వచ్చేలా...: ఏటా కూలీల కొరత పెరుగుతున్న నేపథ్యంలో పొలాల్లో ఎరువులు, పురుగు మందుల పిచికారీకి డ్రోన్లను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఉమ్మడి జిల్లా పరిధిలో ఎనభై శాతం రాయితీపై మొత్తం 45 డ్రోన్లు అందించింది. వీటితో సమయం, డబ్బులు ఆదా ఆదా అవుతుండటంతో రైతులూ సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా... పంట సీజన్లో అవసరానికి సరిపడా పరికరాలు అందుబాటులో లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ విషయం గుర్తించిన ప్రభుత్వం 'ఉబలైజేషన్ ఆఫ్ కిసాన్ డ్రోన' పేరిట ప్రత్యేక యాప్ను అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా బుక్ చేసుకుంటే అనుకున్న సమయానికి రైతు పొలం వద్దకే డ్రోన్ వచ్చేలా కార్యాచరణ రూపొందించింది. గ్రామాల్లో అవగాహన... ప్లే స్టోర్ నుంచి ఈ యాప్ను డౌన్లోడ్ చేసుకుని... వివరాలు నమోదు చేయడం ద్వారా రైతులు ఈ సేవలు పొందవచ్చు. ఈ విషయమై వ్యవసాయాధికారులు గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తూ అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్నారు. వారి వివరాలు సైతం నమోదు చేస్తున్నారు.

## కాసులిస్తే చాలు.. అడ్డగోలైనా ఆపేరు!



పాలకొల్లు : ఆకివీడు నగర పంచాయతీ పరిధిలో శివాలయం వీధి, ముస్లిం వీధి, ఐ డాక్టర్ వీధి, చినపల్లె ప్రాంతాల్లో ఇటీవల తగిన అనుమతుల్లేకుండానే బహుళ అంతస్తుల భవనాలు వెలిశాయి. మరికొన్ని నిర్మాణంలో ఉన్నాయి. వీటి చుట్టూ ఉన్న వీధుల్లో కనీసం అగ్నిమాపక, అత్యవసర వాహనాలు తిరిగే అవకాశం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ ప్రణాళిక అధికారి లేకపోవడంతో భవన నిర్మాణ అనుమతుల విషయంలో కొందరు సిబ్బంది అంతా తామై వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

నియోజకవర్గ కేంద్రమైన ఆచంటతో పాటు వాసవీ పెనుగొండ మండల కేంద్రంలోనూ భవన నిర్మాణ నిబంధనలను పూర్తిగా గాలికొదిలేశారు. ఈ గ్రామాల్లో మూడు, నాలుగు అంతస్తుల భవనాలు, దుకాణ సముదాయాలు పదుల సంఖ్యలో నిర్మించారు. ఆచంటలో ఆచంటేశ్వరుని ఆలయ గోపురం కంటే ఎత్తులో భవంతులు వెలిశాయి. పల్లెల్లో రెండు, పట్టణాల్లో నాలుగు అంతస్తుల వరకే భవన నిర్మాణాలకు అనుమతిస్తారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే అధికారులు నోటీసులిచ్చి నిర్మాణాలు తొలగించాల్సి ఉంటుంది. కానీ ఏ ఒక్క చోటా అలా జరగడం లేదు. కొందరు అధికారులు, సిబ్బందికి ముడుపుల మత్తులో అడ్డగోలు నిర్మాణాలకు ఆమోదముద్ర వేస్తున్నారు.

**ఇరుకు సందుల్లోనూ..**

ఎక్కడైన బహుళ అంతస్తులు నిర్మించాలంటే కనీసం 30 అడుగుల వెడల్పు రహదారి ఉండాలి. భవనాలకు 6 అడుగుల సెట్బ్యాక్ వదలాల్సి ఉండగా ఈ నిబంధన అమలు కావడం లేదు. పాలకొల్లులో ప్రధాన రహదారి నుంచి కారుమూరివారివీధికి వెళ్లే ప్రాంతంతో పాటు షావుకారుపేట, యడ్లబజార్ ప్రాంతాల్లో 10 అడుగుల వెడల్పు కూడా లేని వీధుల్లో నాలుగంతస్తుల భవనాలు వెలిశాయి. దుకాణ సముదాయాలు రోడ్డుపైకి ఉండటంతో వాహనాల పార్కింగ్కు అవకాశం ఉండటం లేదు. ఈ పట్టణంలోని బ్యాంకువీధిలో పరిశీలిస్తే ఇటీవల నిర్మించిన భవనాలకు సెట్బ్యాక్ వదిలిన దాఖలాలు లేవు.

**క్రమబద్ధీకరణ మాటున**

కొత్తగా నిర్మించిన అక్రమ కట్టడాలకు సైతం ఎల్ఆర్ఎస్లో అనుమతులకు కొందరు దరఖాస్తులు చేసుకుంటున్నారంటే అక్రమాల స్థాయిని స్పష్టం చేస్తోంది. ముందుగా అనుమతి రాదు కాబట్టి కట్టేశాక.. క్రమబద్ధీకరణకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. కళ్లెదుటే భారీ భవంతులు నిర్మిస్తున్నా స్పందించని అధికారులు ఫిర్యాదులొచ్చాక ఎల్ఆర్ఎస్కు దరఖాస్తు చేయాలని నిర్మాణ దారులకు సలహా ఇస్తున్నారని ఆరోపణలున్నాయి. పాలకొల్లు సమీపాన గ్రామీణ ప్రాంతాల్లో ఆరంతస్తుల భవంతులు నిర్మిస్తున్నారు. ఈ అంశంపై పురపాలక ఆర్డీ సీహెచ్ నాగ నరసింహారావు స్పందిస్తూ నిర్మాణాల విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

## సుగ్గిబాటలో.. తండాలు

గుంతకల్లు : వ్యవసాయం చేయడానికి భూములు లేక కొందరు, ఉన్న ఎకరం, రెండు ఎకరాలు సాగు చేసినా పెద్దగా ప్రయోజనం లేకుండా పోతుండడంతో కొందరు సుగాలీలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారు. గుంతకల్లు మండలంలోని పులగుట్టపల్లి పెద్దతండా, చిన్నతండాతో పాటు మరికొన్ని తండాలకు చెందిన వారు వైఎస్సార్? కడపజిల్లా, బెంగళూరు తదితర ప్రాంతాలకు వెళ్లి భవన నిర్మాణ కూలీలుగా పని చేస్తున్నారు.పిల్లల్ని కొందరు వెంట తీసుకెళ్తుండగా, మరికొందరు చదువు కోసం వసతిగృహాల్లో వదులుతున్నారు. కూలీలుగా పనిచేస్తున్నందుకు పురుషులకు రోజుకు రూ. 500, మహిళలకు రూ.400 గిట్టుబాటు అవుతోందని వాపోతున్నారు. వీరంతా మూడు, నాలుగు నెలలకోసారి తండాలకు వచ్చి వెళుతున్నారు. కుటుంబాలతో పాటు వెళ్లేవారు ఇళ్లకు తాళం వేస్తున్నారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తే... స్థానికంగా పిల్లాపాపలతో ఉంటామని చెబుతున్నారు. తండాలు : పులగుట్టపల్లి పెద్దతండా, చిన్నతండా ఇళ్లు : 400జనాభా : 2 వేలు వలస వెళ్లిన కుటుంబాలు : 150

## వృథా వస్తువులిస్తారా.. సరకులిస్తారు!

అనకాపల్లి : శుభ్రమైన పల్లెసీమలే లక్ష్యంగా ప్రభుత్వం స్వఛ్ఛరథాలకు స్వీకారం చుట్టింది. ఇంటిలో నెలల తరబడి ఎందుకూ పనికిరాకుండా పడి ఉండే వస్తువులను తీసుకుని వాటికి బదులు నిత్యావసరాలను నేరుగా ఇంటివద్దే అందజేస్తారు. స్వఛ్ఛరథం రోజుకు రెండు గ్రామాలకు వెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన మూడు మండలాలకు ఈ స్వఛ్ఛరథాలను కేటాయించారు. అనకాపల్లి మండలానికి కేటాయించిన స్వఛ్ఛరథాన్ని ఇటీవలే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ వాహనంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, లోహపు వస్తువులు తీసుకొని మార్కెట్ ధరకు అనుగుణంగా నగదు అందజేస్తారు. నగదు వద్దంటే నిత్యావసర వసువులను అందిస్తారు. ఈ విధానం వల్ల గ్రామాల్లో ఇబ్బడి ముబ్బడిగా పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. గతంలో ఇంటింటికీ బియ్యం పంపిణీ చేసిన ఎండీయూ వాహనాలను అద్దెకు తీసుకొని అవసరమైన మార్పులు చేసి స్వఛ్ఛ



రథంగా మార్పు చేశారు. స్వఛ్ఛరథం నిర్వహణకు ప్రభుత్వం నెలకు రూ. 25 వేల చొప్పున అందిస్తుంది. నిర్వాహకులు కేజీ పాత ఇనుము రూ. 20, పేపర్లు రూ.15, పుస్తకాలు రూ. 10, అట్టపెట్టెలు రూ.10, ప్లాస్టిక్ సీసాలు రూ. 20, స్టీలు వస్తువులు రూ. 20, అల్యూమినియం రూ. 120, గాజుసీసా రూ. 2 చొప్పున కొనుగోలు చేస్తారు. వస్తుమార్పిడి విధానం కావాలని కోరుకునే వారికి కొబ్బరినూనె, దుస్తుల సబ్బులు, ఉల్లిపాయలు, కందిపప్పు, గోధుమపిండి ఇలా పలురకాల నిత్యావసర సరకులు ఇస్తారు.

ప్రభుత్వం మంజూరు చేసిన స్వఛ్ఛరథం జనవరి 1 నుంచి సేవలు ప్రారంభించింది. షెడ్యూల్ ప్రకారం నిర్దేశించిన రోజుల్లో ఆయా గ్రామాల్లో పర్యటిస్తుంది. గ్రామాలను శుభ్రంగా ఉంచే ప్రక్రియలో ఇదో ముందడుగుగా నిలుస్తుందని ఎంపీడీఓ ఆశాజ్యోతి తెలిపారు.

## వసూళ్లాలయం..!

రాజమహేంద్రవరం : రాజమహేంద్రవరం క్వారీ ప్రాంతం లో ఉన్న సచివాలయంలో ఓ వ్యక్తి కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నారు. క్షేత్ర స్థాయిలో ఇంటికొచ్చి పరిశీలించి న వీఆర్వో రూ.వెయ్యి డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం బాలాజీపే టలో ఉంటున్న ఓ మహిళ భర్త చనిపోవడంతో ఫ్యామిలీ ధ్రువ పత్రం కోసం దరఖాస్తు చేశారు. గతంలో వారు దేవీచౌక్ ప్రాంతంలో ఉండేవారు. దీంతో సచివాలయంలో దరఖాస్తు తీసుకోలేదు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో వీఆర్వో వారింటికొచ్చి, రూ.12000 డిమాండ్ చేశారు. ఇదే విషయా న్ని ఉన్నతాధికా రులకు ఫిర్యాదు చేస్తే దరఖాస్తు కాగితాలు వెనక్కి ఇచ్చేశారు. పారదర్శకంగా, వేగంగా ప్రజలకు మెరుగైన సేవలందిం చడానికి తెరపైకి తెచ్చిన సచివాలయాల వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. ప్రస్తుతం ఏ సంక్షేమ పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నా సచివాలయా లకు వెళ్లాల్సిందే. రేషన్‌కార్డు నుంచి కులధ్రువీకరణ పత్రాలు వరకు ఇక్కడే మంజూరు చేస్తారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడం ద్వారా అవినీతికి అడ్డుకట్ట వేయవచ్చని సర్కారు భావిస్తున్నా..క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి.

**కొరవడిన పర్యవేక్షణ**

సచివాలయంలో ఏదైనా పని కోసం ముందుగా దరఖాస్తు చేయాల్సి ఉంది. అక్కడ నుంచి మున్సిపల్ కార్యాలయం, అర్బన్ తహసీల్దార్ కార్యాలయాలకు దరఖాస్తులు చేరతాయి. ఆ తర్వాత సంబంధిత శాఖల అధికారులు సచివాలయం సిబ్బంది సహకారంతో క్షేత్ర స్థాయి పరిశీలన చేసి ధ్రువీకరించాల్సి ఉంటుంది. సచివాలయాల్లోనే బేరసారాలు చేస్తున్నారు. ఆయా శాఖల అధికారులకు కూడా ఇది సులువైన మార్గం గా మారింది. దీంతో వారంతా సచివాలయం సిబ్బందిని ప్రోత్సహిస్తు న్నారు. సచివాలయాలు డివిజన్ పరిధిలో ఉండటంతో పర్యవేక్షణ కొరవడింది.

**అందుబాటులో లేక**కొన్ని చోట్ల పూర్తి స్థాయిలో సచివాలయం సిబ్బంది



అందుబాటులో ఉండడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ వీరు అందుబాటులో ఉండాలి. ప్రధానంగా సాయంత్రం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ప్రజా సమస్యలపై అర్జీల స్వీకరణకు గ్రీవెన్స్ నిర్వహించాల్సి ఉంది. కానీ ఇవేమీ ఆచరణకు నోచుకోవడం లేదు. మరో వైపు నగరపాలక సంస్థ యంత్రాంగం చేయాల్సిన పనులను కూడా సచివాలయాల సిబ్బందికి అప్పగించడంతో వారిలో అసహనం పెరుగుతోంది. ఒక్కొక్క సచివాలయంలో పది మంది వరకూ ఉద్యోగులు ఉన్నా.. ప్రయోజనం లేకుండా ఉంది.

## కంకర పరిచి.. వెన్నువిరిచి

కోడుమూరు : కోడుమూరు– వెల్దుర్తి రహదారి విస్తరణ రాళ్లను దాటడం లేదు.. గుత్తేదారు ఇరువైపులా కంకర పరిచి మిగిలిన పనులు వదిలేశారు.. రాళ్లల్లో బస్సులు నడపలేమంటూ ఆర్టీసీ సర్వీసులు నిలిపివేసింది.. పది గ్రామాల ప్రజలకు ద్విచక్రవాహనాలు, ఆటోలే దిక్కయ్యాయి.. దుమ్ము, రాళ్లలో ప్రయాణం ప్రాణసంకటంగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

28 కి.మీ.. రూ.20 కోట్లు

కోడుమూరు– వెల్దుర్తి రహదారి పత్తికొండ, కోడుమూరు నియోజకవర్గాలను అనుసంధానం చేస్తుంది. దారంతా గుంతలమయంగా మారింది.. దారిలో ప్రయాణం నరకయాతనలా మారింది.. బాగు చేయాలంటూ ఆయా గ్రామాల ప్రజలు గత వైకాపా సర్కారుకు విన్నవించినా పట్టించుకోలేదు.. 'కూటమి' ప్రభుత్వం వచ్చిన వెంటనే 28 కి.మీ. మేర రహదారిని బాగు చేసేందుకు రూ.20 కోట్లు మంజూరు చేసింది. రోడ్డును 7 మీటర్లు వెడల్పు చేసి రెండు వరుసలుగా తీర్చిదిద్దాలి..12 కల్వర్టులు, వెంకటగిరి, గోరంట్ల గ్రామాల్లో సీసీ దారి వేయాలి.

తప్పని అవస్థలు..

కోడుమూరు నుంచి వయా వెంకటగిరి, గోరంట్ల, లద్దగిరి వరకు రెండు వైపులా కంకర పోశారు. 14.5 కి.మీ. మేర ఇదే పరిస్థితి ఉంది. రాళ్లల్లో వెళ్లలేక వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు.

రోడ్డుకు ఇరువైపులా ఉన్న 10 గ్రామాల ప్రజలకు వివిధ అవసరాల నిత్యం వెల్దుర్తి, కోడుమూరు వెళ్తుంటారు. పనులు ముగించుకొని రాత్రి వేళ బిక్కుబిక్కుమంటూ వెళ్తున్నారు.శిథిలావస్థకు చేరిన 12 కల్వర్టులను కొత్తగా నిర్మించాల్సి ఉంది. ఇందుకు సంబంధించి పెద్ద గుంతలు తవ్వి వదిలేశారు. కనీసం సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. కంకర పరిచి దానిపై ఎర్రమన్ను పోశారు. చదును చేయకపోవడంతో విపరీతమైన దుమ్ములేస్తోంది. ఓ వైపు కంకర రాళ్లు.. మరోవైపు దుమ్మును దాటి వెళ్లలేక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. " త్వరలో తారు పనులు చేపడతామని' డీఈ రమణ తెలిపారు.

# అత్యవసర వేళ ఆపసోపాలు..!

విశాఖపట్నం : గమ్యనగరిగా పేరుగాంచిన విశాఖకు ఇటీవల పర్యాటకుల తాకిడి పెరిగింది. ఆర్కేబీచ్, కైలాసగిరి, వుడా పార్కు, రుషికొండ వంటి ప్రాంతాలు ప్రస్తుతం సందర్శకులతో కిటకిటలాడుతున్నాయి. అయితే అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించడంలో వీఎంఆర్డీఏ యంత్రాంగం విఫలమవుతోందనే విమర్శలు వస్తున్నాయి. ఆదివారం నగరంలోని పలు ప్రాంతాలను 'ఈనాడు' పరిశీలించగా పర్యాటకులు పడుతున్న ఇబ్బందులు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా మరుగుదొడ్లు అందుబాటులో లేక, ఎక్కడికి వెళ్లాలో తెలియక మహిళలు అవస్థలు పడటం కనిపించింది.

**రుషికొండలో కేవలం రెండు మరుగుదొడ్లు:** బ్లూఫ్లాగ్ గుర్తింపు పొందిన రుషికొండ బీచ్‌ను నిత్యం 10వేల మందికిపైగా సందర్శిస్తుంటారు. ఇలాంటి ప్రాంతంలో కేవలం రెండు మరుగుదొడ్లు మాత్రమే ఉండటం గమనార్హం. దీంతో పర్యాటకులు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. జీవీఎంసీ నిధులు రూ.55 లక్షలతో 22 మరుగుదొడ్ల నిర్మాణానికి జులైలో శంకుస్థాపన చేశారు. ఆయా పనులు నత్తనడకన సాగుతున్నాయి. సాగర్‌నగర్ బీచ్‌లో గతంలో ఉన్న కంటైనర్ మరుగుదొడ్లను తొలగించేశారు. బీచ్ రోడ్డులో వుడా పార్కు నుంచి కోస్టల్‌బ్యాటరీ వరకు నాలుగు చోట్ల జీవీఎంసీ ఆధ్వర్యంలో నడిచే ప్రజామరుగుదొడ్లు ఉన్నాయి. కోస్టల్‌బ్యాటరీ నుంచి ఆర్కే బీచ్ వరకు ప్రస్తుతం ఒకటి ఉండగా మరో రెండు ఏర్పాటు చేయాల్సి ఉంది. వుడా పార్కు నుంచి కోస్టల్‌బ్యాటరీ మధ్య ప్రస్తుతం నాలుగు ఉండగా, వాటిని రెట్టింపు చేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



**ఇతర ప్రాంతాల్లో ఇలా..:** వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో కురుసురా జలంతర్గామి, టీయూ-142, సీహారియర్ యుద్ధ విమానం, యూహెచ్-3హెచ్ హెలికాప్టర్ మ్యూజియం ఉన్నాయి. వీటి నుంచి ఏటా రూ.5 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకంగా మరుగుదొడ్లు లేకపోవడం గమనార్హం.

ఆర్కేబీచ్ కాళీమాత ఆలయం సమీపంలోని మరుగుదొడ్లు నిత్యం రద్దీగా ఉంటున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని అదనంగా రెండు యూనిట్లు ఏర్పాటు చేయాలి.

దీనిపై వీఎంఆర్డీఏ కార్యదర్శి మురళీకృష్ణను సంప్రదించగా పర్యాటక ప్రాంతాలను పరిశీలించి అవసరమైన చోట అదనపు మరుగుదొడ్లు ఏర్పాటు చేయిస్తామని చెప్పారు.

ప్రజా మరుగుదొడ్లు ఉన్న ప్రాంతాలు..కోస్టల్‌బ్యాటరీ: 2 తెన్నేటి పార్క్: 1 ఆర్కే బీచ్: 2 పాండురంగా పురం: 1 వైఎంసీఏ: 1 రుషికొండ కూడలి: 1 జోడుగుళ్ల పాలెం: 1

# అడ్డురోడ్డుకు మహర్దశ!

అనకాపల్లి : నక్కపల్లి కేంద్రంగా ఏర్పాటు చేయాల్సిన కొత్త రెవెన్యూ డివిజన్‌ను ప్రభుత్వం మార్చింది. ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు కూడలిలో దీనిని ఏర్పాటు చేయడానికి నిర్ణయించింది. మంత్రులు, అధికారులతో సీఎం చంద్రబాబునాయుడు అమరావతిలో ఇటీవల నిర్వహించిన మంత్రివర్గ ఉపసంఘం సమీక్షలో రెవెన్యూ డివిజన్ మార్పుపై నిర్ణయం తీసుకున్నారు. దీంతో నక్కపల్లికి బదులు అడ్డురోడ్డు కేంద్రంగా డివిజన్ ఏర్పాటు కానుంది.

పారిశ్రామికాభివృద్ధి పరంగా శరవేగంగా అడుగులు వేస్తున్న నక్కపల్లిలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు మంత్రి అనిత చొరవ చూపారు. ఇందుకు మంత్రివర్గ ఉపసంఘంలోనూ ఆమోదం లభించింది. ప్రాథమిక నోటిఫికేషన్ తర్వాత.. రాష్ట్రవ్యాప్తంగా నూతన జిల్లాలు, డివిజన్ల ఏర్పాటుపై అభ్యంతరాలను స్వీకరించింది. ఈ క్రమంలో నక్కపల్లి డివిజన్‌ను తప్పించి.. ఎలమంచిలి కేంద్రంగా నూతన రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయాలంటూ ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలు నిరసనలు తెలిపారు. స్థానిక కూటమి నేతలు సైతం ఎలమంచిలి కేంద్రంగా డివిజన్ ఏర్పాటు చేయాలంటూ ప్రతిపాదించడంతో దీంతో ఇక్కడి ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని నక్కపల్లికి బదులుగా దీనికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న అడ్డురోడ్డు జంక్షన్‌ను డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు సీఎం సుముఖత వ్యక్తం చేశారు. తద్వారా ఆయా ప్రాంతాల వారికి మరింత అందుబాటులో ఉంటుందని ఆలోచన.

**మునగపాక అనకాపల్లిలోనే:** జిల్లా కేంద్రానికి అతి దగ్గరగా ఉన్న మునగపాక మండలాన్ని అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లోనే ఉంచాలని



స్థానిక నేతలు, ప్రజలు విన్నవించారు. ఇటీవల జిల్లా డీఆర్సీ సమావేశంలోనూ అనకాపల్లిలోనే మునగపాక మండలాన్ని కొనసాగించాలని తీర్మానించారు. మరోవైపు చీడికాడ మండలాన్ని నర్సీపట్నం నుంచి అనకాపల్లి డివిజన్‌లో కలిపేలా మారుస్తున్నారు. దీంతో అనకాపల్లిలో 10, నర్సీపట్నం, అడ్డురోడ్డు రెవెన్యూ డివిజన్లలో ఏడేసి మండలాల చొప్పున కొనసాగనున్నాయి. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల, ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలతో అడ్డురోడ్డు కేంద్రంగా కొత్త డివిజన్ ఏర్పాటు కానుంది. ఈ నెలాఖరున ప్రభుత్వ తుది నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉంది.

**అభివృద్ధిలో వేగంగా ..** తుని, పాయకరావుపేట తర్వాత అడ్డురోడ్డు వాణిజ్యపరంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. పేరుకే తిమ్మాపురం పంచాయతీలో ఉన్నా.. అందరికీ అడ్డురోడ్డు పేరే సుపరిచితం. ఇక్కడ అనేక విద్యా సంస్థలు, ఆసుపత్రులు, వస్త్ర, ఇతర వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్లు, స్థిరాస్తి వ్యాపారం.. ఇలా అన్నివిధాలా అభివృద్ధి చెందుతోంది. దీనికి తోడు పర్యాటక ప్రాంతమైన రేవుపోలవరం తీరం కూడా ఇదే మండలంలో ఉంది. మరోవైపు ఆది నుంచి నక్కపల్లి పేరును తెరపైకి తెచ్చి చివరిలో అడ్డురోడ్డు డివిజన్ ఏర్పాటు చేయడంపై స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

# మట్టి దందా.. ఆపేదుందా?



పుట్టపర్తి: హిందూపురం నియోజకవర్గంలో కొందరు నాయకులు అధికారం అండతో రెచ్చిపోతున్నారు. నీరులేని చెరువుల్లో మట్టి తవ్వి వెంచర్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రాజకీయ పలుకుబడి కారణంగా అడ్డుకోవడానికి అధికారులు వెనుకంజ వేస్తున్నట్లు కనిపిస్తోంది. హిందూపురం సమీపంలోని సడ్లపల్లి చెరువులో రాత్రి, పగలు మట్టిని తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. టిప్పరుకు రూ.6 వేలు, ట్రాక్టరుకు రూ.1,500 చొప్పున వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే వెయ్యి టిప్పర్లకుపైగా తరలించారు. ఈ వ్యవహారం వెనుక అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి హస్తం ఉన్నట్లు ఆరోపణలున్నాయి.

లేపాక్షి పెద్దచెరువు, చిలమత్తూరు చెరువుల్లోనూ గత నెల వరకు మట్టి తవ్వకాలు ముమ్మరంగా జరిగాయి. కొందరు స్థానిక నాయకులు అక్కడి మట్టిని రహదారి నిర్మాణానికి, ప్రైవేట్? వెంచర్లకు విక్రయించుకున్నారు. అధికారుల జోక్యంతో తవ్వకాలు నిలిచిపోయాయి. బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారు.

**వ్యవసాయం పేరుతో వ్యాపారం**

చెరువుల్లో మట్టిని తవ్వుకోవాలంటే రైతులకు మాత్రమే అవకాశం ఉంటుంది. వ్యవసాయానికి అవసరమైతే రైతు తహసీల్దారుకు దరఖాస్తు చేసుకోవాలి. అక్కడి నుంచి ఇరిగేషన్? డీఈ సిఫార్సు చేస్తే జిల్లా ఉన్నతాధికారులు అనుమతి మంజూరు చేస్తారు. ఇందుకుగాను క్యూబిక్? మీటరుకు రూపాయి చొప్పున ట్రాక్టరుకు రూ.3 చెల్లించాల్సి ఉంటుంది. రైతుల ప్రయోజనం కోసం ప్రభుత్వం గతేడాది ఈ జీవోను జారీ చేసింది. దీన్ని అనుకూలంగా మలుచుకొన్న కొందరు వ్యవసాయం పేరుతో వ్యాపారం చేస్తున్నారు.

**తనిఖీలు అంతంత మాత్రమే..**

హిందూపురం ఇరిగేషన్‌శాఖలో తనిఖీలు తగ్గడానికి సిబ్బంది కొరత కారణంగా కనిపిస్తోంది. ఇక్కడ ఒక డీఈ, జేఈ మాత్రమే ఉన్నారు. ఒక జేఈ, వర్క్ ఇన్‌స్పెక్టరు, లస్కరు సెలవులో ఉన్నారు. అక్రమ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లడానికి వీరికి సరైన సిబ్బంది లేరు. మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకుంటామని ఇరిగేషన్ డీఈ శైలేశ్వర్‌రెడ్డి తెలిపారు.

# మృత్యు 'కూడళ్లు'



కర్నూలు: రాయలసీమ ముఖ ద్వారమైన ఉమ్మడి కర్నూలు జిల్లా పలు జాతీయ రహదారులకు కూడలి.. 44, 40, 150సీ, 167, 544డీ జాతీయ దారులు జిల్లాలోని పలు గ్రామాల మీదుగా వెళ్తున్నాయి.. అండర్ పాస్లు లేక ఇరువైపులా ఉన్న పలు గ్రామాల వారికి ప్రాణసంకటంగా మారింది.. ప్రతినెలా అన్నిశాఖల అధికారులతో జిల్లా కలెక్టర్లు నిర్వహించే రహదారి భద్రత సమావేశాలకు హాజరై పలు నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు చేయడం లేదు. ఏ ప్రాంతాలు ప్రమాదకరంగా ఉన్నాయి? ఎక్కడెక్కడ లోపాలున్నాయి? అన్న అంశాలపై అన్ని శాఖల అధికారులకు స్పష్టత ఉన్నా సరిదిద్దకపోవడంతో ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి.

**కీలకమైనవి మరిచారు**

కర్నూలు-బెంగళూరు రహదారి(44) నగరం మీదుగా వెళ్తోంది.. సంతోష్నగర్ దగ్గర పైవంతెన లేదా అండర్పాస్ నిర్మించాలన్న ప్రతిపాదన ఉంది. ఇరువైపులా కాలనీలు ఉండటంతో బారికేడ్లు దాటి ప్రయాణం సాగిస్తున్నారు. ఈక్రమంలో మృత్యుఒడికి చేరుకొంటున్నారు. గత ఏడాది ఆరుగురు వరకు మృతిచెందారు. ఈ కూడలికి సమీపంలో వెంకటరమణ కాలనీలోకి వెళ్లే అండర్పాస్ ఉందని సాకులు చెబుతూ అధికారులు వంతెన నిర్మించకుండా కాలయాపన చేస్తున్నారు. కార్బైడ్ ఫ్యాక్టరీ కూడలి దగ్గర పలువురు రహదారిని దాటుతున్నారు. గతేడాది ఇక్కడ నలుగురు మృత్యువాతపడ్డారు. అండర్పాస్ నిర్మించాలన్న ప్రతిపాదన ఉన్నా సాకారం కావడంలేదు. డోన్ మ్యాక్స్ హోటల్ వద్ద పైవంతెన, అండర్పాస్ నిర్మించాలని పోలీసులూ సూచించినా అధికారుల్లో చలనం లేదు.

నగర శివారులో కేసీ కాల్వపై వంతెన నిర్మించాల్సి వస్తుందన్న ఉద్దేశంతో సర్వీసు రహదారిని అర్ధాంతరంగా వదిలేశారు. దీంతో ఇక్కడ పలు గ్రామాల వారు అపసవ్య దిశలో వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

ఇక్కడ వదిలేశారు

ఎన్హెచ్-40పై నంద్యాల శివారు చాబోలు వద్ద అండర్పాస్ ఉంటే ఆళ్లగడ్డ నుంచి నంద్యాలలోకి వచ్చే వాహనాలకు ఇబ్బంది ఉండదు. ఆళ్లగడ్డ సమీపంలో జాతీయ రహదారి నుంచి నిత్యం వేలాది వాహనాలు అహోబిలం వైపు వెళ్తాయి. ఇక్కడ అండర్పాస్ అత్యవసరమైనప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదు. గతేడాది ప్రమాదాలు జరిగి ఐదుగురు మృత్యువాత పడ్డారు.


ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల వద్ద ఎన్హెచ్-40 ప్రమాదకరంగా మారింది. గ్రామస్థులు ధర్నాలు చేసినా అధికారుల్లో చలనం లేదు. చింతకొమ్మదిన్నె వద్ద రోడ్డు దాటుతూ గతేడాది పది మంది మృత్యువాతపడ్డారు.

ఎన్హెచ్-167పై ఎమ్మిగనూరులో వ్యవసాయ మార్కెట్ యార్డ్ కూడలి దగ్గర రోడ్డు దాటుతూ పలువురు మృతిచెందారు. ఇక్కడ అండర్పాస్ నిర్మించాలన్న ప్రతిపాదన ఉన్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడంలేదు.

| జిల్లా | 2024 | 2025 |
|---|---|---|
| (రోడ్డు ప్రమాదాల్లో మృతులు) | | |
| కర్నూలు | 300 | 271 |
| నంద్యాల | 330 | 279 |

నల్లగట్ల వద్ద అత్యంత ప్రమాదకరంగా మారిన జాతీయ రహదారి ప్రాంతం ఇదే

# కోట సందర్శకులకు సమస్యల స్వాగతం!



గుత్తి : చారిత్రక గుత్తికోట సందర్శనకు వెళ్లే పర్యాటకులకు ఇక్కడి సమస్యలతో తిప్పలు తప్పడం లేదు. వారాంతపు సెలవుల్లో వందలాదిమంది విద్యార్థులు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఎక్కువగా వస్తుంటారు. పురుషులు, మహిళలకు కలిసి నాలుగు మరుగుదొడ్లను నిర్మించారు. వీటిని రెండునెలలు దాటుతున్నా వినియోగంలోకి తీసుకురావడం లేదు. మరోవైపు తాగునీటి అవసరాల నిమిత్తం శుద్ధజల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అన్నీ బాగానే ఉన్నా ఇవీ ఉన్నాయంటూ కనీసం ఎక్కడా బోర్డును ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. స్కావెంజర్లు లేక మరుగుదొడ్లను తెరవడం లేదని తెలిసింది. కోట సందర్శనకు వచ్చే వారంతా సమీపంలోని దుకాణాల్లో డబ్బులు పెట్టి నీళ్ల సీసాలను కొనాల్సిన పరిస్థితి కొనసాగుతోంది.

**సేదతీరేందుకు షెల్టర్లు ఏవీ?** ప్రధానంగా గుత్తి కోటకు వచ్చే సందర్శకులు సేద తీరేందుకు కోట పైభాగం, కింది భాగంలో ఎలాంటి షెల్టర్లు లేవు. ఇది తీవ్ర సమస్యగా ఉంటోంది. ప్రధానంగా మహిళలు ఇబ్బంది పడుతున్నారు. త్వరలో ప్రభుత్వం కోట ఉత్సవాలను నిర్వహించనుంది. దీనికి గాను రూ.50లక్షలు విడుదల చేసింది. వేడుకలకు గుత్తిలోని కళాశాలలు, ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులతోపాటు ప్రజలను పెద్దఎత్తున సమీకరించనున్నారు. అప్పుడు తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి తగు ఏర్పాట్లు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

# ఆగలేదు.. ఆపలేదు!

పాడేరు : జిల్లాలో గంజాయి అక్రమ రవాణాకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడలేదు. పోలీసులు జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు పెట్టి రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నా.. అక్రమార్కులు కొత్త ఎత్తుగడతో దందా సాగిస్తున్నారు. అక్రమ రవాణా, క్రయవిక్రయాలు, వినియోగించే వారిపై ప్రత్యేక నిఘాపెట్టి.. ఎప్పటికప్పుడు నివారణ చర్యలు తీసుకుంటున్నా ఆశించిన స్థాయిలో మార్పు కనిపించడం లేదు. యువకులే అధికంగా గంజాయి రవాణా ఊబిలో కూరుకుపోతున్నారు. జల్సాలకు అలవాటు పడి.. అధికంగా డబ్బు వస్తుందన్న ఆశతో.. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి మరీ గంజాయి తరలిస్తున్నారు. ఒడిశా నుంచి అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలమీదుగా తరలిస్తున్నారు. ఒడిశాలో కేజీ రూ. 5 వేల నుంచి రూ. 6 వేల మధ్య కొనుగోలు చేసి.. వారి స్వస్థలాల్లో కేజీ రూ. 25 వేలకు అమ్ముతున్నారు. కరా?టక, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చి.. రోడ్డు, రైలు మార్గాల ద్వారా రవాణా చేస్తున్నారు. కొద్దిరోజుల నుంచి దందాతీరు మారింది. పోలీసుల కళ్లుగప్పేందుకు మహిళలతో రవాణా చేయిస్తున్నారు.

ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో (ఏఓబీ) దేశంలో ఎక్కడా




లభించని శీలావతి రకం పండుతుంది. దేశవిదేశాల్లో దీనికి మంచి డిమాండ్ ఉంది. దీంతో ఇతర రాష్ట్రాలకు చెందిన ముఠాలు.. ఏజెన్సీ బాటపడుతున్నాయి. ఏజెన్సీకి దగ్గరగా ఉన్న నర్సీపట్నాన్ని ఆసరాగా చేసుకుని దందా సాగిస్తున్నారు. ఇటీవల విజయనగరం జిల్లా సంతకవిటి మండలానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గాదె రేణుక నర్సీపట్నంలో నివాసం ఏర్పాటు చేసుకున్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన వారిని బృందంగా ఏర్పరుచుకున్నారు. ఈమె నెట్‌వర్క్ రాష్ట్రాలు దాటి విదేశాలకు చేరింది. ఏజెన్సీలో గంజాయి కొనుగోలు చేసి.. కరా?టక, తమిళనాడుతోపాటు శ్రీలంకకు కూడా సరఫరా చేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

**దొరికితే కఠిన చర్యలు**

– తుహిన్‌సిన్హా, ఎస్పీ, అనకాపల్లి

జిల్లాలో సంకల్పం పేరుతో అవగాహన కార్యక్రమాలు, సదస్సులు పెడుతున్నాం. జిల్లాలో గంజాయి అక్రమ రవాణాలో పట్టుబడిన వారికి చట్టప్రకారం కఠిన చర్యలుంటాయి. గంజాయి రవాణా చేస్తున్నట్లు ఎవరికైనా తెలిస్తే.. సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వండి. సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

# పాఠం సులువే చిన్నా!

నక్కపల్లి : బోధనా విధానంలో ఎప్పటికప్పుడు నూతన పద్ధతులు అమలుచేస్తున్న కూటమి ప్రభుత్వం.. పాల్ (పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్) ల్యాబ్ ద్వారా విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు కృషి చేస్తోంది. జిల్లాలోని పలు పాఠశాలల్లో దీన్ని పటిష్ఠంగా అమలు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిరోజూ జరిగే బోధనతోపాటు, కనీస ప్రాథమిక అంశాల్లో విద్యార్థుల సమర్థతను తెలుసుకోడానికి విద్యాశాఖ పాల్ ల్యాబ్‌ను ప్రవేశపెట్టింది. గతేడాది తొలివిడతగా 29 (20 కేజీబీవీలు, అయిదు ఆదర్శ, గురుకుల, గిరిజన సంక్షేమ పాఠశాలలు) పాఠశాలల్లో అమలులోకి తెచ్చారు. ఈ ఏడాది మరో 18 పీఎం శ్రీ పాఠశాలల్లో కూడా ప్రవేశపెట్టారు. రెండు విడతల్లో వెరసి 47 పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు పాల్ ల్యాబ్ అమలు చేస్తున్నారు. ప్రతి పాఠశాలకు 30 చొప్పున ట్యాబ్‌లు, హెడ్‌ఫోన్ సెట్లు అందించారు. ట్యాబ్‌లో ప్రతి పాఠానికి సంబంధించి ప్రత్యేకంగా 45 నిమిషాల చొప్పున విద్యార్థులకు పరీక్ష ఉంటుంది. ఇందులో వారి సామర్థ్యాన్ని ఆన్‌లైన్‌లో గుర్తించి నివేదిక ఇస్తారు. 10 వేల మంది విద్యార్థులకు దీనిపై సాధన చేస్తున్నారు.

**ఎన్నో ప్రయోజనాలు..**

బడిలో విద్యార్థి చదివిన చదువుకు సంబంధించి రోజువారీ ప్రణాళిక పాఠశాలలకు ఇచ్చిన ట్యాబ్‌ల్లో ఉంటుంది. ఇందులో తెలుగు, ఆంగ్లం, గణితంపైనే సాధన జరుగుతుంది. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రాథమిక అంశాలపై పరీక్ష ఉంటుంది. ఇది ట్యాబ్‌లోనే చేయాల్సి ఉంటుంది. దీని ఆధారంగా వారి చదువు పరిస్థితిని స్థానిక, జిల్లా స్థాయి అధికారులు గుర్తిస్తారు.



ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు ట్యాబ్‌లో మరోసారి వస్తాయి. వీటిని విద్యార్థులు చదువుకుని పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఎవరైనా వెనుకబడినట్లు ఉంటే మరింత సాధన చేసేలా ఇందులో సూచనలు తెలుస్తాయి. దీనికనుగుణంగా విద్యార్థులు ముందుకు సాగాల్సి ఉంటుంది.

**ఆత్మవిశ్వాసం పెరిగింది**

పాల్ ల్యాబ్ విధానంలో మాకు బోధించిన పాఠ్యాంశాలను పునశ్చరణ చేసుకునే అవకాశం కలుగుతోంది. దీని ద్వారా సందేహాలుంటే పూర్తిగా నివృత్తి అవుతున్నాయి. మరింత ఆత్మవిశ్వాసం పెరిగింది.

**పక్కాగా అమలు**– అప్పారావు నాయుడు, జిల్లా విద్యాశాఖాధికారి

దశలవారీగా పాల్ ల్యాబ్‌ల సంఖ్య పెంచుతున్నారు. విద్యార్థుల చదువు సామర్థ్యం పెంపొందించేలా ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. ఇందుకోసం ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చాం. కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేసేలా ఉపాధ్యాయులు, బోధనా సిబ్బందికి సూచనలు ఇస్తున్నాం.

చురకలు



## పనులు నెమ్మదించాయి.. ఎందుకో..?

గుడుపల్లె : గుడుపల్లె ప్రాంతంలో రైల్వే ప్రయాణికులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ఏళ్లనాటి సమస్యలకు పరిష్కారం చూపడం లేదు. నిత్యం ఇక్కడి నుంచి బెంగళూరు, చెన్నై ప్రాంతాలకు సుమారు ఐదు వేల మంది రైళ్లలో ప్రయాణిస్తుంటారు. అయితే స్థానిక రైల్వేస్టేషన్‌లో కనీస మౌలిక వసతులు లేకపోవడం గమనార్హం.నాలుగు ఎక్స్‌ప్రెస్.. ఎనిమిది ప్యాసింజర్.. గుడుపల్లె రైల్వేస్టేషన్‌లో ఉదయం నుంచి రాత్రి వరకు... నాలుగు ఎక్స్‌ప్రెస్, ఎనిమిది ప్యాసింజర్ రైళ్లు ఆగుతాయి. స్టేషన్లో తాగునీరు, షెల్టర్లు, కూర్చునేందుకు సరైన బెంచీలు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

అధ్వానంగా స్టేషన్ రోడ్లు .. రైలు ప్రయాణం కోసం సుమారు 60




గ్రామాల ప్రజలు వస్తుంటారు. స్టేషన్‌కు వచ్చే రోడ్లు గుంతలు పడి అధ్వానంగా ఉండటంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రూ.25 కోట్లు మంజూరైనా.. గుడుపల్లె–కుప్పం రైలు మార్గం గుడుపల్లె వద్ద రైల్వే కింది వంతెన నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరయ్యాయి. పనులు చేపట్టేందుకు రెండు సార్లు సర్వే చేసినా నేటికీ పనులు ప్రారంభించకపోవడం గమనార్హం. దీంతో గేటు పడిన సమయంలో ప్రజలు ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

## పరి'శ్రమించి'న అభివృద్ధి..!

కుప్పం : త్రిరాష్ట్ర కూడలి సరిహద్దు ప్రాంతం.. ఒకప్పుడు ఉన్నత విద్య చదవాలంటే ఇతర ప్రాంతాలకు వెళ్లాలి.. ఇప్పుడు ఈ ప్రాంతంలో ఉన్నత విద్య లభిస్తుండటంతో ఇతర ప్రాంతాల వారు సైతం ఇక్కడే విద్యనభ్యసిస్తున్నారు. ఉపాధి పొందాలంటే మాత్రం పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సిందే. అయితే ఈ విధానానికి స్వస్తి పలికేందుకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. కుప్పంలో ఈ దఫా పలు పరిశ్రమలు రూ.వేల కోట్లతో స్థాపన చేస్తుండటంతో.. ఇక్కడే ఉద్యోగాలు లభిస్తాయని యువకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కుప్పం నియోజకవర్గంలోని కడా ఆధ్వర్యంలో నాలుగు మండలాల్లో పరిశ్రమల స్థాపనకు ఆయా ప్రాంతాల్లో పనులు చకచకా జరుగుతున్నాయి. ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వేర్వేరుగా వర్చువల్ విధానంలో పలు పరిశ్రమలకు శంకుస్థాపన చేశారు. కుప్పం ప్రాంతంలో 22 పరిశ్రమలతో కడా ఇప్పటికే మౌఖిక ఒప్పందం చేసుకుంది. ఈ పరిశ్రమలన్నీ స్థాపిస్తే నిరుద్యోగ సమస్య తీరుతుందని యువత అభిప్రాయపడుతున్నారు.

**వివరాలిలా..**



పరిశ్రమలు: సుమారు 22
కేటాయించిన భూమి: 937.58 ఎకరాలు
పెట్టుబడులు: రూ.8,051.27కోట్లు
ఉపాధి ప్రత్యక్షంగా: 38,593 మంది
పరోక్షంగా: 51,565 మంది

**విద్య.. ఉపాధి.. ఇక్కడ**

కుప్పం ప్రాంతం విద్యా కేంద్రంగా మారింది.. ఇప్పుడు పరిశ్రమల రాకతో ఉపాధి కూడా లభించనుంది. పరిశ్రమలు వస్తే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుంది. దీంతో వలసలు తగ్గుతాయి.
వాసువివేక్, కుప్పం

**మెరుగైన ఫలితాలు సాధిస్తాం**

కడా ఆధ్వర్యంలో 22 పరిశ్రమలతో ఇప్పటి వరకు మౌఖిక ఒప్పందం చేసుకున్నాం. ఎనిమిది పరిశ్రమల స్థాపనకు పనులు ప్రారంభించాం. మిగిలిన 9 పరిశ్రమల పనులు ప్రారంభించాల్సి ఉంది. మిగతా 5 పరిశ్రమలకు స్థలాన్వేషణ చేస్తున్నాం.వికాస్ మర్మత్, పీడీ, కడా

## 'ఆధార్' నవీకరణకు.. మరో అవకాశం..!

విశాఖపట్నం : అక్టోబరులో వారం రోజుల పాటు జిల్లాలోని పాఠశాలల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. కానీ ఎక్కువ మంది నవీకరించుకోలేదు. దీంతో మరోసారి అవకాశం కల్పించారు.అయిదు నుంచి 17 ఏళ్ల పిల్లలకు ఈ ఏడాది సెప్టెంబరు 30 వరకు ఉచితంగా సర్వీసు అందిస్తారు. గుర్తింపు, నివాస ధ్రువీకరణను ప్రతి పదేళ్లకోసారి అప్‌డేట్ చేసుకోవాలని ఉడాయ్ సూచిస్తోంది. విద్యా సంస్థల్లో ప్రవేశ పరీక్షలు, ఉపకార వేతనాలు, సంక్షమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఆధార్ తప్పనిసరి అవుతోంది. ఫిబ్రవరిలో నీట్–2026 నమోదు ప్రక్రియ ప్రారంభం కానుంది. వీటితోపాటు కొన్ని జాతీయ ప్రవేశ పరీక్షలకు తప్పనిసరిగా ఆధార్ అప్‌డేట్ చేసుకోవాల్సిన అవసరముంది. ఉడాయ్ సూచన ప్రకారం జిల్లాలో తప్పనిసరిగా చేయాల్సిన బయోమెట్రిక్ 1,09,000 పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో సోమవారం నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు.

17ఏళ్లలోపు పిల్లలకు ఉచితం: అప్పుడే పుట్టిన శిశువుల నుంచి అయిదేళ్ల లోపు పిల్లలకు ఫొటో, పేరు, పుట్టిన తేదీ ఆధారంగా 'బాల ఆధార్' జారీ చేస్తారు. ఆ వయసులో ఐరిస్, వేలి ముద్రలు తీసుకోరు. ప్రస్తుత నిబంధనల ప్రకారం వారికి అయిదేళ్లు రాగానే తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్‌డేట్ చేయాలి. బీ మ్యాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్ (ఎంబీయూ)గా పిలిచే ఈ ప్రక్రియను అయిదు నుంచి ఏడేళ్ల లోపు చేసుకుంటే సేవలు ఉచితం. ఈ ప్రక్రియ ద్వారా చిన్నారుల ఆధార్ నంబరులో ఎలాంటి మార్పు ఉండదు. ఏడేళ్లు వచ్చినా నవీకరణ జరగకపోతే ఆధార్ గుర్తింపు రద్దు చేసే అవకాశముంది.

మ్యాపింగ్ పూర్తి..– ఉషారాణి, జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల పర్యవేక్షణాధికారి

ఎంబీయూ ఎక్కువగా పెండింగ్ ఉన్న పాఠశాలలకు ముందుగా కిట్లు పంపించనున్నాం. ఈ మేరకు మ్యాపింగ్ పూర్తి చేశాం. పాఠశాల, కళాశాలల యాజమాన్యాలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు ఎంబీయూ పూర్తి చేయాలి.

# చరిత్ర పదిలం.. ప్రాచీన వైభవం



తిరుపతి: కలియుగ వైకుంఠమైన తిరుమల క్షేత్రంలోని వెయ్యేళ్ల చరిత్ర కలిగిన ప్రాచీన కట్టడాలు, రాతి మండపాలు, మెట్ల మార్గాలను పదిలపర్చుకునేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్కియాలజి సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) తరహాలో శాస్త్రీయ పద్ధతిలో వీటిని మరమ్మతు చేసి, పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ఇంజినీరింగ్ శాఖ పరిధిలో ప్రత్యేకంగా 'కన్జర్వేషన్ అండ్ ప్రిజర్వేషన్ సెల్'ను ఏర్పాటు చేయనుంది. డిసెంబరు 16న జరిగిన తితిదే ధర్మకర్తల మండలి సమావేశంలో ఛైర్మన్ బి.ఆర్. నాయుడు నేతృత్వంలో ఈ ప్రతిపాదనకు ఆమోదం లభించింది.

**1500 ఏళ్ల నాటి చరిత్రను కాపాడేలా..** తిరుమలలోని అనేక చారిత్రక కట్టడాలు, తిరుమల–తిరుపతి మధ్య ఉన్న కాలిబాటలు వెయ్యి నుంచి 1500 ఏళ్ల క్రితం నాటివి. వీటిని పరిరక్షించి, భవిష్యత్తు తరాలకు అందించాల్సిన ఆవశ్యకత ఉందని తితిదే గుర్తించింది. ఏఎస్ఐ ప్రమాణాలకు అనుగుణంగా వీటి మరమ్మ తులు చేపట్టేందుకు, ప్రత్యేకంగా ఒక వినియోగదారుల మాన్యువల్‌ను కూడా రూపొందించనున్నారు. **కీలక అంశాలు ఇవే..**

ఈ విభాగాన్ని పర్యవేక్షించేందుకు డిప్యూటీ ఈవో హోదాలో 'కన్జర్వేషన్ అండ్ ప్రిజర్వేషన్ ఆఫీసర్ (ఇంజినీరింగ్)' అనే కొత్త పోస్టును సృష్టించనున్నారు.పురావస్తు శాఖలో పనిచేసిన అనుభవం ఉన్న విశ్రాంత అధికారిని లేదా ఏఎస్ఐ నుంచి డెప్యూటేషన్‌పై వచ్చిన అధికారిని ఈ పోస్టులో నియమిస్తారు.ఈ అధికారికి ఏటా సుమారు రూ.13 లక్షల వరకు ఖర్చు అవుతుందని అంచనా. టీవీఎస్ మోటార్స్, లార్డ్ వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ (పుణె) వంటి స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఈ పురాతన కట్టడాల పరిరక్షణ పనులు చేపట్టనున్నారు. కట్టడాల పటిష్ఠత, చారిత్రక ప్రాధాన్యాన్ని కాపాడేందుకు ఎప్పటికప్పుడు ఆడిట్ నిర్వహిస్తారు. ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలపడంతో పాటు, ప్రత్యేక సెల్ ఏర్పాటు కోసం అనుమతి కోరుతూ ఏపీ ప్రభుత్వానికి లేఖ రాయాలని బోర్డు నిర్ణయించింది.

# అ'ధనం' వసూలు




కర్నూలు : గోధుమ పిండి పంపిణీలో కొందరు డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కర్నూలు నగరపాలక సంస్థతోపాటు పురపాలక సంఘాల పరిధిలోని రేషన్ కార్డుదారులకు కూటమి ప్రభుత్వం కిలో గోధుమ పిండిని జనవరి నుంచి పంపిణీ చేస్తోంది. కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో 172 చౌక దుకాణాలుండగా.. 1,13,398 మంది కార్డుదారులున్నారు. జిల్లాకు 70 టన్నుల గోధుమ పిండి కేటాయించారు. ఒక్కో చౌక దుకాణం పరిధిలో మొత్తం కార్డుదారుల్లో 70 శాతం మందికి గోధుమ పిండి ప్యాకెట్లను పౌరసరఫరాల సంస్థ అధికారులు సరఫరా చేశారు. కిలో పిండి రూ.20కు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. వాస్తవంగా డీలర్లకు ప్రభుత్వం రూ.19కే అందిస్తోంది. కార్డుదారులకు విక్రయించినందుకు కిలో ప్యాకెట్‌పై రూపాయి కమీషన్ ఇస్తోంది. కానీ కొందరు డీలర్లు కిలో గోధుమ పిండిని రూ.25కు అమ్ముతున్నారు.

**కార్డుదారులపై భారం మోపి..**

పౌరసరఫరాల సంస్థ గోదాము నుంచి చౌకదుకాణాలకు సరఫరా చేసిన బ్యాగుల్లో తమకు రావాల్సిన కోటా కంటే తక్కువ ప్యాకెట్లు వచ్చాయని.. ఒక్కో బ్యాగులో 5 నుంచి 10 ప్యాకెట్లు తక్కువగా రావడంతో ఆ కొరతను అధిగమించేందుకు ఒక్కో ప్యాకెట్‌పై రూ.5 అదనంగా వసూలు చేస్తున్నట్లు కొందరు డీలర్లు చెబుతున్నారని కార్డుదారులు వాపోతున్నారు. కర్నూలు బాబా బృందావన్ నగర్‌లో కిలో గోధుమ పిండి ప్యాకెట్‌ను ఓ డీలరు కార్డుదారులకు రూ.25కు ఇచ్చారు. జనం ప్రశ్నిస్తే.. తానొక్కడినే ఇలా చేయడం లేదని.. చాలామందికి గోధుమ పిండి ప్యాకెట్లు తక్కువగా రావడంతో రూ.5 అదనంగా వసూలు చేస్తున్నట్లు చెప్పారని పలువురు కార్డుదారులు పేర్కొన్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

# 'హద్దు'ల్లేని ఆక్రమణలు



ఎమ్మిగనూరు :విలువైన ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమించి సాగు చేసుకుంటున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. తాఖీదులిచ్చి తమ పనైపోయిందంటూ చేతులు దులిపేసుకొంటున్నారు. ఎమ్మిగనూరు మండల పరిధిలో బనవాసిఫారం వద్ద 2,180 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో నవోదయ విద్యాలయం, పశుసంవర్ధకశాఖ పాలిటెక్నిక్ కళాశాల, కృషి విజ్ఞాన కేంద్రం, గురుకుల బాలిక పాఠశాల, జూనియర్ కళాశాల, ఇతర ప్రభుత్వ సంస్థలకు 600 ఎకరాలు కేటాయించారు. మిగిలిన భూమిలో ఆబోతుల పోషణకు పచ్చిమేత, ఇతర గ్రాసాలు పండిస్తున్నారు. బనవాసిఫారం భూముల సరిహద్దులు అసమగ్రంగా ఉండటంతో నాయకుల అండదండలతో పలువురు సుమారు 200 ఎకరాలను ఆక్రమించుకున్నారు. సారవంతమైన ఎర్ర నేలలు కావడం, ఫారం భూముల మధ్యలో ఎల్లెల్సీ ప్రవహిస్తుండటంతో హస్తగతం చేసుకుని పంటలు పండించుకుంటున్నారు.

**సర్వే పూర్తికాక..** ఫారం భూముల అన్యాక్రాంతంపై 'ఈనాడు'లో వరుస కథనాలు రావడంతో సమగ్రంగా సర్వే చేసి సరిహద్దుల్లో రాళ్లు పాతాలని గతంలో పనిచేసిన సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. కొంతవరకు సర్వే చేసి వదిలేశారు. సబ్ కలెక్టర్ పదోన్నతిపై వెళ్లడంతో సర్వే ఆగిపోయింది. దీంతో ఫారం భూముల సరిహద్దు సమస్య మళ్లీ మొదటికొచ్చింది.గత ఖరీఫ్ కంటే ముందే ఆక్రమణదారులకు అధికారులు తాఖీదులు ఇచ్చారు. కొంతమేర స్వాధీనం చేసుకున్నారు. పంటలు వేశామని.. స్వాధీనం చేసుకుంటే తీవ్రంగా నష్టపోతామంటూ పలువురు హైకోర్టుకు వెళ్లారని ఆబోతు కేంద్రం అధికారులు చెబుతున్నారు. **కంచె ఏర్పాటుచేస్తే..** బనవాసిఫారం భూముల మధ్యలో ఎమ్మిగనూరు–ఆదోని జాతీయ రహదారి వెళుతోంది. దీనికితోడు దిగువ కాల్వ ప్రవహిస్తుండటంతో భూములకు మంచి డిమాండ్ ఉంది. ఎకరా రూ.అర కోటికి పైగా పలుకుతోంది. ఈ నేపథ్యంలో సమగ్ర సర్వే చేసి సరిహద్దు రాళ్లు పాతి కంచె ఏర్పాటు చేస్తే ఆక్రమణలకు అడ్డుకట్ట వేయొచ్చు. సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. కానీ రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అధికారులు పట్టించుకోవడం లేదు. భూములకు సరిహద్దు ఏర్పాటుచేసి ఆబోతు కేంద్రానికి అవసరమైన భూమి పోగా.. మిగతా దానికి కౌలుకు వేలం వేస్తే ప్రభుత్వానికి ఆదాయం వస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎకరా కౌలు రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పైగా తీసుకుంటున్నారు. ఈ లెక్కన ప్రభుత్వానికి కౌలు వేలం ద్వారా ఏటా రూ.కోటికిపైగా ఆదాయం వచ్చే అవకాశముంది.

## బూడిదే మిగిలింది!

అచ్యుతాపురం : అచ్యుతాపురం నాన్ సెజ్‌లోని ఎస్‌వీఎస్ రసాయన పరిశ్రమలో జరిగిన భారీ అగ్ని ప్రమాదం బూడిదనే మిగిల్చింది. మంటలు చెలరేగిన భవనం మొత్తం నల్లగా మారింది. గోడలు కూలిపోయాయి. ప్రాంగణంలో పొగలు వస్తున్నాయి. ఆవరణలో ఇనుప డ్రమ్ములు చెల్లాచెదురుగా పడ్డాయి. సాల్వెంట్ నిల్వ ట్యాంకులు నామరూపాల్లేకుండా పోయాయి. సిలెండర్లు దూరంగా ఎగిరిపడ్డాయి. ఎకరా విస్తీర్ణంలో పరిశ్రమ ఏర్పాటుకు ఏపీఐఐసీ, పరిశ్రమల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఎలా అనుమతి ఇచ్చారనే విషయం ప్రశ్నార్థకంగా ఉందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. పక్కపక్కనే రసాయన, ఫార్మా పరిశ్రమలను ఏర్పాటు చేయడం వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే మిగిలిన వాటికీ మంటలు వ్యాపించే ఆస్కారముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్క కంపెనీ నిర్లక్ష్యంగా వ్యవహరించినా మిగిలిన కంపెనీలన్నీ భారీ మూల్యం చెల్లించాల్సిన పరిస్థితన్నారు.ప్రమాదం జరిగిన కంపెనీ వద్ద మంటలు అదుపు చేయడానికి ఎటువంటి ప్రాథమిక జాగ్రత్తలు తీసుకోలేదని అధికారుల విచారణలో వెల్లడైంది. విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు



వ్యాపించిన సమయంలో నీటితో అదుపు చేయడానికి ప్రయత్నించడంతోనే మంటలు ఎగిసిపడ్డాయని ప్రాథమికంగా నిర్ధారించారు. అవగాహన లేకుండా నీటిని పిచికారీ చేసి మంటలు మరింత పెరగడానికి కారణమయ్యారని కంపెనీ ప్రతినిధులను హోంమంత్రి అనిత, ఎమ్మెల్యే విజయకుమార్ నిలదీశారు. కార్మికుల ప్రాణాలకు రక్షణలేని పరిశ్రమలు ఇక్కడ ఉంచొద్దని ఎమ్మెల్యే కోరారు. నిబంధనలకు విరుద్ధంగా అవసరానికి మించి మండే స్వభావం ఉన్న రసాయనాలను నిల్వ చేయడం వల్లే ప్రమాదం జరిగిందని కాలుష్య నియంత్రణ మండలి ఈఈ ముకుందరావు, పరిశ్రమల శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వరరావు చెప్పారు.

**ఎస్‌వీఎస్ పరిశ్రమపై కేసు నమోదు..**

నాన్ సెజ్‌లో అగ్నిప్రమాదం జరిగిన ఎస్‌వీఎస్ రసాయన పరిశ్రమపై కేసు నమోదు చేసినట్లు సీఐ నరసింగరావు చెప్పారు. యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం, ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ప్రమాదం జరిగినట్లు లాలంకోడూరు వీఆర్వో సూరిబాబు ఆదివారం ఫిర్యాదు చేశారు.

## నకిలీ సృష్టించి.. నచ్చినట్లు విక్రయించి!

అనకాపల్లి : 'వైకాపా హయాంలో ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే చాలు నేతలు కబ్జా చేశారు. రెవెన్యూ అధికారులు అండదండలతో మరింత రెచ్చిపోయారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా పర్యవేక్షించాల్సిన అధికారులు చూస్తూ మిన్నకుండిపోయారు. అనకాపల్లి గ్రామీణ మండలం పిసినికాడ రెవెన్యూ పరిధిలో డీఫారం భూమి ఉంది. అప్పట్లో స్థానికంగా పనిచేసిన ఓ వీఆర్ఏ.. తప్పుడు పత్రాలతో కొంత స్థలాన్ని తన తల్లి పేరుతో మార్చుకున్నారు. మరికొంత స్థలాన్ని స్థానిక చోటా నాయకుడికి ధారాదత్తం చేశారు. అప్పట్లో ఈ వ్యవహారంపై వివాదం చెలరేగింది. తాజాగా ఈ స్థలాన్ని చిన్నచిన్న ప్లాట్లుగా వేసి విక్రయిస్తున్నా.. రెవెన్యూ అధికారులు నోరుమెదపడం లేదు.

పిసినికాడ రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 362–2, 3, 4, 5, 6, 7లో 6.09 ఎకరాల డీఫారం భూమి ఉంది. అప్పట్లో స్థానికంగా పనిచేసిన వీఆర్ఏ ఒకరు వైకాపా నేతతో చేతులు కలిపి నకిలీ పట్టాలు సృష్టించి ఆక్రమించుకున్నారు. ఈ వివాదంపై కోర్టులో కేసులున్నాయి. తాజాగా రెండు సెంట్ల స్థలాన్ని అనకాపల్లి మండలం బీఆర్‌టీ కాలనీకి చెందిన ఓ వ్యక్తికి రూ.నాలుగు లక్షలకు విక్రయించారు. ఈ విషయం రెవెన్యూ అధికారులకు తెలిసినా ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. మరికొంత స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసి పశుగ్రాసం, మామిడి చెట్లు పెంచుతున్నారు.

నాటి వీఆర్ఏగా ప్రస్తుతం చోడవరం మండలానికి సమీపంలోని ఓ గ్రామానికి వీఆర్ఓగా వ్యవహరిస్తున్నారు. ఆయన పిసినికాడలో పనిచేస్తున్న సమయంలో సర్వే నంబరు 362–3, 4లో 3.17 ఎకరాలు తన తల్లి పేరుతో మార్చుకున్నారు. స్థానికులు ఎన్ని ఫిర్యాదులు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం...**

– ఆనందరావు, తహసీల్దారు

ప్రభుత్వ స్థలం కబ్జాకు సంబంధించి ఫిర్యాదులేవీ నా దృష్టికి రాలేదు. క్షేత్రస్థాయిలో సిబ్బందితో పరిశీలన చేయిస్తాం. సర్వే చేయించి ప్రభుత్వ స్థలం ఉంటే హద్దులు నిర్ణయించి బోర్డులు ఏర్పాటు చేస్తాం. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

## విలువైన ఆస్తులు సమర్పయామి..!

అచ్యుతాపురం : మహా విశాఖ నగరపాలక సంస్థ అధికారులు పైరవీలకు తలొగ్గి రూ.కోట్ల ఆదాయం వదిలేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల తప్పిదాలతో జీవీఎంసీ ఆస్తులు ఏళ్ల తరబడి కొంత మంది చేతుల్లో ఉండిపోతున్నాయి. ఆయా ఆస్తుల్లో వ్యాపారాలు చేసుకుని రూ.కోట్లు సంపాదిస్తున్న గుత్తేదారులు జీవీఎంసీకి పైసా కూడా చెల్లించడంలేదు. ఏళ్ల తరబడి ఈ తంతు కొనసాగుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం.

**20ఏళ్లుగా గుత్తేదారు ఆధీనంలోనే..** శీఘ్ర బస్సు రవాణా వ్యవస్థ (బీఆర్‌టీఎస్) ప్రాజెక్టులో భాగంగా పెందుర్తి, సింహాచలం ట్రాన్సిస్ట్ కారిడార్ల పేరుతో జీవీఎంసీ రహదారులను విస్తరించింది. రూ.430 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టును దక్కించుకున్న గుత్తేదారు అభ్యర్థన మేరకు 2006–07లో ముడసర్లోవ రిజర్వాయర్‌కు ఎదురుగా ఉన్న 15 ఎకరాల స్థలాన్ని ఎలాంటి అద్దె, లీజు లేకుండానే అప్పటి అధికారులు కేటాయించారు. బీటీ లేయర్ కోసం పిక్క తయారుచేయడం, రహదారి నిర్మాణానికి ఉపయోగించే యంత్రాలను అక్కడ ఉంచేవారు. ఇరవై ఏళ్లుగా గుత్తేదారు ఆధీనంలోనే ఆ స్థలం ఉంది.

**కోల్పోయిన ఆదాయం ఎంతంటే..** ఆ స్థలాన్ని అద్దెకు ఇచ్చి ఉంటే ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం నెలకు రూ.20 లక్షలు, ఏడాదికి రూ.2.40 కోట్ల ఆదాయం సమకూరేది. గత ఇరవై ఏళ్ల మార్కెట్ల విలువలను బట్టి దాదాపు రూ.30 కోట్ల రాబడిని జీవీఎంసీ కోల్పోయింది.

**మరో 5 ఎకరాలను వదిలేశారు..** కేంద్ర కారాగారానికి ఆనుకుని జీవీఎంసీకి ఐదెకరాల స్థలం ఉంది. దాన్ని 2017లో ఇసుక యార్డుకు కేటాయించారు.

చురకలు



# రైతులకేది శ'నగ'?



నాగులుప్పలపాడు: ఒక వైపు ప్రతికూల వాతావరణ పరిస్థితులు.. మరోవైపు దిగజారిన శనగ ధరలు రైతన్నలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొని రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధరల్లేక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. జిల్లాలో శనగ పంటను రైతులు విస్తారంగా సాగు చేశారు. 2023లో పంట వేసే సమయంలో ఉన్న ధరలు ప్రస్తుతం పతనం కావడంతో రైతన్నల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో శీతల గిడ్డంగుల్లోనే శనగల బస్తాలు రెండేళ్లుగా మూలుగుతున్నాయి.

**దిగజారిన ధరలు...**

2023, నవంబరులో కాక్-2 రకం క్వింటా రూ. 12 వేలు, జేజే-11 రూ.7 వేలు పలికింది. తీరా పంట చెతికొచ్చే సమయానికి కాక్-2 రకం రూ.7 వేలు, జేజే-11 రూ.5 వేలే పలికింది. దీంతో రైతులు చేసేదేమీ లేక శీతల గిడ్డంగుల్లో నిల్వ చేశారు. అప్పటి నుంచి ధరలు పతనమవుతు వచ్చాయి. ప్రస్తుతం కాక్-2, జేజే-11 రకాల శనగలు మార్కెట్‌లో క్వింటాలుకు రూ.5 వేలు మాత్రమే పలుకుతున్నాయి. వీటిని కూడా కొనుగోలు చేసే నాథుడే కరవయ్యారు. ఒక వైపు పెట్టుబడులకు తీసుకొచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయి. శీతల గోదాముల్లో శనగలు నిల్వ చేయడానికి సంవత్సరానికి క్వింటాకు అద్దె రూ.140 చెల్లించాల్సి వస్తోంది. ఏళ్లతరబడి నిల్వ చేయడంతో రైతులకు అద్దెలు భారంగా మారాయి. దీంతో పాటు ఈ ఏడాది బర్లీ పొగాకు సాగు లేకపోవడంతో శనగ పంటను తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో కేంద్ర ప్రభుత్వం విధించే 30 శాతం దిగుమతి సుంకం ఎత్తి వేయడంతో ఇతర దేశాల నుంచి శనగలు తక్కువ ధరకే వస్తున్నాయని కొందరు రైతు సంఘం నాయకులు విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో శనగలను దిగుమతి చేసుకోవడంతో ఇక్కడి ధరలు పతనానికి కారణమంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం శీతల గిడ్డంగుల్లోని శనగల నిల్వలను మద్దతు ధరకు కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మొత్తం శనగ రైతుల సంఖ్య: 25,963

నిల్వలు (మెట్రిక్ టన్నుల్లో): 89,007

## మద్దతు దక్కదు.. మార్పు తప్పదు!

త్రిపురాంతకం : సాధారణ మొక్కజొన్నకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభించడం లేదు. వ్యయ ప్రయాసలకోర్చి పండించాక ప్రకృతి వైపరీత్యాలతో పాటు కొనుగోళ్లు పూర్తిగా వ్యాపారుల దయాదాక్షణ్యాలపై ఆధారపడటంతో సాగుపై కర్షకుల్లో నిరుత్సాహం ఏర్పడుతోంది. దీంతో లాభాల మాట దేవుడెరుగు పెట్టుబడులకు ఇబ్బందులు ఉండవని రైతులు విత్తన మొక్కజొన్న సాగుకు మొగ్గు చూపుతున్నారు.

**ఐదేళ్లుగా ఆయకట్టు, బోరుబావుల కింద..**

జిల్లాలో ఐదేళ్లుగా సాగర్ ఆయకట్టుతో పాటు బోరు బావుల కింద సాధారణ మొక్కజొన్న సాగు చేపడుతున్నారు. జిల్లాలో ఖరీఫ్‌లో 22,000, రబీలో 11,435 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. క్వింటా రూ.2,400 మద్దతు ధర ఉండగా రూ.1,800లకు మించి రేటు లభించడం లేదు. ఈ నేపథ్యంలో పెట్టుబడులకే సరిపోతుండటంతో గత ఐదేళ్ల నుంచి అన్నదాత విత్తన మొక్కజొన్నపై దృష్టి సారించారు. విత్తనాల సరఫరా రసాయన ఎరువుల పంపిణీ ఆయా కంపెనీలే బాధ్యత తీసుకోవడంతో పాటు విత్తన దశలోనే ఒప్పందం కుదుర్చుకుం



టున్నాయి. విత్తన రకాన్ని బట్టి ఎకరానికి కనీసం 4 టన్నుల చొప్పున దిగుబడులు లభిస్తాయి. టన్నుకు రూ.20,00 నుంచి రూ.35,000 వరకు చెల్లిస్తారు. ఈక్రమంలో త్రిపురాంతకంలో 4 వేల ఎకరాల్లోను, జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో విత్తన మొక్కజొన్న సాగు చేపట్టారు.

**నేరుగా కంపెనీలతో ఒప్పందాలు**

వాస్తవానికి అధికారులు, ప్రభుత్వంతో ఎటువంటి సంబంధం లేకుండా రైతులతో విత్తన కంపెనీలు నేరుగా పంట ఒప్పందాలు చేసుకుంటున్నాయి. అంతా సవ్యంగా సాగితే ఎకరానికి రూ.90 వేల నుంచి రూ.లక్ష వరకు రైతులకు చెల్లిస్తున్నారు. అయితే కంపెనీలకు, రైతులకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న దళారులు కంపెనీ నుంచి వచ్చే సొమ్ములను నొక్కేసి కర్షకులను వేధిస్తున్నారు. గతేడాది పంట కోశాక ఎగుమతుల సమయంలో డబ్బులు చెల్లింకపోవడంతో పలు గ్రామాల్లో గొడవలు జరిగిన ఉదంతాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో రైతులు దళారుల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అధికారులు వివరిస్తున్నారు.

## స్వాముల భూములు స్వాహా!

కనిగిరి : కనిగిరి ప్రాంతంలో దేవుడి భూములకే రక్షణ లేకుండాపోయింది. ఆలయాల స్థలాలు అన్యాక్రాంతమయ్యాయి. కొంతమంది అక్రమార్కులు బరితెగించి ఆక్రమించేస్తున్నారు. కొంతమంది నేతల అండదండలతో రూ.కోట్ల విలువైన భూములను కబ్జా చేయడమే కాకుండా వాటిని విక్రయిస్తూ తమ జేబులు నింపుకొంటున్నారు. ఆలయ భూములను పరిరక్షించాల్సిన దేవాదాయశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు.

ఇవి అక్రమార్కుల చెరలో ఉన్న పామూరు పట్టణ సమీపంలోని నెల్లూరు రోడ్డులో మదన వేణుగోపాలస్వామి దేవస్థానం భూములు. ఆలయానికి రూ.25 కోట్ల విలువైన సుమారు 17 ఎకరాల భూములున్నాయి. వీటిని నేతల అండతో అక్రమార్కులు ఆక్రమించేశారు. ఇటీవల అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినప్పటికీ వాటిని సైతం తొలగించేశారు. తాజాగా వారం రోజుల కిందట ఆలయ భూముల్లో బోర్లు తవ్వుతుండగా ఆలయ అధికారులు అడ్డుకున్నారు. ఆక్రమిత భూముల్లో వెంచర్లు వేసి ప్లాట్లుగా మార్చి విక్రయిస్తూ జేబులు నింపుకొంటున్నారు. ఇది కనిగిరిలోని విజయమార్తాండేశ్వరస్వామి దేవస్థానం. దక్షణ కాశిగా పేరొందిన ఈ ఆలయానికి సుమారు రూ.100 కోట్ల విలువైన 188 ఎకరాలకుపైగా భూములున్నాయి. ప్రస్తుతం కేవలం 8 ఎకరాలు మాత్రమే దేవాదాయశాఖ ఆధీనంలో



ఉండడం గమనార్హం. ఆలయానికి ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో భూములున్నట్లు సర్వే నంబర్లతో సహా అధికారులు గుర్తించినప్పటికీ ఇంతవరకు స్వాధీనం చేసుకోలేదు. రూ.కోట్ల విలువైన భూములను అక్రమార్కులు నేతల అండతో నకిలీ పత్రాలతో కబ్జా చేసి స్థిరాస్తి వ్యాపారాలు సాగిస్తున్నారు.

చిత్రంలో కనిపిస్తున్న ఆక్రమణకు గురైన సీఎస్‌పురం మండలం అయ్యలూరివారిపల్లెలోని తిరుమలనాథుని దేవస్థానం భూములు. ఈ ఆలయానికి రూ.30 కోట్లకుపైగా విలువైన 101.9 ఎకరాల భూములున్నాయి. పలుమార్లు దేవాదాయ, రెవెన్యూశాఖల అధికారులు ఆక్రమిత భూములను పరిశీలించినా ఇంతవరకు ఒక్క సెంటు కూడా స్వాధీనం చేసుకోలేదు. కనీసం ఆక్రమణదారులను ప్రశ్నించిన దాఖలాలు గానీ, నోటీసులిచ్చిన సందర్భాలు గానీ లేవు. కొంతమంది నేతల అండదండలతో అక్రమార్కుల చేతుల్లోనే నేటికీ ఆలయ భూములున్నాయి. వీటిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

## నల్లమలపై స్పందిస్తే స్వర్గధామమే

పెద్దదోర్నాల: ప్రకృతి రమణీయతకు నిలయం నల్లమల. ఎత్తయిన కొండలు, లోతైన లోయలు, పచ్చని గడ్డి మైదానాలు, గలగల పారే సెలయేర్లు, అరుదైన వన్య ప్రాణులు, ఔషద మొక్కలతో పర్యావరణ సమతుల్యతకు నిలయమైన ఈ ప్రాంతం పర్యాటకులను ఆకర్షిస్తోంది. మార్కాపురం కేంద్రంగా నూతన జిల్లా ఏర్పడడంతో పర్యాటక కేంద్రాల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారిస్తుందని జిల్లావాసులు ఆశాభావంతో ఉన్నారు. పెద్దదోర్నాలలోని శ్రీశైలం రహదారిలో అటవీశాఖ చెక్‌పోస్టు సమీపంలో రూ.కోటితో ఏర్పాటు చేసిన అడ్వెంచర్ పార్కును ప్రారంభిచకపోవడంతో పరికరాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. ఆత్మకూరు రహదారిలోని రోళ్లపెంట సమీపంలో పర్యావరణ విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు ఏడేళ్ల కిందట భవనాన్ని సిద్ధం చేసినా ప్రారంభించలేదు. శ్రీశైలం వెళ్లే రహదారిలో వీర్లకొండపైకి పర్యాటకులు కాలినడకన చేరేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినప్పటికీ వినియోగంలోకి తీసుకురాలేదు. ఇప్పటికైనా పాలకులు, స్పందించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలి.

## ఎస్సీ, ఎస్టీలకు ఉచిత సౌర విద్యుత్తు



మార్కాపురం : పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్యుత్తు బిల్లుల నుంచి ఉపశమనం కల్పించే క్రమంలో సౌర విద్యుత్తు వినియోగాన్ని పెంచే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయి. 'ప్రధాన మంత్రి సూర్యఘర్' పథకంలో భాగంగా ఇంటి పైకప్పు నుంచే విద్యుత్తు ఉత్పత్తి చేసి నిల్వ చేసుకునే అవకాశం కల్పిస్తోంది. దీని ద్వారా కలిగే ప్రయోజనాలపై సంబంధిత అధికారులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. కుటుంబ ఆదాయంతో సంబంధం లేకుండా దరఖాస్తు చేసుకున్న ప్రతి ఇంటికి సౌరవిద్యుత్తు కనెక్షన్ అమర్చనున్నారు. మూడు కిలో వాట్లకు గరిష్ఠంగా రూ.78 వేల వరకు ఆర్థికసాయం అందిస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు సోలార్ ఫలకలను నూరు శాతం రాయితీపై ఉచితంగానే అమలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆయా సామాజికవర్గాల వారీగా ఉన్న విద్యుత్తు కనెక్షన్ల వివరాలను జిల్లా అధికారులు సేకరించారు. తద్వారా ఇప్పటికే లబ్ధి పొందనున్న కుటుంబాల సర్వే వివరాలు పూర్తి చేశారు. ఈ ఏడాది తొలి విడతగా జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు సంబంధించి 33,022 కనెక్షన్లు ఏర్పాటు లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించింది.

**ఇరువురికి లాభమే..**

సౌర విద్యుత్తు కనెక్షన్లతో లబ్ధిదారులతోపాటు ప్రభుత్వానికి ప్రయోజనమే. సౌర ఫలకలపై పెట్టుబడితో ప్రభుత్వంపై మొదట కొంత ఆర్థిక భారం పడినా దీర్ఘ కాలంలో విద్యుత్తు కొనుగోలు, పంపిణీ ఖర్చు భారీగా తగ్గనుంది. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు నెలకు 200 యూనిట్లలోపు విద్యుత్తు వినియోగించే వారికి ఉచితంగా సరఫరా చేస్తున్నారు. ఒక్కో యూనిట్‌కు సరాసరిన సుమారు రూ.6 వరకు ప్రభుత్వమే ఖర్చు చేస్తోంది. అదే సోలార్ ద్వారా అందించగలిగితే సొమ్ము ఆదా అయినట్లే. ఎస్సీ, ఎస్టీ కుటుంబాల్లో ఎక్కువ మంది 100 నుంచి 150 యూనిట్ల మధ్యనే వినియోగిస్తుంటారు. ఈ నేపథ్యంలో అందరికీ 2 కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ అమర్చనున్నారు. తద్వారా నెలకు సరాసరిన 200 యూనిట్ల వరకు సౌర విద్యుత్తు ఉత్పత్తి కానుంది. దీంతో సదరు వినియోగదారులకు బిల్లురాదు. మరోపక్క ప్రభుత్వానికి భారం ఉండదు. ఒకసారి ఫలకలు ఏర్పాటు చేస్తే 25 ఏళ్లపాటు నిరంతరాయంగా వినియోగించవచ్చు.

**టెండర్ల పూర్తి**

కందుకూరు, కనిగిరి, మార్కాపురం విద్యుత్తుశాఖ డివిజన్లలో టెండర్లు పూర్తయ్యాయి. ఒంగోలు, దర్శి డివిజన్లకు ఒకరు చొప్పునే టెండరు వేయడంతో వాటిని రద్దు చేసి మరోసారి పిలిచారు. ఇప్పటికే మూడు డివిజన్లలో పనులు దక్కించుకున్న గుత్తేదారులు సర్వే చేసి, ఆ తర్వాత ఆసక్తి ఉన్న వినియోగదారులకు సోలార్ అమర్చనున్నారు. సౌర ఫలకల ఏర్పాటుకు ఇంటి పైకప్పుపై కనీసం 100 చదరపు అడుగుల స్థలం అవసరం. మిగిలిన టెండర్లు కూడా పూర్తి కానున్నాయి, ఈ మేరకు త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు విద్యుత్తుశాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని విద్యుత్తు కనెక్షన్లు

గృహ విద్యుత్తు కనెక్షన్లు: 9,09,990

ఎస్సీ కుటుంబాలవి: 1,60,983

ఎస్టీ కుటుంబాలవి : 22,604

## జల సంరక్షణ... మౌలిక వసతుల కల్పన



ఒంగోలు : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్' (వీబీజీ రామ్ జీ) పేరిట అమలు చేసేందుకు శ్రీకారం చుట్టింది. మార్పులు, చేర్పులతో పథకాన్ని ఏప్రిల్ నుంచి అమల్లోకి తీసుకురానుంది. రాష్ట్ర పంచాయరాజ్‌శాఖ ఆదేశాల మేరకు ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించనున్నారు. పథకంలో చేసిన మార్పులకు అనుగుణంగా కేంద్రం 'వీబీజీ రామ్ జీ' పేరిట పథకాన్ని కొనసాగించనున్నారు. అందులో చేపట్టాల్సిన కార్యక్రమాలు, పనులపై వివరించనున్నారు. రెండు జిల్లాల్లోని అన్ని గ్రామాల్లో ఎంపీడీవోల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు గ్రామసభలు నిర్వహించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. మార్కాపురం మండలం తిప్పాయపాలెంలో నిర్వహించనున్న గ్రామసభలో కలెక్టర్ రాజాబాబు, జిల్లా అధికారులు హాజరు కానున్నారు.

**ఉపాధి నిధులతోనే పల్లె ప్రగతి**ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా గ్రామాల్లో శాశ్వత భవనాల నుంచి అన్ని రకాల రహదారుల నిర్మాణానికి జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద విడుదల చేయనున్న మెటీరియల్ కాంపొనెంట్ నిధులే ప్రధాన వనరు. 'వీబీ-జీ రామ్ జీ' అమల్లోకి వచ్చాక కూలీలకు పనిదినాలు పెరగనున్న నేపథ్యంలో కాంపొంనెంట్ నిధులు కూడా పెరగనున్నాయి. తద్వారా పల్లెల్లో సీసీ, మట్టి, బీటీ రహదారులు, మురుగు కాలువలు, పండ్లతోటలు, మొక్కల పెంపకంతోపాటు ఇంకుడు గుంతలు వంటి జల సంరక్షణ పనులకు నిధులు కేటాయిస్తారు. **ఉపయోగాలివి** ప్రస్తుతం కూలీలకు 100 రోజులపాటు కల్పిస్తున్న పనిదినాలు 125 రోజులకు పెరగనున్నాయి. ఆర్థిక సంవత్సరానికి అయ్యే వ్యయంలో 90 శాతం కేంద్రం, మిగిలిన 10 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుండగాబీ ఇకపై 60:40 నిష్పత్తిలో ప్రభుత్వాలు నిధులు కేటాయించాల్సి ఉంటుంది. పథకం అమలులో భాగంగా వ్యవసాయ పనుల కాలంలో 60 రోజుల పాటు ఉపాధిహామీ పనులను నిలుపుదల చేసి రైతులకు వెసులుబాటు కల్పిస్తారు. వికసిత్ భారత్-2047 లక్ష్యాల ప్రకారం గ్రామపంచాయతీ ప్లాన్ ఆధారంగా నిధులు కేటాయిస్తారు.

## వస్తోంది గ్రీన్ సిగ్నల్!

కొయ్యలగూడెం : జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ హైవేపై వాహనాల పరుగుకు సమయం ఆసన్నమైంది. సంక్రాంతికి ఈ రహదారిపై వాహనాల రాకపోకలకు 'గ్రీన్'సిగ్నల్ ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించి వైరా నుంచి జంగారెడ్డిగూడెం వరకు వదలాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణలోని ఖమ్మం నుంచి తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి వరకు నిర్మితమైన యాక్సిస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ రహదారి పొడవు 162.10కి.మీటర్ల కాగా అందులో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 56.88 కి.మీ మేర ఉంది. చింతలపూడి మండలం రేచర్ల సమీపంలో ఈ రహదారి ఏలూరు జిల్లాలోకి ప్రవేశించి దాదాపు 40



కి.మీ. మేర జిల్లాలోని కన్నాయగూడెం వరకు కొనసాగుతోంది. అయితే జిల్లాలోనే యర్రంపేట, కన్నాయగూడెం సమీపంలో కోర్టు కేసు నేపథ్యంలో పనులకు ఆటంకం కలిగినా ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. కేవలం రెండు కిలో మీటర్లు మేర మాత్రమే అప్పట్లో పెండింగ్ పడినా మిగిలిన రహదారి మొత్తం పూర్తయ్యింది. మరో రెండు నెలల్లో పూర్తి.. మరో రెండు నెలల్లో ఈ రహదారి పెండింగ్ పనులు పూర్తి కావచ్చని సంబంధిత అధికారులు అంచనా వేస్తున్నారు. రహదారి మొత్తం పూర్తయి త్వరలోనే వాహనాల రాకపోకలు సాగితే ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు దూరాభారం తగ్గనుంది.

## తెలుసుకుంటే మేలు.. లేకుంటే బిల్లు పేలు!

కలిదిండి : రొయ్యల సాగులో విద్యుత్తు వినియోగంపై అవగాహన లేని రైతులు పరోక్షంగా దోపిడీకి గురవుతున్నారు. వాతావరణంలోని మార్పులకు అనుగుణంగా రైతులు ఏరియేటర్లు తిప్పుతుంటారు. తరవాత వాటిని కట్టేస్తారు. అంతటితో పని అయిపోయిందనుకుంటారు. ఇక్కడే పెద్ద చిక్కొచ్చి పడుతోంది. ఏరియేటర్లతో పాటు పాసిటర్‌ను ఆఫ్ చేయకపోవడంతో మీటరు రీడింగ్ తిరిగిపోతోంది. దీంతో వాడుకున్న విద్యుత్తుతో పాటు వాడని విద్యుత్తుకూ బిల్లు వచ్చేస్తుంది. ఈ విషయం తెలియని సాగుదారులు లబోదిబోమంటూ బిల్లు కట్టడం తప్ప. ఎందుకొస్తుందో తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. దీనిపై అధికారులూ అవగాహన కల్పించడం లేదు. '5 ఎకరాల్లో రొయ్యల చెరువుకు నెలకు 8,000 యూనిట్లు ఖర్చవుతుంది. బిల్లు



మాత్రం 14,000 యూనిట్లకు వస్తోంది. రాయితీ లేనందున యూనిట్‌కు రూ.4 చొప్పున నెలకు రూ.24 వేలు వినియోగించని విద్యుత్తుకు బిల్లు కట్టాల్సి వచ్చింది. ఈ విధంగా కొన్ని నెలలుగా రూ.5 లక్షలు నష్టపోయా. దీనికి కారణం పాసిటర్ ఆఫ్ చేయకపోవడమే అని తెలిసి అవాక్కయ్యా' అంటూ వాపోయారు కోరుకొల్లుకు చెందిన ఓ రొయ్యల రైతు.

**అవగాహన కల్పిస్తాం**

పాసిటర్ ఆన్‌లో ఉంటే మీటరు నడుస్తూనే ఉంటుంది. దీని ఆధారంగా బిల్లు వచ్చేస్తుంది. ఇది రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విధానం. చెరువు వద్ద విద్యుత్తు వినియోగం పూర్తయిన తరవాత పాసిటర్‌ను ఆపివేయాలి. దీనిపై సాగుదారులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తాం. జీబీ శ్రీనివాసరావు, విద్యుత్తు ఈఈ

## ఆ దారం వాడొద్దు.. అంధకారం కానీయొద్దు..!

శ్రీకాకుళం : సంక్రాంతి వస్తోందంటే చాలు ఉత్సాహం ఉరకలేస్తుంది. పిల్లలతో పాటు పెద్దలు సైతం ఆటపాటలతో సందడిగా గడుపుతారు. మిద్దెలు, డాబాలు, మైదాన ప్రదేశాల్లో పోటాపోటీగా గాలి పటాలు ఎగరేస్తారు. పతంగులకు కట్టే దారం తెగిపోకుండా ఉండేందుకు చైనా మాంజాలను వినియోగిస్తుంటారు. అది అత్యంత ప్రమాదకరం. వాటి వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోయిన సందర్భాలూ ఉన్నాయి. విహంగాలకూ ముప్పు వాటిల్లుతోంది. ఈ నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ మాంజాతో గాలిపటాలు ఎగరేయ్యొద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

**ప్రమాదాలు ఎందుకు జరుగుతాయంటే..**

చైనా మాంజాలను నైలాన్, సింథటిక్, ఫైబర్ దారాలతో వీటిని తయారు చేస్తారు. మాంజాను గాజుపొడి, అల్యూమినియం ఆక్సైడ్, లోహచూర్ణం, రంగులు, కృత్రిమ జిగురు మిశ్రమంలో ఉంచి ఎండబెడతారు. అలా చేయడంతో దారం తెగి పోకుండా పదునుగా ఉంటుంది. ఈ దారాన్ని గట్టిగా లాగితే చేతులు కూడా తెగిపోతుంటాయి. మెడ, గొంతు లాంటి సున్నిత ప్రదేశాల్లో చుట్టుకుంటే గాయాల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఒక్కోసారి అధిక రక్తస్రావమై ప్రాణాలు కోల్పోయే ప్రమాదముందని వైద్యులు చెబుతున్నారు.

**అప్రమత్తత అవసరం..**

ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు వీధుల్లో పరిసరాలను గమనిస్తూ వెళ్లాలి. గాలిపటం తెగితే ఎగరేసిన వ్యక్తే మాంజాను గుర్తించి తొలగించాలి.


గాలి పటాలను ఎగరేసేందుకు సంప్రదాయ పద్ధతిలో పత్తితో తయారైన దారాన్నే వాడాలి. అప్పుడే ప్రమాదాలను నివారించడానికి వీలుంది. రోడ్లు, విద్యుత్తు తీగలు, చెట్లు, పైవంతెనలు ఉన్న చోట పతంగులు ఎగరేయొద్దు. దారం తెగి చెట్టు కొమ్మలు, తీగల్లో ఇరుక్కుంటే వాటిని తొలగించే ప్రయత్నం చేయడం సరైంది కాదు. అలాంటి సమయాల్లోనే ప్రమాదాలు సంభవిస్తాయి. క్రీడా మైదానాల్లో మాత్రమే గాలి పటాలను ఎగరేయడం మేలు. ఇతర ప్రాంతాల్లో ఎగరేస్తే తగిన జాగ్రత్తలు పాటించాలి.

'ఎక్కడైనా చైనా మాంజా విక్రయిస్తున్నట్లు తెలిస్తే తక్షణమే పోలీసులకు సమాచారమివ్వండి. దుకాణదారులపై చర్యలు తీసుకుంటాం' అని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద తెలిపారు.




## మొత్తం అంతా నువ్వే అంటున్న దివి.. ఏంటి సంగతులు బేబీ!

ఇటీవల కాలంలో కొంతమంది హీరోయిన్స్ ప్రత్యేకించి సోషల్ మీడియాలో గ్లామర్ వలకబోస్తూ.. ఫాలోవర్స్ ను పెంచుకోవడం అటు ఉంచితే.. ఇటు తమ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను క్యాప్షన్ రూపంలో హింట్ ఇస్తూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నారు. నిజానికి తమ అందంతో అభిమానులను ఆకట్టుకోవడం ఒక ఎత్తైతే.. ఆ అభిమానులను సంపాదించుకోవడం మరో ఎత్తు.. ఇక పాపులారిటీ కోసం హీరోయిన్స్ పడే కష్టం అంతా ఇంతా కాదు.. రోజుకొక ఫోటోషూట్ తో నిత్యం అభిమానులను అలరించడానికి కష్టపడిపోతున్నారు అనడంలో సందేహం లేదు. ముఖ్యంగా ఆడియన్స్ లో పాపులారిటీ దక్కించుకొని.. అటు దర్శక నిర్మాతల కంట్లో పడి.. సరైన సక్సెస్ లభిస్తే కెరియర్ను మార్చుకోవాలని చూసే అమ్మాయిలు ఎంతోమంది.. ఇక అలాంటి అందగత్తెలలో దివి కూడా ఒకరు. తన అందంతో అమాయకత్వంతో అందరి దృష్టిని ఆకట్టుకుంటూ.. ఎలాంటి పాత్రలోనైనా సరే జీవించగలను అని నిరూపిస్తున్న ఈ లేడి తాజాగా షేర్ చేసిన ఫోటోలు అభిమానులలో సరికొత్త అనుమానాలు కలిగిస్తున్నాయి. అసలు విషయంలోకి వెళ్తే.. తాజాగా మెరూన్ రెడ్ కలర్ టాప్ డెనిమ్ జీన్స్ ధరించిన ఈమె



నడుము అందాలను హైలైట్ చేస్తూ ఫోటోలకు ఫోజులిచ్చింది. కొన్ని ఫోటోలలో ముసి ముసి నవ్వులు నవ్వుతూ ఫోటోలు షేర్ చేసిన ఈమె.. మరికొన్నింటిలో ఒళ్ళు విరుస్తూ వయ్యారంగా ఉన్న ఫోటోలు పంచుకుంది. ఇందులో కాటుక కళ్ళతో కుర్రకారును మాయ చేస్తూ అభిమానుల గుండెల్లో గుణపాలు దింపుతోంది ఈ సొట్ట బుగ్గల సుందరి. ఒక రకంగా చెప్పాలి అంటే దివి అందానికి అభిమానులు ఫిదా అవుతున్నారు. అంతేకాదు మల్లి నీతో పాటు పెరిగి.. నీతో గడిపిన క్షణాలను మధురంగా మార్చుకోవాలని చూస్తున్నాను.. దీనికి నువ్వు ఒప్పుకుంటావా సఖి అంటూ ఒక అభిమాని ఏకంగా కామెంట్ పెట్టేశారు. ఇంకొకరేమో పాలరాతి శిల్పం అని , క్యూట్ అంటూ ఇలా రకరకాలుగా తమ అభిప్రాయాలను కామెంట్ రూపంలో పంచుకుంటున్నారు. ప్రస్తుతం దివి షేర్ చేసిన ఫోటోలు వైరల్ గా మారుతున్నాయి. ఇక్కడ ఆశ్చర్యం ఏమిటంటే.. దివి తన గ్లామర్ ఫోటోలను పంచుకోవడమే కాకుండా ఈ ఫోటోలకు క్యాప్షన్ గా “మొత్తం అంతా నువ్వే మరి” అంటూ ఒక లవ్ ఎమోజిని షేర్ చేసింది. ఇది చూసిన నెటజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొంపతీసి లవ్లో పడిపోయావా అంటూ కామెంట్ చేస్తుంటే.. మరికొంతమంది ఏమో ఎవరితోనైనా డేటింగ్ లో ఉందేమో అందుకే ఇలాంటి క్యాప్షన్ జోడించింది అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇంకొంతమంది ఏంటి బేబీ సంగతులు.. ఇలాంటి క్యాప్షన్ ఇచ్చావు అంటూ అడుగుతున్నారు. ఏది ఏమైనా దివి పెట్టిన ఈ ఒక్క పోస్టు ఇప్పుడు ఈమెను వార్తల్లో నిలిచేలా చేసింది అనడంలో సందేహం లేదు.

## పుష్ప రాజ్ మాస్ ప్లానింగ్.. అస్సలు తగ్గేదేలే..!

పుష్ప రెండు భాగాలతో పాన్ ఇండియా స్టార్ గా మారిన అల్లు అర్జున్ సినిమా అంటే చాలు నేషనల్ లెవెల్ లో ఒక రేంజ్ డిస్కషన్స్ జరుగుతున్నాయి. పుష్ప రాజ్ గా పూనకాలు తెప్పించే పెర్ఫార్మెన్స్ తో మెప్పించిన ఐకాన్ స్టార్ నెక్స్ట్ అట్లీతో మరో అద్భుతానికి రెడీ అవుతున్నాడు. అట్లీ తో అల్లు అర్జున్ చేస్తున్న సినిమా ప్రతి అప్డేట్ నెక్స్ట్ లెవెల్ అనిపిస్తుంది. ఈ సినిమా తర్వాత మరో తమిళ దర్శకుడు లోకేష్ కనకరాజ్ తో అల్లు అర్జున్ సినిమా లాక్ చేసుకున్నాడు. కూలీతో కాస్త డిజప్పాయింట్ చేసిన లోకేష్ బన్నీ సినిమాతో బౌన్స్ బ్యాక్ అవ్వాలని చూస్తున్నాడు.

**అర్జున్ రెడ్డి తో సత్తా చాటి..** ఐతే ఈ రెండే కాదు అల్లు అర్జున్ ఈ రెండిటి తర్వాత రాబోయే సినిమా ప్లానింగ్ కూడా చేసినట్టు తెలుస్తుంది. యానిమల్ డైరెక్టర్ సందీప్ వంగా తో అల్లు అర్జున్ సినిమా ఉ



ండబోతుంది. అర్జున్ రెడ్డి సినిమాతో తన సత్తా చాటి యానిమల్ తో నేషనల్ లెవెల్ లో సత్తా చాటిన సందీప్ వంగ అర్జున్ రెడ్డి సినిమాను ముందు అల్లు అర్జున్ తోనే చేయాలని అనుకున్నాడు. అప్పుడు కుదరలేదు కానీ ప్రభాస్ తో సందీప్ వంగ చేస్తున్న సినిమా తర్వాత అల్లు అర్జున్ ప్రాజెక్ట్ ఫైనల్ అయినట్టు తెలుస్తుంది. సో అట్లీ, లోకేష్ ఆ తర్వాత సందీప్ వంగ.. అల్లు అర్జున్ సినిమాల ప్లానింగ్ చూస్తుంటే ఫ్యాన్స్ కి గూస్ బంప్స్ అనేలా ఉన్నాయి. తప్పకుండా ఈ సినిమాలతో బన్నీ మరోసారి పాన్ ఇండియా లెవెల్ లో తన మాస్ స్టామినా చూపించే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. ఓ పక్క ప్రభాస్ పాన్ ఇండియా సినిమాలతో దూసుకెళ్తుంటే ఆ తర్వాత ప్లేస్ లో అల్లు అర్జున్ కూడా క్రేజీ కాంబినేషన్స్ సెట్ చేసుకుంటున్నాడు.

**మహేష్ రాజమౌళి సినిమాతో..** తెలుగు నుంచి ప్రభాస్ ఆ తర్వాత అల్లు అర్జున్ ఇద్దరు కూడా టాలీవుడ్ స్టార్ స్టామినా ఏంటో ప్రూవ్ చేస్తున్నారు. అఫ్కోర్స్ వారి దారిలోనే ఎన్ టీ ఆర్, రాం చరణ్ కూడా వెళ్తున్నారు. ఇక మహేష్ కూడా రాజమౌళి సినిమాతో చేస్తున్నాడు. తప్పకుండా ఈ స్టార్స్ అంతా కూడా టాలీవుడ్ ని కేవలం పాన్ ఇండియా కాదు పాన్ వరల్డ్ రేంజ్ కి తీసుకెళ్తున్నారు. ప్రభాస్ లైన్ లో ఫౌజీ, స్పిరిట్ ఉన్నాయి. అవే కాకుండా సలార్ 2, కల్కి 2 చేయాల్సి ఉంది. ఇక అల్లు అర్జున్ కూడా 3 సినిమాలు లైన్ లో పెట్టాడు. మహేష్ వారణాసి కోసం 2 ఏళ్లు టైం ఇవ్వగా చరణ్ పెద్ది ఆ నెక్స్ట్ సుకుమార్ సినిమాలు చేస్తున్నాడు. ఇక తారక్ మాత్రం ప్రశాంత్ నీల్ తో సినిమా సెట్స్ మీద ఉంది. ఈ సినిమాలన్నీ కూడా టాలీవుడ్ స్టార్ ఫ్యాన్స్ అందరికీ కూడా ఒక రేంజ్ మాస్ ఫీస్ట్ ఇచ్చేలా ఉన్నాయి.


## యూత్ పల్స్ పట్టుకునేలా గాబరా గాబరా సాంగ్




ఈ మధ్యకాలంలో చిన్న సినిమాల హవా గట్టిగానే నడుస్తోంది. కంటెంట్ బాగుంటే ఆడియన్స్ బ్రహ్మరథం పడుతున్నారు. ఈ క్రమంలోనే యూవీ క్రియేషన్స్ సమర్పణలో వస్తున్న కపుల్ ఫ్రెండ్లీ సినిమా ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని యూవీ కాన్సెప్ట్స్ బ్యానర్పై అజయ్ కుమార్ రాజు.పి నిర్మించారు. ఈ సినిమా ఫిబ్రవరి 14న వాలెంటైన్స్ డే సందర్భంగా తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్?గా రిలీజ్ కాబోతోంది. ఈ మూవీలోని సెకండ్ సింగిల్ గాబరా గాబరా సాంగ్ ఇప్పుడు సోషల్ మీడియాలో బజ్ క్రియేట్ చేస్తోంది. ఆదిత్య రవీంద్రన్ కంపోజ్ చేసిన ఈ పాటను స్టార్ సింగర్ సంతోష్ నారాయణన్ తనదైన స్టైల్లో పాడారు. సాంగ్ వింటుంటే చాలా ఫ్రెష్గా, నేటి జనరేషన్ లైఫ్?స్టైల్?కు అద్దం పట్టేలా అనిపిస్తోంది. లైఫ్ మొత్తం గందరగోళంగా ఉన్నప్పుడు ఒక కుర్రాడి ఫీలింగ్స్ ఎలా ఉంటాయనేది ఈ సాంగ్?లో క్లియర్ గా కనిపిస్తోంది. ఇక రాకేందు మౌళి అందించిన సాహిత్యం చాలా వెరైటీగా ఉంది. మనం రోజువారీ లైఫ్ లో ఫేస్ చేసే చిన్న చిన్న ఇబ్బందులు, కన్ఫ్యూజన్స్ ని సరదాగా లిరిక్స్ లో పొందుపరిచారు. బంతి భోజనంలో బంతిని వడ్డిస్తారా అంటూ సాగే లైన్స్ భలే ఫన్నీగా ఉన్నాయి. సంతోష్ నారాయణన్ వాయిస్ లో ఉండే ఆ కిక్ పాటని పదే పదే వినేలా చేస్తోంది. మ్యూజిక్ కూడా రొటీన్ కి భిన్నంగా చాలా కొత్తగా అనిపిస్తుంది. వీడియోలో హీరో సంతోష్ శోభన్ పెర్ఫార్మెన్స్ చాలా నేచురల్ గా ఉంది. ఆఫీస్ టెన్షన్లు, సిటీలో ట్రాఫిక్ కష్టాలు, ప్రయాణాల్లో పడే అవస్థలు ప్రతి ఒక్కరికీ రిలేట్ అయ్యేలా ఉన్నాయి. హీరోయిన్ మానస వారణాసి కూడా ఈ సాంగ్ లో చాలా సింపుల్ గా, పద్ధతిగా కనిపిస్తూ ఆకట్టుకుంది. వీరిద్దరి మధ్య ఉండే ఆ చిన్నపాటి ఎమోషన్ కూడా ఈ సాంగ్ లో బాగా ఎలివేట్ అయ్యింది. హీరో సంతోష్ శోభన్ విషయానికి వస్తే, తన కెరీర్ లో ఒక సాలిడ్ సక్సెస్ కోసం చాలా కాలంగా వెయిట్ చేస్తున్నారు. ఎంచుకునే కథలు వైవిధ్యంగా ఉన్నా, బాక్సాఫీస్ దగ్గర సరైన హిట్ పడితే తన రేంజ్ మారుతుంది.

కపుల్ ఫ్రెండ్లీ సినిమాతో ఆ వెలితి తీరుతుందని తన ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. ఈ గాబరా గాబరా సాంగ్ కు వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ అయినట్టే కనిపిస్తోంది. ఒక ఆర్టిస్ట్ గా సంతోష్ శోభన్ తన బెస్ట్ ఇస్తూనే ఉన్నారు. కష్టపడితే ఫలితం తప్పకుండా ఉంటుందన్నట్టుగా, ఈ సినిమాతో కోరుకున్న విజయం దక్కుతుందని ధీమాగా ఉన్నది. ఫిబ్రవరి 14న థియేటర్లలో ఈ కపుల్ ఫ్రెండ్లీ స్టోరీ ఎలా ఉంటుందో చూడాలి.

## గాంధీ టాక్స్ ట్రైలర్.. మాటల్లేవ్ మాట్లాడుకోవడాల్లేవ్..!




సినిమాను ఎంత కొత్తగా తీస్తే ఇప్పటి ప్రేక్షకులు అంత ఎక్కువ ఆదరిస్తున్నారు. అందుకే సినీ మేకర్స్, క్రియేటర్స్ కూడా ఒక సినిమాను ఎంత కొత్తగా తీయాలి అన్న దాని మీద ఫోకస్ చేస్తున్నారు. కోట్ల కొద్దీ బడ్జెట్ పెట్టి సినిమా తీసినా అందులో ఎలాంటి కొత్తదనం లేకపోతే ఆడియన్స్ దాన్ని తిప్పికొడతారు. లిమిటెడ్ బడ్జెట్ తో తీసినా కొత్త పాయింట్ తో ప్రేక్షకులను మెప్పించగలిగితే చాలు దాన్ని వాళ్లు భుజాన వేసుకుని సక్సెస్ చేస్తారు. ఐతే ఈ లాజిక్ మాక్సిమం చాలా సినిమాలకు వర్క్ అవుట్ అయ్యింది.. అవుతుంది. ఏవో ఒకటి అర మిస్ ఫైర్ అవుతాయి. నటీనటుల అభినయానికి మ్యూజిక్ డైరెక్టర్ ఏ.ఆర్ రెహమాన్ సంగీతం.. ఐతే ప్రేక్షకులకు ఒక కొత్త సినిమాటిక్ ఎక్స్ పెరిమెంట్ అందించాలని డైరెక్టర్ కిషోర్ పండురంగ్ బెలెకర్ చేస్తున్న ప్రయత్నమే గాంధీ టాక్స్.

విజయ్ సేతుపతి, అదితి రావు హైదరి, అరవింద సామితో పాటు మరికొంతమంది ముఖ్య తారాగణంతో వస్తున్న ఈ సినిమా ట్రైలర్ లేటెస్ట్ గా రిలీజైంది. గాంధీ టాక్స్ అంటే కరెన్సీ నోటు మీద ఉన్న గాంధీ మాట్లాడటం అనే అర్థం ఉన్నా భావాలకు భాష కాదు కాదు అసలు మాటలే అవసరం లేదు అన్నట్టుగా సినిమా మూకీగా తీస్తున్నారు. గాంధీ టాక్స్ సినిమా రిలీజైన ట్రైలర్ చూస్తే తెర మీద నటీనటుల అభినయానికి మ్యూజిక్ డైరెక్టర్ ఏ.ఆర్ రెహమాన్ సంగీతం. అవే మాటలు అనిపించేలా చేశారు. రెహమాన్ కి ఆఫ్టర్ లాంగ్ టైం ఒక మంచి వర్క్ ఇచ్చే ప్రాజెక్ట్ ఇది అయ్యిందని చెప్పొచ్చు. అనుకున్నట్టుగానే ట్రైలర్ లో రెహమాన్ మ్యూజిక్ నెక్స్ట్ లెవెల్ ఉంది. గాంధీ టాక్స్ కేవలం సినిమా ట్రైలర్ లోనే ఇలా మూకీ సినిమా చూపిస్తారా లేదా సినిమా అంతా ఇంతేనా అన్నది తెలియాల్సి ఉంది.

**విజయ్ సేతుపతి ఫ్యాన్స్ కి ఈ సినిమా సంథింగ్ స్పెషల్..** ఏది ఏమైనా విజయ్ సేతుపతి నుంచి వస్తున్న మరో ఇంట్రెస్టింగ్ సినిమాగా గాంధీ టాక్స్ వస్తుంది. ఈ సినిమాలో విజయ్ సేతుపతి, అరవింద్ సామి యాక్టింగ్ ఆకట్టుకునేలా ఉంది. రెహమాన్ మ్యూజిక్ మేజర్ హైలెట్ అవ్వనున్న ఈ మూవీని జనవరి 30న రిలీజ్ ప్లాన్ చేశారు. తప్పకుండా విజయ్ సేతుపతి ఫ్యాన్స్ కి ఈ సినిమా సంథింగ్ స్పెషల్ వైబ్ ఇస్తుందని చెప్పొచ్చు. ఈ ట్రైలర్ చూడగానే ఎప్పుడో 3 దశాబ్దాల క్రితం మన తెలుగు దర్శకుడు సింగీతం శ్రీనివాస్ రావు చేసిన పుష్పక విమానం గుర్తుకొస్తుంది. గాంధీ టాక్స్ ఈ సైలెంట్ ట్రైలర్ చాలా పెద్ద సంచలనమే సృష్టించేలా ఉంది. ట్రైలర్ లానే సినిమా కూడా అంతే పెద్ద సెన్సేషన్ అవుతుందా లేదా అన్నది చూడాలి. రెగ్యులర్ సినిమాలకు భిన్నంగా ఒక డిఫరెంట్ అటెంప్ట్ తో ఈ సినిమా వస్తుంది. చూస్తుంటే విజయ్ సేతుపతి మహారాజా తర్వాత మరో సినిమా ఆ రేంజ్ సూపర్ హిట్ ఇచ్చేలా ఉంది.

## ఎలిగెంట్ లుక్ లో మెస్మరైజ్ చేస్తున్న తమన్నా!

బాలీవుడ్ నుండి టాలీవుడ్ వరకు తన అందం, అభినయం తో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా, సోషల్ మీడియాలో మరోసారి సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. తాజాగా ఆమె పోస్ట్ చేసిన ఫోటోలు ఇంటర్నెట్ను షేక్ చేస్తున్నాయి. ఎప్పుడూ ట్రెండీగా ఉండే తమన్నా, ఈసారి క్లాసిక్ , ఎలిగెంట్ లుక్ లో మెరిసిపోతూ కుర్రకారు గుండెల్లో సెగలు పుట్టిస్తోంది. స్టైలిష్ అవుట్ఫిట్లో మెరిసిపోతున్న మిల్కీ బ్యూటీ ను చూసి అభిమానులు క్వీన్ ఆఫ్ స్టైల్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు.. తమన్నా తన ఫ్యాషన్ సెన్స్ గురించి చెబుతూ ఆభరణాల ఎంపికపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. “నాకు ఆభరణాలు అంటే ఎప్పుడూ కేవలం ఇతరుల దృష్టిని ఆకర్షించడం గురించి మాత్రమే కాదు, అవి మన వ్యక్తిత్వానికి ఎంతలా అమరుతాయనేది ముఖ్యం. ఆభరణం మన వ్యక్తిగత శైలిని పెంచాలి తప్ప, అది మనల్ని అధిగమించకూడదు” అని ఆమె పేర్కొన్నారు. తాను ఎప్పుడూ మెరుగైన బేసిక్స్ను ఇష్టపడతానని, సహజంగా అనిపించే వస్తువులను ధరించడం, ఒక



ఉద్దేశంతో వాటిని సేకరించడం తన అలవాటని వివరించారు. చక్కటి ఆభరణాలలో పెట్టుబడి పెట్టడం అంటే, అవి కేవలం అలంకరణ వస్తువులుగా కాకుండా, మనల్ని మనం వ్యక్తీకరించే విధానంలో ఒక భాగంగా మారాలని ఆమె తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. తమన్నా షేర్ చేసిన తాజా ఫోటోలలో ఆమె ధరించిన అవుట్ఫిట్ ఆమె ఎలిగెన్స్ను నెక్స్ట్ లెవల్కు తీసుకెళ్లింది. మినిమల్ మేకప్, సింపుల్ హెయిర్ స్టైల్ , ఆమె సిగ్నేచర్ స్మైల్?తో కెమెరాకు ఫోజులిచ్చిన తీరు నెటిజన్లను కట్టిపడేస్తోంది. ఎలిగెన్స్ అంటే కేవలం బట్టలు మాత్రమే కాదు, అది మన ఆటిట్యూడ్?లో ఉంటుంది అని చెప్పకనే చెబుతోంది ఈ భామ. ఈ పోస్ట్ కింద కొందరు అభిమానులు ‘ఎవర్ గ్రీన్ బ్యూటీ’ అంటూ కామెంట్లతో ముంచెత్తుతున్నారు. కేవలం కొద్ది నిమిషాల్లోనే ఈ ఫోటోలు లక్షలాది లైకులను సంపాదించుకోవడం తమన్నా క్రేజ్ కు నిదర్శనం. ప్రస్తుతం తమన్నా తన కెరీర్లో అత్యుత్తమ దశలో ఉంది. ఒకవైపు సినిమాల్లో నటిస్తూనే, మరోవైపు ఓటీటీ ప్లాట్ఫారమ్స్ పై కూడా తన హవా చాటుతోంది. గత ఏడాది వచ్చిన ఓదెల 2 హిట్ అవ్వడంతో ఆమె జోరు పెరిగింది. హిందీలో కూడా వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంది. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకుంటూ తన ప్రత్యేకతను చాటుకుంటోంది. సోషల్ మీడియాలో ఆమె ఇచ్చే ఫ్యాషన్ స్టేట్మెంట్స్ యంగ్ హీరోయిన్లకు సైతం గట్టి పోటీనిస్తున్నాయి. ఫ్యాషన్ ప్రపంచంలో తనదైన ముద్ర వేస్తూ, ఎప్పటికప్పుడు కొత్త లుక్స్తో ప్రయోగాలు చేస్తూ మెస్మరైజ్ చేస్తోంది. ఈ లేటెస్ట్ ఎలిగెంట్ లుక్ తమన్నాలోని అసలైన క్లాస్ ను బయటకు తీసింది. ఇలాంటి మరిన్ని అద్భుతమైన లుక్స్?తో ఆమె మరింతగా అలరించాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

## అనసూయ అంటే అంత అభిమానమా? నిజంగా గుడి కడతాడా?

టాలీవుడ్ నటి, ప్రముఖ యాంకర్ అనసూయ భరద్వాజ్ పేరు కొంతకాలంగా తరచూ వార్తల్లో వినిపిస్తోంది. నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలతో మొదలైన వివాదం.. అనసూయ ఇచ్చిన స్ట్రాంగ్ కౌంటర్.. ఆ తర్వాత సోషల్ మీడియాలో ట్రోలింగ్.. ఇవన్నీ కలిసి ఆ వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది. ఈ నేపథ్యంలో తాజాగా మరో సంచలన ప్రకటన వెలుగులోకి వచ్చింది. అనసూయ కోసం గుడి కడతామంటూ ఆమె అభిమాని మురళీ శర్మ ప్రకటించడం ఇప్పుడు పెద్ద చర్చకు దారితీస్తోంది. అనసూయ అభిమాన సంఘం అధ్యక్షుడినని చెప్పుకుంటూ మురళీ శర్మ రీసెంట్ గా మీడియాలో హైలెట్ అయ్యారు. అనసూయకు మద్దతుగా ఆయన చేసిన వ్యాఖ్యలు అప్పట్లో వైరల్ గా మారాయి. ఇప్పుడు వరుస ఇంటర్వ్యూలతో ట్రెండింగ్ లో ఉంటున్నారు. తాజాగా ఓ యూట్యూబ్ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మురళీ శర్మ.. తమిళనాడులో నటి ఖుష్బూకు గుడి ఉన్నట్టు, సమంతకు గుడి ఉన్నట్టు, యాంకర్ అనసూయకు గుడి కడతామని వెల్లడించారు. అభిమానులందరూ కలిసి ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాత ఎక్కడ ఆలయం నిర్మించాలనే విషయంపై తేలుస్తామని చెప్పారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకరించాలని కోరారు. అనసూయ గారి అనుమతి



తీసుకుని, ఆమె అంగీకరిస్తేనే ఆలయ నిర్మాణం ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. అనసూయ అంటే తనకు అపారమైన గౌరవమని, ఆమె చేసిన కౌంటర్ కు పూర్తిగా మద్దతు ఇస్తున్నానని చెప్పారు. అభిమానులందరూ కలిసి అనసూయకు గుడి కడతామని.. అక్కడ పూజారులు ఉండాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రేమతో ఒక గులాబీ పెట్టినా చాలు అంటూ తనదైన శైలిలో వ్యాఖ్యానించారు. దీంతో మురళీ శర్మ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అవుతున్నాయి. కొంతమంది అభిమానులు మద్దతు తెలుపుతుంటే.. మరి కొందరు నెటిజన్లు మాత్రం గుడి నిర్మాణ ప్రకటనపై సెటైర్లు వేస్తున్నారు. నిజంగా గుడి కడతారా? ఎక్కడ కడతారు? ఎప్పుడు కడతారు? అనే ప్రశ్నలతో నెటిజన్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆ విషయం మరిన్ని మలుపులు తిరిగేలా కనిపిస్తోంది. ఇక అనసూయ విషయానికొస్తే.. జబర్దస్త్ ద్వారా యాంకర్ గా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకున్నారు. ఒకవైపు యాంకర్ గా వ్యవహరిస్తూనే.. మరొకవైపు సినిమాల్లో కూడా నటించిన ఆమె.. ఆ పాత్రలతో ఊహించని క్రేజ్ సొంతం చేసుకున్నారు. అదే సమయంలో సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్ గా ఉంటూ గ్లామర్ ఫోటోలతో ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా ఎప్పటికప్పుడు పలు విషయాలపై స్పందిస్తుంటారు. ఇప్పుడు తన గుడి కొడతామన్న ప్రకటనపై రెస్పాండ్ అవుతారో లేదో వేచి చూడాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536